ఫన్‌డే గత వారంరోజులపై విలుగ్నోప్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఖమ్మం

: fb.com/vaartha Digital


Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-4-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 74 పేజీలు: 8+16 వెల: 6.50

నోయిడా ఆందోళనల్లో పాక్ హస్తం? 5

దక్షిణాదికి అన్యాయం జరిగితే సహించం: స్టాలిన్

విధాన రూపకల్పన, నిర్ణయాలు తీసుకోవడంలో మహిళలు చురుకైన భాగస్వాములు కావాలి.. అప్పుడు 2047 నాటికి వికసిత భారత్ దిశగా సాగే ప్రయాణం మరింత బలపడుతుంది.
-ప్రధాని మోదీ బహిరంగ లేఖ



# లోక్ సభ సీట్లు @850!




## పునర్విభజన బిల్లు రెడీ

ఎంపీలకు ముసాయిదా ప్రతులు పంపిణీ

రేపటి నుంచి 3రోజులు ప్రత్యేక పార్లమెంటు


సభకు మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా

సీట్ల పెంపు విధానాన్ని వ్యతిరేకిస్తున్న విపక్షాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:** భారత రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకోబోతుంది. దేశవ్యాప్తంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను వేగవంతం చేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. గురువారం రోజున పార్లమెంటులో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రం తెలిపింది. పార్లమెంటుకు సంబంధించిన అధికారిక అజెండా వెలువడటంతో రాజకీయ వర్గాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. ప్రభుత్వ సర్క్యులర్ ప్రకారం, లోక్‌సభ సభ్యుల సంఖ్యను 543 నుండి 850కి పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ 850 స్థానాలలో, 815 స్థానాలను రాష్ట్రాలకు, 35 స్థానాలను కేంద్ర పాలిత ప్రాంతాలకు కేటాయించినట్లు ఆ సర్క్యులర్ పేర్కొంది. ఈ మార్పులు 2029 లోక్‌సభ ఎన్నికల నుండి అమల్లోకి వస్తాయని కూడా అందులో తెలిపారు. ఈ బిల్లును ఇప్పటికే పార్లమెంటు సభ్యుల(ఎంపిలు)కు అందజేసింది. ఏప్రిల్ 16 నుండి ప్రారంభం కానున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో దీనిని ప్రవేశపెట్టే అవకాశం ఉందని వార్తలు సూచిస్తున్నాయి. 2027 జనాభా లెక్కల >>2

## నేడు ఇండియా కూటమి భేటీ

డీలిమిటేషన్‌పై కేంద్రం కుట్ర: ఖర్గే 2



# దక్షిణాదికి అన్యాయమే



మంగళవారం హైదరాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్

అఖిలపక్ష సమావేశం జరిపి చర్చించండి

రాష్ట్రాలకు న్యాయం జరిగేట్లు చూడాలి

సీట్ల పెంపు లేకుంటే డీలిమిటేషన్‌కు మద్దతు

మహిళా రిజర్వేషన్‌తో ముడిపెట్టొద్దు

ప్రధాని మోడీకి సిఎం రేవంత్ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్14:** లోక్‌సభ నియోజకవర్గ స్థానాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగకుండా జాతీయ స్థాయిలో విస్తృత చర్చలు జరపాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. మంగళవారం సాయంత్రం రాసిన లేఖలో అన్ని రాజకీయ పార్టీలతో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు, ఏకాభిప్రాయ సాధన ద్వారానే ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు.దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుపై ప్రభావం కలిగించే అంశమైనందున బాధ్యతతో అత్యవసరంగా ఈ లేఖ రాసినట్లు తెలిపారు. ప్రస్తుతం మహిళల రిజర్వేషన్, పునర్విభజన, లోక్‌సభ సీట్ల పెంపు అనే మూడు వేర్వేరు అంశాలను ఒకదానితో ఒకటి ముడిపెట్టి ప్రజలలో గందరగోళం సృష్టిస్తున్నారని, అవి పూర్తిగా వేర్వేరు విషయాలని స్పష్టం చేశారు.మహిళల రిజర్వేషన్ బిల్లుకు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మద్దతు ఇస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లలోనే 33 శాతం మహిళల రిజర్వేషన్‌ను యథాతథంగా వెంటనే అమలు చేయాలని, అన్ని రాష్ట్ర అసెంబ్లీల్లో కూడా అమలు చేయాలని కోరారు. మహిళల రాజకీయ >>2

### హైబ్రిడ్ మోడల్‌కు మద్దతివ్వండి

దక్షిణాదిరాష్ట్రాల సిఎంలకు ముఖ్యమంత్రి రేవంత్ లేఖలు 7

### సీట్ల విభజనలో బిజెపి కుట్ర

అంబేద్కర్ జయంతి వేడుకల్లో సిఎం రేవంత్ 6



# మోడీకి ట్రంప్ ఫోన్

పశ్చిమాసియాలో తాజా పరిస్థితిపై చర్చలు

40 నిమిషాలకు పైగా సమాలోచనలు

హార్ముజ్ తెరిచి, సురక్షితంగా ఉంచాలని సూచించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మంగళవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుండి ఫోన్ కాల్ వచ్చింది. ఇద్దరు నేతలు పశ్చిమ ఆసియాలోని ప్రస్తుత పరిస్థితితో పాటు ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై చర్చించారు. "నా మిత్రుడు, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుండి ఫోన్‌కాల్ వచ్చింది. వివిధ రంగాలలో మనద్వైపాక్షిక సహకారంలో సాధించిన గణనీయమైన పురోగతిని తాము సమీక్షించాము. అన్ని రంగాలలో మన సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి >>2

## ఇక జెనీవాలో శాంతి చర్చలు!

కొనసాగుతున్న హార్ముజ్ దిగ్బంధనం 2

అమెరికా, చైనా మధ్య ముదిరిన దౌత్య యుద్ధం

# భారత్‌కు కాంగ్రెస్ గుండెకాయ

పార్టీకి అంతే కీలకం ఖమ్మం

భారత్ జోడో యాత్ర ద్వారా రాహుల్ గాంధీ కాంగ్రెస్‌లో మరింత జోష్ నింపారు: పిసిసి చీఫ్ మహేష్ గౌడ్

రాజ్యాంగ హక్కులను కాపాడుకుంటూ ముందుకు: డి.సిఎం భట్టి



మంగళవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న పిసిసి చీఫ్ మహేష్ గౌడ్. చిత్రంలో డి.సిఎం భట్టి, మంత్రి పొంగులేటి తదితరులు

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** భారతదేశానికి గుండెకాయ కాంగ్రెస్ పార్టీ అని, కాంగ్రెస్ పార్టీకి గుండెకాయ ఖమ్మం అని... తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని సంజీవరెడ్డి భవన్లోజిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ లో నూతనంగా గిశిదిది అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ద్వారా ఎంపికైన జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శులకు, కోశాధికారి, అధికార ప్రతినిధులకు, కార్యదర్శులకు, ఎగ్జిక్యూటివ్ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా నూతన కార్యవర్గ పదవీ బాధ్యతల స్వీకార మహోత్సవం లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామారెడ్డిలు పాల్గొన్నారు.. నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకారం చేయించారు.. ప్రమాణ స్వీకార మహోత్సవం కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ సభాధ్యక్షతన జరిగింది.. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను కాపాడుకోవాలని, కార్యకర్తలు లేనిదే మనం లేమని ఆయన అన్నారు.. గ్రామస్థాయిలో పార్టీని పటిష్ట పరుచుకోవాలనీ, పార్టీ లేకుండా ప్రభుత్వాలు లేవని, ఆనాడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు లాఠీ దెబ్బలు తిని ఉండకపోతే జైలు జీవితం గడిపి ఉండకపోతే, పార్టీ కోసం శ్రమించి ఉండకపోతే, పార్టీ అభివృద్ధి జరిగి ఉండేది కాదని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.. ప్రపంచం గర్వించదగ్గ రాజ్యాంగాన్ని రచించిన రాజ్యాంగ నిర్మాత భారత >>2



## పవర్‌ప్లాంట్‌లో పేలుడు

10 మంది మృతి, 40 మందికి గాయాలు

ఛత్తీస్‌గఢ్‌లో దుర్ఘటన

**రాయ్‌పూర్, ఏప్రిల్ 14:** ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక పవర్ ప్లాంట్‌లోని బాయిలర్ పేలిన ఘటనలో 10 మంది మరణించగా,40 మంది గాయ డ్డారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్, శక్తి జిల్లా, సింగితారి గ్రామ సమీపంలోని వేదాంత పవర్ ప్లాంట్‌లో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జరిగింది. ప్రాథమిక సమాచారం >>2

# హైదరాబాద్‌లో లండన్ వర్సిటీ క్యాంపస్

బేగంపేట లేక్ వ్యూ గెస్ట్‌హౌస్‌లో తాత్కాలికంగా ఏర్పాటు

ఫ్యూచర్ సిటీలో శాశ్వత నిర్మాణానికి ప్రణాళికలు




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్14:** తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యాప్తి కోసం గత కొన్ని నెలలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న కృషి ఫలించింది. ప్రతిష్టాత్మక యూనివర్సిటీ ఆఫ్ లండన్ తన ఆఫ్‌షోర్ క్యాంపస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నగరంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, కాస్మోపాలిటన్ సంస్కృతి, అగ్రశ్రేణి సాఫ్ట్వేర్ కంపెనీలు ఉండటాన్ని దృష్టిలో ఉంచుకుని, అంతర్జాతీయ క్యాంపస్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. హైదరాబాద్‌ను ఎంచుకున్న తొలి అంతర్జాతీయ విశ్వవిద్యాలయంగా చరిత్రలో ఈ యూనివర్సిటీ నిలవనుంది. యూకేలోని కింగ్స్ కాలేజ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, లండన్ బిజినెస్ స్కూల్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఈ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలుగా ఉన్నాయి.తాజాగా, ఆ విశ్వవిద్యాలయమే తెలంగాణలో తన క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయి ఆఫ్‌షోర్ క్యాంపస్‌గా హైదరాబాద్ ప్రాంగణం నిలువనుండడం విశేషం. తెలంగాణను అన్ని రంగాలకు తగినట్టుగా నిలిపేందుకు, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తీసుకువచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఈ మధ్య కాలంలో అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు, ఆదేశాలిస్తూ వచ్చారు. రాబోయే రెండేళ్ల కాలంలో, ప్రపంచ ప్రఖ్యాత ఉన్నత విద్యా సంస్థల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లతో >>2



## బీహార్ తొలి బిజెపి సిఎంగా 'సామ్రాట్'

నేడు ప్రమాణం

సిఎం పదవికి నితీశ్ రాజీనామా

**పాట్నా, ఏప్రిల్ 14:** బీహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ఎంపికయ్యారు. దాదాపు రెండుదశాబ్దాలు పాటు బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న నితీష్ కుమార్ కాసేపటి క్రితమే రాజీనామా చేశారు. దీంతో బిహార్‌లో అత్యున్నత పదవిని అధిరోహించనున్న తొలి బీజేపీ నేతగా సమ్రాట్ చౌధరీ నిలిచారు. ఇప్పటివరకు బిహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న 57 ఏళ్ల సమ్రాట్ చౌదరి ఓబీసీ వర్గమైన కుష్వాహ్ కులానికి చెందిన వారు. బిహార్‌లోని ఓబీసీ కులాలలో యాదవుల తర్వాత >>2



# బోనస్ కోసం 'అక్రమ' ధాన్యం!

రూ. 500 కోసం ఎపి నుంచి రాత్రి వేళ సరిహద్దు జిల్లాల్లోకి రవాణా

కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి నకిలీ పత్రాలతో మిల్లులకు చేరిక

నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, కర్ణాటక సరిహద్దు జిల్లాల్లో ప్రత్యేక నిఘా

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** యాసంగి వరి ధాన్యం సేకరణ ప్రారంభమైన నేపథ్యంలో ఎపి ధాన్యం తెలంగాణలోకి ప్రవేశించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఇందుకు సరిహద్దు జిల్లాల్లో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సిబ్బందిని మోహరించారు. నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్‌తోపాటు కర్ణాటక సరిహద్దు జిల్లాల్లోనూ చెక్‌పోస్టులు ఏర్పాటవుతున్నాయి. తెలంగాణలో సన్నరకం వరి ధాన్యంపై క్వింటాల్‌కు కనీస మద్దతు ధరతోపాటు అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తుండడంతో కొందరు వ్యాపారులు, రైస్ మిల్లర్లు అక్రమంగా ఎపి నుండి తెలంగాణకు ధాన్యాన్ని తరలించి బోనస్ ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో రాష్ట్ర ఖజానాపై ఆర్థిక భారం పెరిగిపోతోంది. తెలంగాణ ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తుండడంతో అక్రమార్కులు ఈఅవకాశాన్ని తమధనార్జనకు వినియోగించు >>2




మంగళవారం డెహ్రాడూన్‌లో కారిడార్‌ను ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

## బిజెపి సిఎంగా 'సామ్రాట్'

>> కుష్వాహ్ వర్గమే అతి పెద్దది ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగిన నితీష్ కుష్వాహ్ కులానికి చెందిన వ్యక్తినే తదుపరి సీఎంగా ప్రకటించాలని షరతు విధించినట్టు సమాచారం. నితీష్ సలహా మేరకే బీజేపీ సామ్రాట్‌కు సీఎం పీఠం అప్పగించినట్టు తెలుస్తోంది. మధ్యలో కొన్ని సంవత్సరాలు మినహా 2005 నుంచి బీజేపీ, బిహార్ ప్రభుత్వంలో మైనర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. 20 సంవత్సరాల తర్వాత బీజేపీకి చెందిన నేత బిహార్ సీఎం అయ్యారు. 243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీలో నితీష్ కుమార్ పార్టీకి 85 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 89 మంది ఉన్నారు, బీహార్ కొత్త సీఎం అయిన సమ్రాట్ చౌధరీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి . ఆయన మొదట ఆర్జేడీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆ తర్వాత జేడీ (యు)లో చేరారు. ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నాయకుడిగా ఎదిగారు. ఈ రకంగా ఆయనకు బీహార్‌లోని మూడు ప్రధాన పార్టీల్లో పని చేసిన అనుభవం ఉంది. ఏప్రిల్ 15వ తేదీన బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బీహార్‌లోని ముంగేర్‌ఖిల్లాలో 1968 నవంబరులో జన్మించిన చౌదరి రాజకీయంగా అంచలంచెలుగా ఎదిగారు. ఆయన తండ్రి శకుని ఆరుసార్లు తారాపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన తల్లి పార్వతి కూడా అదేస్థానం నుంచి 1998లో ప్రస్తుతం చెలామణిలోలేని మతా పార్టీనుంచి ఎన్నికయ్యారు. చౌదరీ తన తారాపూర్ నియోజకవర్గంనుంచే 2025 ఎన్నికల్లో పోటీచేసి గెలిచారు. తండ్రి, తల్లి, కుమారుడు అదేస్థానంలో మొత్తం 12 సార్లు ఎన్నికలు జరిగితే 9 సార్లు గెలుచుకున్నారు. 1990నుంచే కెరీర్ ప్రారంభించిన 57 ఏళ్ల సామ్రాట్ చౌదరి రబ్రీదేవి సీఎంగా ఉన్న కాలంలో వ్యవసాయ మంత్రిగాపనిచేసారు.

**బీహార్ సీఎంగా నితీశ్‌కుమార్ రాజీనామా**

జేడీయూ అధినేత నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా తన పదవికి రాజీనామా చేశారు. ఈరోజు లోక్‌భవన్ చేరుకున్న ఆయన తన రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు అందజేశారు. నితీశ్ కుమార్ స్థానంలో ముఖ్యమంత్రిగా ఎవరు వస్తారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాజీనామాను సమర్పించడానికి ముందు ఆయన మంత్రివర్గ సమావేశాన్ని చివరిసారిగా ఏర్పాటు చేశారు. మంత్రివర్గాన్ని రద్దు చేస్తున్న విషయాన్ని కేబినెట్‌కు తెలియజేశారు. నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా రెండు దశాబ్దాలు కొనసాగారు. ఇటీవల ఆయన రాజ్యసభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. దీనితో ఆయన ఈరోజు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ముఖ్యమంత్రిగా పలువురు బీజేపీ నాయకుల పేర్లు వినిపిస్తున్నాయి. బీజేపీ నాయకుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో తొలిసారి ఆ పార్టీ ఈ పదవిని చేపట్టినట్లవుతుంది.

## భారత్‌కు కాంగ్రెస్ గుండెకాయ

>> రత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా ఆనాడు అమిత్ షా అవమానించారని ఆరోపించారు. , రాజ్యాంగాన్ని సమూలంగా మార్చి, వారి అనుకూలమైన మనువాద రాజ్యాంగాన్ని తీసుకొచ్చేందుకు కుటిల ప్రయత్నం జరుగుతున్న తరుణంలో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రను సాహసోపేతంగా నిర్వహించి కాంగ్రెస్ పార్టీని పటిష్ట పరచి , పార్టీ కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపారని ఆయన అన్నారు..అనంతరం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ కాంగ్రెస్ పార్టీ సైద్ధాంతిక విలువలను సంరక్షించుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ పార్టీ నిర్దేశించిన సూచనలకు అనుగుణంగా నడుచుకుంటూ పార్టీని ముందుకు తీసుకెళ్తామని ఆయన అన్నారు..అనంతరం రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల ఫలితాలు కానీ , మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలు కానీ, మీ కృషి ఫలితమేనని, మీ శ్రమతోనే ఈ అద్భుత ఫలితాలు వచ్చాయని మంత్రి పొంగులేటి అన్నారు. రాబోవు రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా... ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి పొంగులేటి అన్నారు.. అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ.. వాటి అమలు కోసం పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు, సంక్షేమ ఫలాలను అందించేందుకు వెనుకడుగు వేయకుండా ఎక్కడా రాజీ పడకుండా తమ ఇందిరమ్మ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన అన్నారు..అనంతరం ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘు రామిరెడ్డి మాట్లాడుతూ... ప్రతి కార్యకర్త శ్రమతోనే పార్టీ నిరంతరం ముందుకు సాగుతుందని, పార్టీ కార్యకర్త శ్రమతోనే పార్టీ అభివృద్ధి పథంలో ఉంటుందన్నారు.

## లండన్ వర్సిటీ క్యాంపస్

>> కూడిన ఒక నాలెడ్జ్ హబ్‌ను భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుంది. పరిశోధనా సంస్థలు, సాఫ్ట్‌వేర్, బయోటెక్, లైఫ్ సైన్సెస్ రంగాలు హైదరాబాద్‌లో ప్రతిష్టాంగా ఉండటం వల్ల ప్రధానంగా మరిన్ని యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో క్యాంపస్‌ల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తుంది. భారత్ ఫ్యూచర్ సిటీలో శాశ్వత క్యాంపస్ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత ఫ్యూచర్ సిటీలో ఎడ్యుకేషన్ జోన్లో ఈ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల ప్రాంగణాల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. కాగా, విశ్వవిద్యాలయాలు తమ విద్యా కార్యకలాపాలను వెంటనే ప్రారంభించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక చర్యలు తీసుకుంటోంది. నగరంలో యూనివర్సిటీ ఆఫ్ లండన్ తాత్కాలిక క్యాంపస్‌గా హైదరాబాద్ లోని లేక్ వ్యూ గెస్ట్ హౌస్‌ను వినియోగించుకునేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. 2027లో విద్యా సంవత్సరంలో కార్యకలాపాలను ప్రారంభించేందుకు యూనివర్సిటీ ఆఫ్ లండన్ ప్రతినిధులు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)కి దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించినట్లు తెలుస్తోంది. త్వరలో మరిన్ని అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో తెలంగాణ ప్రభత్వం ఒప్పందాలను కుదుర్చుకునే అవకాశం ఉంది. మరోవైపు విశ్వవిద్యాలయాలు ఫ్యూచర్ సిటీలో శాశ్వత క్యాంపస్‌ల నిర్మాణాన్ని ప్రారంభించనున్నాయి. కాగా, హైదరాబాద్‌లో తమ బ్రాంచ్ క్యాంపసులను ఏర్పాటు చేయడానికి ఇటీవల ముందుకు వచ్చిన యూకేకి చెందిన 13 పాఠశాలలకు సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు యూకే ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతున్నారు. జాతీయ విద్యా విధానం-2020లోని నిబంధనల ద్వారా, తమ ప్రాంగణాలను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపే అంతర్జాతీయ విద్యా సంస్థలకు కేంద్ర ప్రభుత్వం మార్గం సుగమం చేసిన విషయం తెలిసిందే.

## ఇక జెనీవాలో శాంతి చర్చలు!

### అమెరికా, చైనా మధ్య ముదిరిన దౌత్య యుద్ధం

**వాషింగ్టన్, ఏప్రిల్ 14:** ఆరు వారాలుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి చర్చలు జరగనున్నాయి. ఇరు దేశాల మధ్య కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణ గడువు ఈ నెల 21తో ముగియనుండగా, ఆలోపే ఒక ఒప్పందానికి వచ్చేందుకు ఈ వారం చివరిలో మరో విడత చర్చలకు రంగం సిద్ధమవుతోంది. ఇటీవల పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో జరిగిన చర్చలు విఫలమైనప్పటికీ, ఇరు దేశాలు మళ్లీ భేటీ అయ్యేందుకు సుముఖంగా ఉన్నాయని అమెరికన్ మీడియాలో భారత ఎత్తున కథనాలు వచ్చాయి. అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) కథనం ప్రకారం వాషింగ్టన్, టెహ్రాన్ ఈ వారం ప్రత్యక్ష చర్చలు జరపడంపై సమాలోచనలు చేస్తున్నాయి. చర్చలకు ఇరు దేశాలు అంగీకరించాయని మధ్యవర్తిత్వ దేశానికి చెందిన ఒక దౌత్యవేత్త చెప్పినట్లు ఏపీ పేర్కొంది. ఈ చర్చలు ఇస్లామాబాద్ లేదా జెనీవాలో జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. వేదిక, సమయం ఇంకా ఖరారు కాలేదని, బహుశా గురువారం నాటికి భేటీ ఉండొచ్చని ఒక అమెరికా అధికారి తెలిపారు. సోమవారం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ ఒప్పందం చేసుకోవడానికి అవతలి పక్షమే మమ్మల్ని సంప్రదించిందని వ్యాఖ్యానించడం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. టెహ్రాన్ తమ డిమాండ్లకు తలొగ్గితే చర్చలు పునఃప్రారంభించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ట్రంప్ సంకేతాలిచ్చారు. కాగా ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం ముదురుతున్న వేళ యూఎస్, చైనాల మధ్య కూడా దౌత్య యుద్ధం పతాక స్థాయికి చేరింది. ఇరాన్‌తో తమకున్న ద్వైపాక్షిక సంబంధాలలో అమెరికా జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదంటూ చైనా ఘాటు హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా హార్మూజ్ జలసంధిని దిగ్బంధించాలన్న అగ్రరాజ్యం నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టిన డ్రాగన్ దేశం తమ వాణిజ్య ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తే ఊరుకోబోమని స్పష్టం చేసింది. ఇరాన్, చైనా బంధంపై జోక్యం చేసుకోవద్దంటూ చైనా రక్షణ మంత్రి అడ్మిరల్ డాంగ్ జున్ ఈ ఉదంతంపై తీవ్రస్వరంతో స్పందించారు. ప్రపంచ శాంతి, స్థిరత్వానికి బీజింగ్ కట్టుబడి ఉందని చెబుతూనే పశ్చిమాసియా పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని పేర్కొన్నారు. ఇరాన్‌తో చైనాకు ఉన్న వాణిజ్య, ఇంధన ఒప్పందాలు అత్యంత కీలకమని వాటిని తాము గౌరవిస్తామని ఆయన పునరుద్ఘాటించారు.

## వారం - వర్జ్యం

15-04-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, అశ్విని కార్తె
త్రయోదశి రా.10.26
పూర్వాభాద్ర మ.3.17
వర్జ్యం : రా.12.20-రా.1.50
దు. ఉ.11.42-మ.12.32
శుభసమయం: ఉ.8.30-9.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** పురోభివృద్ధి మాత్రం నామ మాత్రంగా సాధిస్తారు. సంతాన సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. బంధువులకలయిక

**వృషభం:** జీవిత భాగస్వామితో స్పర్థలు, కలతలు రాకుండా మీరే జాగ్రత్త వహించవలసి ఉంటుంది.

**మిథునం:** కీలక వ్యవహారాలలో విజయాలు సాధిస్తారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కర్కాటకం:** సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల అప్రమత్తత అవసరం. వృత్తి, వ్యాపారాలలో ఊహించని మార్పులు వుంటాయి. ఋణాలుతీరుతాయి.

**సింహం:** ఆర్థిక వ్యవహారాలలో ఆటుపోట్లు తప్పవు. వివాదాలకు దూరంగా వుండండి. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

**కన్య :** మీ ఉన్నతిని చూసి ఓర్వలేనివారు అధికమవుతారు. విలాసాలకు అధికంగా ధనం ఖర్చుచేస్తారు. ఆరోగ్యం జాగ్రత్త.

**తుల :** ప్రేమ విషయంలో పురోగతి సాధిస్తారు. ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుతాయి. స్వల్ప ధనలాభం.

**వృశ్చికం:** గృహాలంకరణ సామాగ్రికి ఎక్కువగా ఖర్చుపెడతారు. ఆర్థిక వ్యవహారాలలో కొంత పురోగతి ఉంటుంది.

**ధనుస్సు:** దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. అందరిలోనూ ప్రత్యేక గుర్తింపు పొందుతారు. వాహనసౌఖ్యం.

**మకరం:** గృహం కొనుగోలు యత్నాలు ఆలోచనలు గతంలోకన్నా పట్టుదలతో చేస్తారు. శుభకార్యాలలో పాల్గొంటారు.

**కుంభం:** నిర్మోహమాటంగా మాట్లాడి కొందరు వ్యక్తులను దూరం చేసుకుంటారు. విందు, వినోదాలకు దూరంగా వుండండి.

**మీనం:** అనేక విషయములను ఏక కాలములో పరిష్కరించవలసిన బాధ్యత ఏర్పడుతుంది. పాత ఋణాలు తీరుస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# లోక్‌సభ సీట్లు @850!

>> పునర్విభజనతో ముడిపడి ఉన్న ప్రస్తుత కాలపరిమితికి బదులుగా, 2029లోపే లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించే సవరణలను కూడా ప్రభుత్వం విడిగా ప్రవేశపెట్టనుంది. రాజ్యాంగం ప్రకారం, ప్రస్తుతం రాష్ట్రాల నుండి 530 సీట్లు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 20 సీట్లు ఉండవచ్చు. అయితే, ఒక పునర్విభజన కమిషన్ మొత్తం సీట్లను 543గా నిర్ధారించింది. ప్రభుత్వం, రాజ్యాంగ (131) సవరణ బిల్లును ఎంపీలకు పంపిణీ చేసినట్లు సమాచారం. ఇటీవల, లోక్‌సభ, అసెంబ్లీలలో మహిళలకు 33శాతం కోటాను త్వరితగతిన అమలు చేయడంతో పాటు, దిగువ సభలోని సీట్ల సంఖ్యను 816కు పెంచేందుకు రాజ్యాంగాన్ని సవరించాలని కోరుతూ ప్రవేశపెట్టిన ఒక బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు తెలిసింది. అలాగే నియోజకవర్గాల పెంపు వెనుక ఉన్న ఉద్దేశాన్ని ప్రభుత్వం వివరించింది. "1971 జనాభా లెక్కల ఆధారంగా నాడు నియోజకవర్గాల పునిర్విభజన జరిగింది. అప్పటి నుండి దేశ జనాభా స్వరూపంలో గణనీయమైన మార్పులు వచ్చాయి. రాష్ట్రాల మధ్య, రాష్ట్రాల లోపల జనాభాలో వచ్చిన గణనీయమైన మార్పులు, వేగవంతమైన పట్టణీకరణ, వలసలు, కొన్ని ప్రాంతాల్లో అసమాన జనాభా వృద్ధి వంటి అంశాలు ఇటీవల వెలువడిన జనాభా లెక్కల గణాంకాలలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీని ఫలితంగా జనాభా, నియోజకవర్గాల మధ్య విస్తృతమైన వ్యత్యాసాలు ఏర్పడ్డాయి' అని పేర్కొంది.

**నారీ శక్తి వందన అధినియమ్ బిల్లు**

పార్లమెంటు చరిత్రలో మరో కీలక ఘట్టంగా, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం కోటాను అమలు చేసేందుకు రాజ్యాంగాన్ని సవరించాలని కోరుతూ ప్రవేశపెట్టిన బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 'నారీ శక్తి వందన అధినియమ్'గా ప్రసిద్ధి చెందిన రాజ్యాంగ (నూట ఆరవ సవరణ) చట్టం, 2023, లోక్‌సభ, శాసనసభలలో మహిళలకు (షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన మహిళలతో సహా) దాదాపు మూడింట ఒక వంతు సీట్ల రిజర్వేషన్ కల్పించేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 239తితిను సవరించి, ఆర్టికల్స్ 330ఎ, 332ఎ, 334ఎలను చేర్చింది. ఈ బిల్లు లక్ష్యాన్ని ప్రస్తావిస్తూ, "లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ, జాతీయ రాజధాని ప్రాంతమైన ఢిల్లీ శాసనసభలో మహిళల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచడమే" దీని ఉద్దేశ్యమని కేంద్రం పేర్కొంది. 'సదరు సవరణ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత నిర్వహించే సంబంధిత జనాభా లెక్కల ఆధారంగా మొదటి నియోజకవర్గాల పునర్విభజన చేపట్టిన తర్వాతే అటువంటి రిజర్వేషన్ అమలులోకి వస్తుం దని సదరు నిబంధనలు తెలియజేస్తున్నాయి," అని బిల్లులో పేర్కొంది. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఈ తరుణంలో పార్లమెంటులో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం వెనుక ఉన్న ఆవశ్యకతను వివరిస్తూ, 131వ సవరణ బిల్లు ఇలా పేర్కొంది, 'తదుపరి జనాభా లెక్కలు, ఆ తర్వాత జరిగే పునర్విభజన ప్రక్రియకు గణనీయమైన సమయం పడుతుంది, తద్వారా మన ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళల సమర్థవంతమైన, అంకితభావంతో కూడిన భాగస్వామ్యం ఆలస్యం అవుతుంది. అందువల్ల, ఇటీవల ప్రచురించిన జనాభా లెక్కల గణాంకాల ఆధారంగా చేపట్టే పునర్విభజన ప్రక్రియ ద్వారా, లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభలలో, ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం, కేంద్రపాలిత ప్రాంతాలలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన మహిళలతో సహా మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్‌ను అమలులోకి తీసుకురావడమే ఈ ప్రతిపాదిత బిల్లు లక్ష్యం" లోక్‌సభలో సీట్ల కేటాయింపులో జరిగే పునఃసర్దుబాటుతో మహిళలకు సీట్ల రిజర్వేషన్ ఎలా ముడిపడి ఉందో నొక్కిచెబుతూ, ఈ బిల్లు ఇలా పేర్కొంటుంది, మహిళలకు సీట్ల రిజర్వేషన్ అమలు అనేది, లోక్‌సభ, శాసనసభలలో సీట్ల కేటాయింపులో జరిగే పునఃసర్దుబాటు అనే రాజ్యాంగ పథకంతో, డీలిమిటేషన్ కమిషన్ ద్వారా ప్రాదేశిక నియోజకవర్గాల సరిహద్దులను తిరిగి గీయడంతో ముడిపడి ఉంది.

**వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలు**

2011 జనాభా లెక్కల డేటాను ఉపయోగించి నియోజకవర్గాల పునర్విభజన చేయాలన్న కేంద్రం తీరును ప్రతిపక్షాలు తప్పుపడుతున్నాయి. ఆప్, ఆర్జెడి, డిఎంకె సహా పలు పార్టీలు 2021జనాభా లెక్కల గణాంకాల ఆధారంగానే పునర్విభజన ప్రక్రియ జరగాలని డిమాండ్ చేస్తున్నాయి. వెనుకబడిన తరగతుల మహిళలకు "కోటాలో కోటా" ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్‌పై స్పష్టత ఇవ్వాలని ఇండియా బ్లాక్ పార్టీలు కూడా కోరాయి. ప్రతిపక్ష నాయకులు ఢిల్లీలో బుధవారం (ఏప్రిల్ 15న) కాంగ్రెస్ అధినేత మల్లికార్జున్ ఖర్గే నివాసంలో సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి తృణమూల్ కాంగ్రెస్, డిఎంకె పార్టీల నాయకులు కూడా హాజరయ్యే అవకాశం ఉంది.

## బోనస్ కోసం 'అక్రమ' ధాన్యం!

>> కుంటున్నారు. ఎపిలోని కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి నకిలీ పత్రాలు సృష్టించి అక్రమంగా ఇక్కడి మిల్లులకు సన్న ధాన్యాన్ని తరలిస్తున్నారు. అధికారుల తనిఖీలకు చిక్కకుండా విజయవాడ, హైదరాబాద్ జాతీయ రహదారి మీదుగా కాకుండా ఖమ్మం జిల్లాలోని అంతర్గత రహదారుల ద్వారా రాత్రి వేళల్లో గ్రూపులుగా లారీల్లో పెద్ద ఎత్తున ధాన్యాన్ని తెలంగాణలోకి రవాణా చేస్తున్నారు. తాజాగా ఆలగడప టోల్ గేట్ వద్ద కొన్ని లారీలను అధికారులు పట్టుకున్నా గంటల వ్యవధిలోనే వాటిని వదిలివేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో ఎపి రైతులు తమ వరి ధాన్యాన్ని స్వరాష్ట్రంలోనే విక్రయించాలని సూచిస్తున్న తెలంగాణ ప్రభుత్వం సరిహద్దు జిల్లాల్లో నిఘాను పెంచింది, సన్న ధాన్యం కొనుగోలులో నల్గొండ జిల్లా మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో యాసంగి వరి కోతలు ముమ్మరం కావడంతో మిల్లర్లు దోపిడీకి తెరలేపారు. స్థానిక రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను మిల్లులకు తీసుకొస్తే పచ్చ గింజ సాకుతో మద్దతు ధర కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గంటల నుంచి రోజుల తరబడి స్థానిక రైతుల ట్రాక్టర్లను దిగుమతి చేసుకోకుండా నిలిపివేస్తూ, ఏపీ నుంచి వస్తున్న లారీలకు మాత్రం అధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో స్థానిక రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పొరుగు రాష్ట్రం ఎపి నుంచి వచ్చే ధాన్యానికి క్వింటాకు రూ. 2,430 వరకు చెల్లిస్తున్న మిల్లర్లు, స్థానిక రైతుల వద్దకు వచ్చేసరికి రూ. 2,100 కంటే తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. మొదట్లో క్వింటాకు రూ. 3 వేలు పలికిన ధరను, ఇప్పుడు సిండికేట్‌గా మారిన మిల్లర్లు ఏకపక్షంగా రూ. 2,700కి, ఆపై మరింత తక్కువకు తగ్గించేశారు. ఎపి ధాన్యం వల్ల మిల్లుల్లో నిల్వ సామర్థం లేదని సాకులు చెబుతూ స్థానిక రైతులను భయపెట్టి తమకు నచ్చిన ధరకే అమ్ముకునేలా ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఒక్కో రైస్ మిల్లు వద్ద ప్రస్తుతం 200 నుంచి 250 ట్రాక్టర్లు నిలిచిపోయి కనిపిస్తున్నాయి. రోజుకు వేల టన్నుల ధాన్యం దిగుమతి చేసుకునే సామర్థం ఉన్నప్పటికీ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే లారీలను వేగంగా ఖాళీ చేస్తూ, స్థానిక రైతుల ట్రాక్టర్లను మాత్రం పట్టించుకోవడం లేదని మిల్లర్లపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



అంబేద్కర్ జయంతి సందర్భంగా మంగళవారం పార్లమెంటులో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తదితరులు

## దక్షిణాదికి అన్యాయమే

>> సాధికారత కేవలం చట్టపరమైన మార్పు మాత్రమే కాదు, అది ప్రజాస్వామ్యానికి ఒక నైతిక అవసరమని పేర్కొన్నారు. పునర్విభజనకు సంబంధించి గతంలో కూడా సీట్ల సంఖ్య పెంచకుండా కేవలం నియోజకవర్గాల సరిహద్దులను మార్చుతూ డిలిమిటేషన్ నిర్వహించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు కూడా దేశవ్యాప్తంగా అలాంటి ప్రక్రియను చేపట్టవచ్చని తెలిపారు. లోక్‌సభ సీట్లను 850కు పెంచే ప్రతిపాదన అసలైన వివాదాస్పద అంశమని పేర్కొన్నారు. ప్రస్తుత సీట్లను పెంచి వాటిని ప్రోరేటా పద్ధతిలో కేటాయించే ఆలోచనపై ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల రిజర్వేషన్‌కు పూర్తి మద్దతు ఇవ్వటంతో పాటు, సీట్ల సంఖ్య పెంపు లేకుండా డిలిమిటేషన్‌కు తాము పూర్తి మద్దతు ఇస్తామని తెలిపారు. జనాభా లేదా ప్రోరాటా పద్ధతిలో లోక్‌సభ సీట్ల పెంపు ప్రతిపాదనను అనేక రాష్ట్రాలు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు అంగీకరించబోవని తెలిపారు. ప్రోరాటా పద్ధతిలో అమలు చేస్తే దేశంలో తలెత్తబోయే పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేశారు. 1970ల నుంచి దేశం జనాభా నియంత్రణ విధానంపై దృష్టి పెట్టినప్పటికీ, రాష్ట్రాల వారీగా జనాభా నియంత్రణ అమలు జరిగిన తీరు భిన్నంగా ఉందన్నారు. జనాభాలో తేడాల వల్ల జాతీయ ఐక్యతపై ప్రభావం పడే ప్రమాదాన్ని గుర్తించి, ఇందిరా గాంధీ, అటల్ బిహారి వాజ్‌పేయి వంటి నాయకులు ఈ అంశాన్ని ఒక్కోసారి 25 సంవత్సరాల పాటు వాయిదా వేసినట్లు తెలిపారు. ఆర్థిక సహకారం, సామాజిక, మానవ అభివృద్ధి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రోరాటా పద్ధతిలో సీట్ల పెంపు చేస్తే దేశ ఫెడరల్ సమతుల్యత దెబ్బతింటుందని పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అన్ని ప్రాంతాల సమాన ప్రాతినిధ్యం దేశానికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. సీట్ల పెంపుతో దక్షిణ రాష్ట్రాలపై పడే ప్రభావాన్ని కేంద్రం పూర్తిగా విశ్లేషించలేదని అభిప్రాయపడ్డారు. తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలు దశాబ్దాలుగా జనాభా స్థిరీకరణ, ఆరోగ్యం, మానవ అభివృద్ధి రంగాల్లో కృషి చేశాయని తెలిపారు. ఇవన్నీ జాతీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా చేపట్టిన చర్యలని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రతిపాదనతో ఈ రాష్ట్రాలన్నీ నిర్మాణాత్మకంగా నష్టపోతాయని, రాజకీయంగా బలహీనపడే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ప్రోరాటా మోడల్ కేవలం గణాంకాల మార్పుగా కాకుండా, రాజకీయ అసమతుల్యతకు దారి తీస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు నిధుల పంపిణీలో ఇప్పటికే పక్షపాతం, వివక్ష ఉన్నట్లు తెలిపారు. బీహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఎక్కువ నిధులు పొందుతుంటే, తెలంగాణకు తక్కువ నిధులు వస్తున్నాయని ఉదాహరణగా చెప్పారు. ఇది దక్షిణాదిఉత్తరాది అసమానతకు సంకేతమని పేర్కొన్నారు. నిధుల వివక్షకు అదనంగా ఇప్పుడు సీట్ల పెంపు కారణంగా రాజకీయంగా అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కృషిని పట్టించుకోకుండా దేశ ఐక్యతపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. ప్రోరేటా మోడల్‌ను దక్షిణ రాష్ట్రాలు అంగీకరించవని, ఈ అంశంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉత్పన్నమవుతుందన్నారు. అందరికీ న్యాయం జరిగేలా ఒక స్థిరమైన పరిష్కారం అవసరమని సూచించారు. హైబ్రిడ్ మోడల్ ఒక ప్రత్యామ్నాయంగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. రిజర్వేషన్ల అమలుపై సుప్రీంకోర్టు సూచించిన 50 శాతం రిజర్వేషన్లు, 50 శాతం మెరిట్ విధానాన్ని ఉదాహరణగా ప్రస్తావించారు. హైబ్రిడ్ మోడల్ ప్రకారం, కొత్తగా పెంచే సీట్లలో సగాన్ని ప్రోరేటా పద్ధతిలో, మిగతా సగాన్ని రాష్ట్రాల ఆర్థిక భాగస్వామ్యం (జిఎస్‌డిపి), అభివృద్ధి ప్రమాణాల ఆధారంగా కేటాయించాలని సూచించారు. స్వామి వివేకానంద చెప్పినట్లుగా, మన ఆలోచనలకు తలుపులు తెరిచి కొత్త భావనలు స్వీకరిస్తే, ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రక్రియ అందరికీ న్యాయంగా, ఆమోదయోగ్యంగా ఉండే ఉత్తమ పరిష్కారాన్ని కనుగొంటుందని పేర్కొన్నారు. హైబ్రిడ్ మోడల్ ద్వారా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు నష్టపోకుండా ఉండటంతో పాటు, ప్రజాస్వామ్య ప్రాతినిధ్య సూత్రం అమలవుతుందన్నారు. భారతదేశ బలం భిన్నత్వంలో ఏకత్వమని, ఇలాంటి కీలక నిర్ణయాలు ఆ ఏకత్వాన్ని బలోపేతం చేసేలా ఉండాలని పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ అందరికీ న్యాయం చేసే పరిష్కారాన్ని కనుగొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మహిళలు ఒక్కతాటిపైకి రావాలి

### ప్రధాని మోడీ బహిరంగ లేఖ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:** విధాన రూపకల్పన, నిర్ణయాలు తీసుకోవడంలో మహిళలు చురుకైన భాగస్వాములు అయినప్పుడు, 2047 నాటికి వికసిత భారత్ దిశగా సాగే ప్రయాణం మరింత బలపడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఈ మేరకు దేశ మహిళలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ రాశారు. "నారీ శక్తి వందన అధినియమ్"కు సంబంధించిన ఒక ముఖ్యమైన రాజ్యాంగ సవరణపై చర్చించడానికి ఏప్రిల్ 16న పార్లమెంట్ తిరిగి సమావేశమవుతుందని తెలిపారు. ఈ చట్టం సభలో ఆమోదం పొందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వికసిత భారత్ నిర్మాణానికి దోహదపడేందుకు బలమైన అవకాశం లభించినందుకు దేశవ్యాప్తంగా మహిళలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. 2029 లోక్‌సభ ఎన్నికలు, వివిధ అసెంబ్లీ ఎన్నికలు మహిళా రిజర్వేషన్‌తో పూర్తిగా జరిగితే దేశ ప్రజాస్వామ్యం మరింత బలోపేతం, చైతన్యవంతంగా మారుతుందని ప్రధానమంత్రి అన్నారు. ఈ చట్టాన్ని ఆమోదించడంలో మరింత ఆలస్యం జరగడం దురదృష్టకరమని, దేశంలోని మహిళలకు ఇది ఘోర అన్యాయమని మోడీ అభిప్రాయపడ్డారు. దేశ శాసనసభలలో మహిళల గొంతు బలంగా వినిపించినప్పుడు, ప్రజాస్వామ్య గొంతు కూడా బలంగా వినిపిస్తుందని ఆయన ఉద్ఘాటించారు. శాసనసభలలో మహిళలకు ప్రాతినిధ్యాన్ని అక్షర రూపంలో, స్ఫూర్తితో వీలైనంత త్వరగా ప్రవేశపెట్టేలా అందరూ ఏకతాటిపైకి రావాలని ప్రధాని మోడీ కోరారు. క్షేత్రస్థాయిలో లెక్కలేనన్ని స్వయం సహాయక బృందాలు, లక్షపతి దీదీలు ఆత్మనిర్భరతను ఎలా సాధించవచ్చో, ఇతర మహిళలను ఎలా సాధికారత కల్పించవచ్చో చూపిస్తున్నాయని అన్నారు.

## నేడు ఇండియా కూటమి భేటీ

### డీలిమిటేషన్‌పై కేంద్రం కుట్ర: ఖర్గే

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్ కమిషన్) బిల్లును ప్రవేశపెడుతున్నట్లు కేంద్రం ప్రకటించడంతో ప్రతిపక్షాలు అప్రమత్తమయ్యాయి. కేంద్రం నిర్ణయంతో అప్రమత్తమైన ప్రతిపక్ష ఇండియా కూటమి తమ తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు సిద్ధమైంది. ఈ బిల్లుపై చర్చించేందుకు బుధవారం మధ్యాహ్నం ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో కూటమి నేతలు కీలక సమావేశం నిర్వహించనున్నారు. కేంద్రం ప్రతిపాదనలను ఎలా ఎదుర్కోవాలి, రాష్ట్రాల వారీగా జరిగే మార్పులపై ఎలా స్పందించాలనే అంశంపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవాలనే మోడీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పించారు. అనంతరం, ఖర్గే మాట్లాడుతూ, నేడు రాజ్యాంగం "కుట్రపూరిత దాడి"ని ఎదుర్కొంటోందని, "అంబేద్కర్ పొందుపరిచిన ప్రతి సూత్రాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి" అని అన్నారు. కేవలం అంబేద్కర్‌ను స్మరించుకోవడమే కాదు, ఆయన ప్రతిష్ఠించిన ప్రతి సూత్రాన్ని పరిరక్షించడానికి, ఆయన సాధించిన ప్రతి హక్కును కాపాడటానికి, ఆయన జీవించి, పోరాడిన ప్రతి విలువను నిలబెట్టడానికి మనం ముందుకు రావాలి" అని ఖర్గే పిలుపునిచ్చారు.

## మోడీకి ట్రంప్ ఫోన్

>> తాము కట్టుబడి ఉన్నాము" అని ఫోన్ కాల్ తర్వాత ప్రధాని మోడీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "తాము పశ్చిమ ఆసియాలోని పరిస్థితి గురించి కూడా చర్చించాము. హోర్ముజ్ జలసంధిని తెరిచి, సురక్షితంగా ఉంచడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పాము" అని ఆయన రాసుకొచ్చారు. దాదాపు 40 నిముషాల పాటు చర్చలు సాగినట్లు ప్రధాని మోడీ తెలిపారు. కొనసాగుతున్న సంఘర్షణకు త్వరగా ముగింపు పలకడానికి ఉద్రిక్తతలను తగ్గించడం, చర్చలు, దౌత్యానికి నిరంతరం మద్దతు ఇస్తున్న భారతదేశం, అమెరికా - ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణను స్వాగతించింది. ఇది పశ్చిమ ఆసియాలో శాశ్వత శాంతికి దారితీస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. అదే సమయంలో, హోర్ముజ్ జలసంధి గుండా నిరాటంకమైన నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ వాణిజ్య ప్రవాహం కొనసాగుతుందని తాము ఆశిస్తున్నట్లు భారత్ పేర్కొంది.

## పవర్‌ప్లాంట్‌లో పేలుడు

>> ప్రకారం.. పవర్ ప్లాంట్‌లోని బాయిలర్ ఉన్నట్లుండి పేలిపోయింది. పేలుడు జరిగినప్పుడు చాలా మంది కార్మికులు పరిశ్రమ లోపల పని చేస్తున్నారు. ఈ పేలుడు భారీగా ఉండటంతో అక్కడ పని చేస్తున్న కార్మికుల్లో 10 మంది మరణించారు. మరో 30 నుంచి 40 మంది వరకు గాయపడ్డారు.

ఈ ఘటనతో అక్కడ తొక్కిసలాట లాంటి పరిస్థితి తలెత్తింది. పేలుడు జరగడంతో అక్కడి కార్మికులు పారిపోయేందుకు ప్రయత్నించగా, ఇంకొందరు గాయపడ్డట్లు తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు.

గాయపడ్డవారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. అయితే, ఈ అంశంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి సమాచారం వెల్లడించలేదు.

# మహిళా రిజర్వేషన్ బిల్లు క్రెడిట్ కాంగ్రెస్‌దే

**- నాడే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాం - ఎన్నికల డ్రామాలో భాగంగానే**

**మహిళా రిజర్వేషన్ బిల్లు - బిజెపిపై మండిపడిన మంత్రి సీతక్క**



మంగళవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఏప్రిల్ 14,** ప్రభాతవార్త: వాస్తవానికి మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిం దని గుర్తు చేశారు. కాని ఈ విషయంలో తామే దో చేసినట్టుగా బిజెపి చెప్పుకోవడం విడ్డూ రంగా ఉందన్నారు. ట్యాంక్‌బండ్‌పై మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి ఆమె నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ... అసలు బీజేపీ ఇన్ని సంవత్సరాల చరిత్రలో ఒక్క మహిళ అయినా ఆ పార్టీకి అధ్యక్షురాలు అయ్యిందా..?, ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలని నిలదీశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డం పెట్టుకొని, ఎన్నికల సమయంలో బిజెపి నాటకాలాడుతోందని దుయ్యబట్టారు. డిలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ అంశాలకు లింకు పెట్టి బిజెపి అన్యాయం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. మహిళకు చట్టసభల్లో రిజర్వేషన్లు రావడంతో పాటు బిసిలకు, అట్టడుగువర్గాలకు న్యాయం జరగాలనేదే తమ డిమాండ్ అనిస్పష్టం చేశారు.



కమిషనర్ సజ్జనార్‌కు ఫిర్యాదు చేస్తున్న సింగర్ మంగ్లీ

## న్యాయవాదిపై కమిషనర్‌కు సింగర్ మంగ్లీ ఫిర్యాదు

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** ఎలాంటి ఆధారాలు లేకుండా న్యాయవాది సుబ్బారావు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అతనిపై చట్టరిత్య చర్యలు తీసుకోవాలని సింగర్ మంగ్లీ నగర పోలీసు కమిషనర్ సజ్జనార్‌కు ఫిర్యాదు చేశారు. బాధితులకు న్యాయం చేయాలని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అవనసరమైన ఆరోపణలు చేస్తున్న సుబ్బారావుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## నేటితో టిజిఆర్‌జెసి ఎంట్రన్స్ టెస్ట్ దరఖాస్తు గడువు పూర్తి

**ఇప్పటి వరకు 60 వేల దరఖాస్తులు.. మే 3న పరీక్ష**

**35 రెసిడెన్షియల్ కాలేజీలు, 93కెజివిబిల్లో అడ్మిషన్ల కోసం టెస్ట్**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 14:** తెలంగాణ రాష్ట్రంలోని జనరల్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలతోపాటు, 93 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు(కేజీబీవీ)ల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే టిజి ఆర్‌జేసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజిఆర్‌జేసీ సెట్)-2026 దరఖాస్తు గడువు నేటి(బుధవారం)తో ముగియనుంది. పరీక్షకు ఇప్పటి వరకు 60 వేల దరఖాస్తు చేసుకున్నట్టు తెలంగాణ గురుకుల సొసైటీ సెక్రటరీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 3న పరీక్షను నిర్వహించనున్నారు. టిజిఆర్‌జేసీ సెట్- 2026 ద్వారా 35 తెలంగాణ గురుకుల (రెసిడెన్షియల్) జూనియర్ కాలేజిలలో, 93 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, (ఇంగ్లీషు మీడియం. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ (గ్రూపుల్లో) ప్రవేశము కొరకు మే 3న పరీక్షను నిర్వహించనున్నట్టు తెలిపారు. 2026 మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను మార్చి 16 నుంచి స్వీకరించడం ప్రారంభించారు. నేటి(ఏప్రిల్ 15) దరఖాస్తు గడువు ముగియనుంది. దరఖాస్తు ఫీజును రూ.200గా నిర్ణయించారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ మార్కుల ఆధారంగా రిజర్వేషన్ ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాల కొరకు టిజిఆర్‌జేసీ అధికారిక వెబ్‌సైట్‌లో చూడాలని, ఇతర వివరాల కోసం 040-24734899, 7842991708, 1800 425 2428 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ప్రకటనలో సూచించారు.

35 గురుకుల కాలేజీల్లో 3000 సీట్లు అందుబాటులో ఉండగా.. 93 కేజీబీవీల్లో 3700 సీట్లు అందుబాటులో ఉన్నట్టు సెక్రటరీ తెలిపారు.

## పోలీసు ఠాణా ముందు రోడ్డు ప్రమాదం

**- పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎఎస్ఐ మృతి**



ప్రమాదంలో మృతి చెందిన ఎఎస్ఐ గోవింద్ నాయక్ (ఫైల్ )

**మనూర్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనూర్‌లోని పోలీసు ఠాణా ముందు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎఎస్ఐ గోవింద్ నాయక్ రోడ్డు ప్రమాదానికి గురై పరలోకానికి చేరిపోయిన సంఘటన సోమవారం రాత్రికి చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వర్‌రావు కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని టిఎన్‌టి తండాకు చెందిన గోవింద్ నాయక్ మండల కేంద్రమైన మనూర్‌లోని పోలీసు ఠాణాలో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి పోలీసు ఠాణా ఆవరణలో తహసీల్దార్ కార్యాలయం ముందు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎఎస్ఐ గోవింద్ నాయక్‌ను పెట్రోలింగ్ వాహనం డ్రైవర్ రామారావు ఠాణాకు చెందిన బులేరో వాహనాన్ని అజాగ్రత్తగా వేగంగా నడుపుతూ ఎఎస్ఐ గోవింద్ నాయక్‌ను ఢీకొన్నడంతో తీవ్ర గాయలకు గురై అక్కడికి అక్కడే మృతి చెందాడన్నారు. మృతుడు గోవింద్ నాయక్ కుమారుడు సుప్రీత్ నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటేశ్వర్‌రావు వివరించారు. మృతుడు ఎఎస్ఐ గోవింద్ నాయక్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెలు ఉన్నారు. ఎఎస్ఐ మృతికి కారణకుడైన పోలీసు ఠాణా జీపు డ్రైవర్ రామారావుపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుడి కుమారుడు సుప్రీత్ నాయక్, తండా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

## తప్పుడు కరెంట్ బిల్లులకు చెక్

**విద్యుత్ పంపిణీ సంస్థలకు నియంత్రణ కమిషన్ షాక్**

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** రాష్ట్రంలో విద్యుత్ మీటర్ రీడింగ్‌లో లోపం ఓ వినియోగదారుడికి శాపంగా మారింది. వందల్లో వచ్చే బిల్లులు అధికారుల, ఉద్యోగుల నిర్లక్ష్యంతో తరచూ వేలు, లక్షల్లో వస్తుండటం సర్వ సాధారణమైంది. వాటిని చెల్లించకపోవడంతో విద్యుత సరఫరాను నిలిపిస్తుండటం సర్వ సాధారణమైంది. తప్పుడు బిల్లులని తెలిసినా వాటిని చెల్లించలేక అధికారుల చుట్టూ తిరుగుతున్నా నిర్ధాక్షిణ్యంగా విద్యుత కట్ చేయమే కాకుండా సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పడంలేదు. అధికారుల తప్పిదం వల్ల బిల్లు ఎక్కువ వచ్చిందని బాధితులు పేర్కొంటున్నారు. వీటిపై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని విమర్శలు పెద్ద ఎత్తున ఉన్నాయి. ఈ విధంగా తప్పుడు బిల్లులకు సంబంధించిన పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలకు షాక్ ఇచ్చేలా నియంత్రణ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారుడికి తప్పుడు కరెంట్ బిల్లు జారీ అయినట్లయితే దాన్ని వారం రోజుల్లోపుగా సరిచేయాల్సిందేనని తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ స్పష్టం చేసింది. ఈ బిల్లుల నిమిత్తం సదరు వినియోగదారుడు అదనపు సొమ్ము చెల్లింపులు చేసి ఉన్నట్లయితే తదుపరి బిల్లుల్లో ఆ మొత్తాన్ని 18 శాతం వార్షిక వడ్డీతో సర్దుబాటు చేయాలని తేల్చిచెప్పింది. ఈ మేరకు ఎలక్ట్రిసిటీ సప్లై కోడ్ రెగ్యులేషన్స్ -2026 లో సవరణలను ప్రతిపాదించింది.

## రాష్ట్రంలో తగ్గనున్న మామిడిపళ్ల ధరలు

**పశ్చిమాసియా యుద్ధ ప్రభావం**

**యేటా తెలంగాణ నుండి 7వేల మెట్రిక్ టన్నుల మామిడి ఎగుమతి**

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా హైదరాబాద్ మార్కెట్లో మామిడి పండ్ల ధరలు తగ్గే అవకాశం ఉందని తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. అదే జరిగితే గతేడాదితో పోలిస్తే మామిడి పండ్లు ఈసారి రాష్ట్ర ప్రజలకు తక్కువకే లభించే అవకాశముంది. వేసవిలో మామిడి పండ్ల కోసం ఎదురుచూసేవారికి ఇది నిజంగా తీపికబురు కానుంది. తెలంగాణ పండే మామిడి పండ్లకు పశ్చిమ ఆసియా దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. తెలంగాణ నుంచి ప్రతీ ఏటా సుమారు 7 వేల మెట్రిక్ టన్నుల మామిడి విదేశాలకు ఎగుమతి అవుతుంది. అందులో 1/3 వంతు 3 వేల మెట్రిక్ టన్నులకు పైగా మామిడి ఒక్క యూఏఈ దేశానికి వెళ్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా నెలకొన్న యుద్ధం గల్ఫ్ దేశాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుండడంతో మామిడి ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని నివేదికలు పేర్కొంటున్నాయి. యుద్ధ వాతావరణం వల్ల విమాన ప్రయాణాలు, రవాణా మార్గాల్లో ఆటంకాలు ఏర్పడి తెలంగాణ నుంచి మామిడి ఎగుమతులు 20శాతం నుండి 30శాతం మేర తగ్గాయి. యుద్ధం కారణంగా మామిడి ఎగుమతి రవాణా ఖర్చులు కిలోకు రూ.250 నుండి ఏకంగా రూ.900దాకా పెరిగాయి. ఈ పరిస్థితుల్లో అంత ఖర్చు చేసి మామిడి పండ్లను ఎగుమతి చేయడం తెలంగాణ వ్యాపారులకు భారంగా మారింది. దీంతో విదేశాలకు వెళ్లాల్సిన ప్రిమియం క్వాలిటి మామిడి పండ్లు బంగినపల్లి, రసాలు స్థానిక మార్కెట్‌లకు మళ్లే పరిస్థితి నెలకొంది.

## వృద్ధాప్యానికి భరోసా

**దేశంలోనే తొలిసారి ప్రణామ్ డే కేర్ సెంటర్లు**

**రాష్ట్రవ్యాప్తంగా 37 కేంద్రాలు ఏర్పాటు**



**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** ఉద్యోగ రీత్యా పిల్లలు సుదూర ప్రాంతాలకు వెళ్లటం, విదేశాల్లో స్థిరపడటం, మరికొందరు తల్లిదండ్రులను పట్టించుకోకపోవటం వంటి కారణాలతో నేడు ఎంతోమంది వృద్ధులు ఇళ్లల్లో ఒంటరిగా జీవిస్తూ కుంగుబాటుకు లోనవుతున్నారు. అవసానదశలో బాగోగులు చూసేవారులేక ధీనంగా కాలం వెళ్లదీస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వారి ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా చివరి దశలో వారి జీవితాల్లో ఆనందాన్ని నింపేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రణామ్ పేరిట రాష్ట్రవ్యాప్తంగా మల్టీ సర్వీస్ డే కేర్ కేంద్రాలను ప్రారంభించింది. చిన్నారుల కోసం డే కేర్ సెంటర్లను చూడటం పరిపాటే కానీ వృద్ధుల కోసం ప్రభుత్వమే ఇలాంటి కేంద్రాలను నిర్వహించడం దేశంలోనే ఇదే తొలిసారి కావడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న 37 కేంద్రాల్లో భాగంగా ఆదిలాబాద్‌లో జనవరిలో ప్రారంభమైన కేంద్రం వృద్ధులకు ఒక వరంగా మారింది. వారి సంరక్షణ కోసం ఒక సూపర్‌వైజర్, కుక్, అటెండర్‌ను ప్రభుత్వం నియమించింది. ఇక్కడికి వచ్చే వారికి టీ, స్నాక్స్‌ను ఉచితంగా అందజేస్తున్నారు. నిత్యం 50 నుంచి 60 మంది వృద్ధులు ఈ కేంద్రానికి వస్తూ సామాజికంగా ఉల్లాసంగా గడుపుతున్నారు. ఈ డే కేర్ కేంద్రాలు కేవలం కాలక్షేపానికే పరిమితం కాకుండా, వృద్ధుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. ఇక్కడ టీవీ, హైస్పీడ్ ఇంటర్నెట్‌తో పాటు ఆధ్యాత్మిక, సాహిత్య పుస్తకాలతో కూడిన లైబ్రరీ అందుబాటులో ఉంది. శారీరక, మానసిక దృఢత్వం కోసం క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్ వంటి ఇండోర్ గేమ్స్ ఏర్పాటు చేశారు. జిల్లా ఆసుపత్రుల్లోని జెరియాట్రిక్ క్లినిక్‌లతో ఈ కేంద్రాలను అనుసంధానించారు. వృద్ధులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఫిజియోథెరపీ సేవలను కూడా అందుబాటులో ఉంచుతున్నారు. సాయంత్రం వేళల్లో అందరూ కలిసి చేసే ధ్యానం వారికి మానసిక ప్రశాంతతను ఇస్తోందని వృద్ధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మే 11న ఎస్ఎస్‌సి ఫలితాలు!

**రేపు ఒకేషనల్ పరీక్షతో పూర్తికానున్న పరీక్షలు**

**నెలాఖరుకు ముగియనున్న మూల్యాంకన ప్రక్రియ**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 14:** తెలంగాణ రాష్ట్రంలో మార్చి 14 నుంచి ప్రారంభమైన ఎస్ఎస్‌సి పరీక్షలకు సంబంధించిన ఫలితాలను మే 11న విడుదల చేయడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మార్చి 14న ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు ఈ నెల 13న జరిగిన సోషల్ స్టడీస్‌తో ప్రధాన పరీక్షలు ముగిశాయి. రేపు(గురువారం) ఒకేషనల్ విద్యార్థులకు సంబంధించిన పరీక్షతో మొత్తం ఎస్ఎస్‌సి పరీక్షలు ముగియనున్నాయి. ఇప్పటికే ప్రధాన పరీక్షలు ముగిసిన నేపథ్యంలో ఈ నెల 9 నుంచే జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఎస్ఎస్‌సి బోర్డు అధికారులు ప్రారంభించారు. మొత్తం 3 విడతల్లో మూల్యాంకనాన్ని నిర్వహించనున్నారు. ఈ నెల 9 నుంచి 16 వరకు మొదటి సెషన్‌ను, ఈ నెల 17 నుంచి 23 వరకు రెండో సెషన్‌ను, 23 నుంచి 30 వరకు చివరి విడత మూల్యాంకనాన్ని పూర్తి చేయనున్నారు. మూల్యాంకన ప్రక్రియ ముగిసిన అనంతరం ఫలితాలకు సంబంధించిన క్రోడీకరణ పనులను సీజీజీ సాయంతో ఎస్ఎస్‌సిబోర్డు పూర్తి చేయడానికి ప్రణాళికను సిద్ధం చేసింది.

## అజ్ఞాతంలో ఇక నలుగురు మావోయిస్టులే

**పోలీసు శాఖ వెల్లడి**

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్ ప్రభావం వల్ల మావోయిస్టుల లొంగుబాట్లు, ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో తెలంగాణ నుంచి ఆ పార్టీలో మిగిలింది నలుగురేనని పోలీసు శాఖ తాజాగా ప్రకటించింది. గత శుక్రవారం నాడు 42 మంది నక్సలైట్లు డిజిపి ఎదుట లొంగిపోయిన సమయంలో ఈ సంఖ్య ఐదుగా వుండగా మంగళవారానికి నాలుగుకు పడిపోయింది. పార్టీ అగ్రనేత కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి, పసునూరి అలియాస్ నరహరి ఊరఫ్ సంతోష్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా వున్న గణపతి సతీమణి జడే రత్నాబాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు మాత్రమే అజ్ఞాతంలో వున్నారని పోలీసు శాఖ వెల్లడించింది. వీరు వెంటనే అజ్ఞాతాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసు శాఖ కోరింది.

**మరికొంతకాలం సరిహద్దుల్లో నిరంతర కూంబింగ్**

ఇదిలావుండగా రాష్ట్రంలో వున్న నక్సలైట్లు పూర్తిగా లొంగిపోవడంతో తెలంగాణ మావోయిస్టు రహితంగా మారినప్పటికీ మరో ఐదారు నెలల పాటు గ్రే హౌండ్స్ బలగాలతో పాటు ఆయా జిల్లాల సాయుధ బలగాల చేత కూంబింగ్ కొనసాగించాలని పోలీసు శాఖ నిర్ణయించింది. మావోయిస్టులు లేనంత మాత్రానసరిహద్దుల్లో నిఘాను నిర్లక్ష్యం చేయకూడదని పోలీసు శాఖ భావిస్తోంది. ఇదే సమయంలో జిల్లాల పోలీసులకు కూంబింగ్‌పై నక్సల్స్ ఆపరేషన్‌పై ఇప్పుడు ఇస్తున్న శిక్షణ ఇకముందు కూడా కొనసాగించాలని పోలీసు శాఖ నిర్ణయిం చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత నక్సల్స్ కదలికలు పెద్దగా లేకపోవ డంతో జిల్లాల పోలీసులకు మావోయిస్టుల ఏరివేతకు సంబంధించిన శిక్షణను అప్పట్లో తాత్కాలి కంగా నిలిపి వేశారు. 2018 తరువాత నక్సలైట్ల కదలికలు పెరగడం, ఇన్‌ఫార్మర్ల పేరిట అమాయకులను చంపడంచ రాజకీయ నేతలను టార్గెట్ చేయడం, ప్రజాఆస్తులను ధ్వంసం చేయడం వంటివి పెరగడంతో అప్పట్లో జిల్లాల పోలీసులు మావోయిస్టుల ఏరివేత విషయంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

దీంతో వీరికి గ్రే హౌండ్స్ బలగాల చేత శిక్షణ ఇప్పించారు. ఆ తరువా ఈ శిక్షణ తప్పనిసరి చేశారు. దీనిని ఇకముందు కూడా కొనసాగించాలని నిర్ణయించారు.

## పొంచి ఉన్న ఎల్‌నినో ముప్పు

**ఈ యేడాది తక్కువ వర్షపాతం**

**ఉత్తర తెలంగాణ జిల్లాల్లో లోటు వర్షపాతం**

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** ఈ ఏడాది వర్షాకాలంలో వానలు తక్కువగానే కురుస్తాయని వాతావరణశాఖ అంచనా వేసింది. సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదవుతుందని వెల్లడించింది. తాజాగా ప్రైవేట్ వాతావరణ సంస్థ స్కైమెట్ కూడా వారం కిందట కీలక అంశాలను వెలువరించింది. ఈ రుతుపవన సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. ఈ ఏడాది వర్షపాతం దీర్ఘకాలిక సగటులో 94 శాతం ఉండొచ్చని అంచనావేసింది. ఈ ఏడాది కరువు వచ్చే ముప్పు 30 శాతం ఉన్నదని పేర్కొంది. రాష్ట్రంలో ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, జగిత్యాల్, సిరిసిల్ల, మంచిర్యాల్, పెద్దపల్లి జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. అదే సమయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో సగటు కన్నా ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. లానినా పరిస్థితులు బలహీన పడుతున్నాయని, వర్షాకాలం నాటికి ఎల్‌నినో బలపడుతుందని ఐఎండీ పేర్కొంది. కాగా.. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సమయంలో దేశంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నదని భారత వాతావరణ శాఖ తెలిపింది. మూడేళ్ల విరామం తర్వాత జూన్‌లో ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడతాయనే అంచనా భారతదేశ వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థకు జీవనాధారమైన నైరుతి రుతుపవనాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయానికి నైరుతి కీలకం.

## రాష్ట్ర బ్యాంకుల్లో మురిగిపోతున్న రూ.2,100 కోట్లు

**పదేళ్లకు పైగా లావాదేవీలు నిలిచిపోయిన ఖాతాలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** తెలంగాణలోని బ్యాంకుల్లో కోట్లాది రూపాయలు వివిధ ఖాతాల్లో మురిగిపోతున్నాయి. ఈ సొమ్ము నాది అంటూ తీసుకునేందుకు ఏళ్ల తరబడి ఎవరూ రాక పోవడంతో కోట్ల రూపాయలు మూలపడి నిరుపయోగంగా ఉండిపోతున్నాయి. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బ్యాంకుల్లో వదలేసిన సొమ్ము 2,905.10 కోట్లరూపాయలు తేలకుండా మురిగిపోతున్నాయి. పదేళ్లుగా ఈ సొమ్ముకు ఎలాంటి లావాదేవీలు జరగడం లేదని రిజర్వ్ బ్యాంక్ గుర్తించింది. ఈ అనామత్తు సొమ్ము అంతా 78,53,607 ఖాతాల్లో ఉన్నట్లు లెక్క తేల్చింది. అగస్టు నెలాఖరు నాటికి ఈ మొత్తం సొమ్ము బ్యాంకుల్లో వృధాగా పేరుకుపోయాయి. రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు ఇటీవల కాలంలో బ్యాంకుల్లో లావాదేవీలు జరగని ఇటువంటి ఖాతాలపై అధికారులు ప్రత్యేకక్యాంపెయిన్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో వినియోగించని ఈ సొమ్ము వెలుగులోకి వచ్చింది. రిజర్వ్‌బ్యాంక్ నిబంధనల మేర బ్యాంకు ఖాతాలను పదేళ్లకు మించి లావాదేవీలు జరపకుండా ఉన్నట్లయితే వాటిల్లో ఉన్న సొమ్ము డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ (డీఈఏఎఫ్) ఖాతాకు బదిలీ అవుతుందన్నారు.

## దేశ ఎదుగుదలలో మహిళా సాధికారత కీలకం

**- గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా**

**- 375 మంది ఆదివాసి, ఇద్దరు ట్రాన్స్ జెండర్లకు నగదు ప్రోత్సాహకాలు**



ప్రోత్సాహకాలు అందుకున్న వారితో గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, చిత్రంలో బండా ప్రకాశ్, ఘంటా చక్రపాణి తదితరులు

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** ప్రపంచ శక్తిగా భారతదేశ ఎదుగుదలకు విద్యతోపాటు మహిళా సాధికారత కీలకమని తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా అన్నారు. సామాజిక సాధికార వారోత్సవాల్లో భాగంగా సమతా స్కీం కింద ఉచిత విద్యకు ఎంపికైన 375 మంది ఆదివాసీ, ఇద్దరు ట్రాన్స్‌జెండర్ విద్యార్థులకు జ్యోతి రెడ్డి ఫౌండేషన్ ఫెలోషిప్ ప్రదానోత్సవ కార్యక్రమం అంబేద్కర్ వర్సిటీలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ, దేశంలో విద్య, సామాజిక సంస్కరణలకు మార్గదర్శకులైన దార్శనిక నాయకులు బాబు జగ్జీవన్ రామ్, జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే, బి.ఆర్. అంబేద్కర్ అని అన్నారు. ఈ సంస్కర్తల నుండి విద్యార్థులు పాఠాలు నేర్చుకుని, వారి ఆదర్శాలను అనుసరించాలన్నారు. అంబేద్కర్ కేవలం సంస్కర్త మాత్రమే కాదని, అందరి నాయకుడని అన్నారు. ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి కృషి, పట్టుదల, విద్యే కీలకమన్నారు. ఉపాధ్యాయులు సమాజంలో మార్గదర్శకులుగా, దేశ నిర్మాతలుగా అత్యున్నత స్థానాన్ని కలిగి ఉంటారని వ్యాఖ్యానించారు. తమ లక్ష్యాలను సాధించే వరకు విశ్రమించవద్దని విద్యార్థులకు సూచించారు. అంబేద్కర్ తీవ్రమైన వివక్షను అధిగమించిన ఒక ప్రతిభావంతుడైన విద్యార్థి అని గుర్తు చేశారు. భారత రాజకీయాలు, సామాజిక మార్పులో అంబేద్కర్ ఒక మహోన్నత వ్యక్తి అని అభివర్ణించారు. అంబేద్కర్ వారసత్వాన్ని గౌరవించటానికి భారత ప్రభుత్వం పంచ తీర్థాన్ని అభివృద్ధి చేసిందన్నారు. అట్టడుగు వర్గాలకు అభ్యున్నతి కోసం పూర్వ విద్యార్థి జ్యోతి రెడ్డి ఫౌండేషన్ చేస్తున్న కృషిని గవర్నర్ అభినందించారు. మహిళలు అన్ని రంగాలలోనూ గొప్ప శిఖరాలను చేరుకుంటున్నారని, ఇది పెరుగుతున్న సాధికారతకు నిదర్శనమని అన్నారు. నారీ శక్తి వందన్ చట్టాన్ని ప్రస్తావిస్తూ, సమీప భవిష్యత్తులో పార్లమెంటులో మహిళలకు 33 శాతం ప్రాతినిధ్యం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. భారతదేశం ఒక అగ్రశక్తిగా ఎదుగుతోందని, కోవిడ్ 19 మహమ్మారి సమయంలోనూ ఆర్థికంగా స్థిరంగా ఉందన్నారు. 2047 నాటికి వికసిత భారత్‌గా, ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, అంబేద్కర్ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి, జ్యోతి రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు దుద్దిపాల జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) ఆధారిత హైబ్రిడ్ విద్య అవసరమని తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి డా.యోగితా రాణా అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్సిటీలో ఏఐ డీఈఏ ల్యాబ్స్‌లో కీలక డిజిటల్ సాధికారత కార్యక్రమాలైన 2.0 ల్యాబ్‌ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆమె యూనివర్సిటీ యూట్యూబ్, రేడియో ఛానల్ (బీఆర్ఏఓయూటీవీ, హాయ్ బ్రో) ఎల్ఎంఎస్, ఓఈఆర్, బీఆర్ఏఓయూ డిజీలైబ్రరీ, ఐబుక్‌లను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వినూత్న కార్యక్రమాలను ఆవిష్కరిస్తోందన్నారు.

## ప్రముఖుల 'భద్రత' కుదింపు!

**- మావోయిస్టుల ప్రభావం తగ్గడమే కారణం**

**- త్వరలో రాష్ట్రస్థాయి సమీక్ష, విడతల వారీగా గన్‌మెన్ల తొలగింపు**

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తొలగిపోవడంతో ప్రముఖులకు కల్పిస్తున్న భద్రతను కుదించాల ని సర్కారు నిర్ణయించింది. దీనిపై వారం రోజుల్లో రాష్ట్ర స్థాయిలో సమీక్ష తరువాత విడతల వారిగా గన్‌మెన్‌లను తొలగించాలని సర్కారు నిర్ణయిం చినట్లు తెలిసింది. కాగా నక్సల్స్ హిట్ లిస్టులో వున్న నేతలు, పోలీసు, మాజీ పోలీసు అధికారులకు మరికొంత కాలం భద్రతను కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తోంది.

రాష్ట్రంలో మంత్రులు, కేంద్ర మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలతో పాటు మాజీ శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, నక్సల్స్ హిట్ లిస్టులో వు న్న నేతలు, విశ్రాంత గవర్నర్లు, పోలీసు అధికారులు, ఇక్కడ వుంటూ ఇతర రాష్ట్రాల్లో గవర్నర్లు, ఇతర ఉన్నత హోదాలో వున్న వారికి సర్కారు చా లా కాలంగా భద్రత కల్పిస్తుండడం తెలిసిందే. ఇందులో కొందరికి జడ్ ప్లస్ కేటగిరి, మరికొందరికి జడ్ కేటగిరి, ఇంకొందరికి వై కేటగిరి ఇలా ప లురకాల రక్షణను ప్రభుత్వ కల్పిస్తోంది. దీని కింద కొందరికి పది మంది అంతకు మించి సాయుధ పోలీసులతో భద్రత వుండగా వీరికి ఎస్కార్టు వాహనాలు కూడా వుంటున్నాయి. ఇదే సమయంలో మరికొందరికి ఆరుగురి నుంచి నలుగురి వరకు గన్‌మెన్లు, ఇంకొందరికి ఇద్దరేసి గన్‌మెన్లు భద్రత గా వుంటున్నారు. వీరితో పాటు ఆయా రంగాలకు చెందిన ప్రముఖులకు కూడా గన్‌మెన్ల సౌకర్యం వుంది. ఇందులో కొందరు పేమెంట్ ప్రాతిపదిక న భద్రత పొందుతున్నారు. ప్రముఖుల భద్రత కోసం రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ పేరిట ప్రత్యేకంగా ఒక విభాగం వుండగా విఐపిల కోసం ఇంకో విభాగం వుంది. హైదరాబాద్‌లో సిటీ సెక్యూరిటీ వింగ్ పేరిట ఇంకో విభాగం వుంది. ప్రముఖుల భద్రతకు సాయుధ బలగాల నుంచి కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లను వాడుతున్నారు.

## ఒకే నంబర్‌తో రెండు వాహనాలు

**- ట్రాఫిక్ చలాన్లు తప్పించుకునేందుకు యత్నించిన వాహనదారుడి ఆటకట్టు**

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** ఒకే నంబర్‌తో రెండేసి టూరిస్టు బస్సులు తిరగడం గతంలో చాలాసార్లు వెలుగు చూశాయి. ఈ తరహా వా హనాలను ఆర్టీఎ అధికారులు పట్టుకుని భారీ జరిమానాలు విధించిన ఉదంతాలూ వున్నాయి. ఇలాంటి ఘటన హైదరాబాద్‌లో ఒక ద్విచక్ర వాహన ం విషయంలో రట్టయ్యింది. బోరబండకు చెందిన నారాయణకు రెండు హోండా యాక్టివా ద్విచక్ర వాహనాలు వుండగా ఇందులో ఒకదానిని కుమార్తె దీపారాణికి ఇచ్చాడు. ఈ వాహనం నంబర్ టిఎస్09 జిడి 2712. అయితే నారాయణ తాను వాడుతున్న హోండా యాక్టివా వాహనానికి తన కుమార్తె వాహనానికి వున్న టిఎస్09 జిడి 2712 నంబర్ ప్లేట్‌ను వాడుతున్నాడు. ఇతని వాహన నంబర్ మరొకటి వుండగా కుమార్తె వాహన నం బర్ ప్లేట్‌ను నిబంధనలకు విరుద్ధంగా వాడుతూ తప్పుడు పనులకు పాల్పడసాగాడు. ఇలా చేయడం వల్ల ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకోవచ్చని నారాయణ ఉద్దేశం. అయితే ఇదే సమయంలో నారాయణ కుమార్తె దీపారాణి కూడా టిఎస్09 జిడి 2712 ప్లేట్‌తో మరో హోండా యాక్టివా పై బోరబండతో పాటు సమీప ప్రాంతాలలో తిరుగుతుండగా ఆ ప్రాంతంలోని ట్రాఫిక్ పోలీసులు గమనించారు. రెండు వాహనాలకు ఒకే నంబర్ ప్లేట్ వుండడం ఏమిటనీ అనుమానించి సిసి టివి ఫుటేజిలను పరిశీలించగా అసలు విషయం తెలిసింది.

## అప్పుల రాష్ట్రాలుగా టిజి, ఎపిలు

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోయినట్టు కేంద్ర గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దేశంలోనే తొలి రెండు స్థానాల్లో వరుసగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు నిలిచాయి. కేంద్ర మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ విడుదల చేసిన తాజా సర్వేలో తేలింది. లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 43.7 శాతం మంది, తెలంగాణలో 37.2 శాతం మంది అప్పులపై ఆధారపడినట్లు నివేదిక వెల్లడించింది. అలాగే కర్ణాటకలో 15 ఏళ్లకు పైబడిన జనాభాలో బ్యాంకింగ్ వ్యవస్థకు అనుసంధానం (ఫైనాన్షియల్ ఇంక్లూజన్) (95.9 ) కాగా, ఆ తర్వాత 92.3 మందితో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. కర్ణాటకలో 23.2 మందిపైనే అప్పుల భారం ఉండగా, తెలంగాణలో 86.5 మందే ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పరిధిలో ఉన్నారు. ఇక సామాజిక వర్గాల వారీగా పరిశీలిస్తే, ఓబీసీలలో 16.6 శాతం మంది అప్పుల్లో ఉన్నారు.

వార్త


తమ పూర్వీకులందరూ సాధించిన ఘన విజయాలను గురించి గర్వపడనివారు, ముందు తరాలవారు తమని గుర్తించగల ఏకార్యాన్నీ సాధించలేరు.

- మెకాలే

# ఎండ ప్రచండం!

ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కొలిమిగా మారాయి. గత నెల రోజులుగా ఆయా ప్రాంతాల్లో విభిన్న వాతావరణం చోటు చేసుకుంది. కొన్నిచోట్ల అకాల వర్షాలు, పలుచోట్ల వడగళ్ల వర్షం, చూసాం. ఇప్పుడు ఉన్నట్టుండి వడగాడ్పులు చప్పుడు వింటున్నాం. భానుడి భగభగలతో జనం మిట్ట మధ్యాహ్నం బయటకు వెళ్ల లేక ఉన్న చోటనే ఇంట్లోనో, కార్యాలయంలోనో ఉండిపోతున్నారు. తెలంగాణలో అన్ని జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. కొన్ని ప్రాంతాలకు ఎల్లో అలెర్ట్. తెలుగు రాష్ట్రాల నుంచి వస్తున్న సమాచారం వింటుంటే ఎండ వేడిమి నుండి తట్టుకోలేని పరిస్థితులు ఎదురౌతాయి. ఇప్పటికే రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. ఏప్రిల్ 19 నుంచి మే 31 వరకు ప్రత్యేక వాతావరణం చూస్తామని ఈ కారణంగాకొన్ని కఠినమైన పరిస్థితులు ఎదురవుతాయని వాతావరణ శాఖ అలర్ట్ చేసింది. గ్యాస్ సిలిండర్లను ఎండలో ఉంచరాదు. ఎయిర్ కండిషనర్ల వినియోగం పేరిట విద్యుత్ వాడకాన్ని పెంచరాదని సూచన. పెంపుడు జంతువులను కూడా వడదెబ్బ నుండిరక్షణ కల్పించాల్సిన బాధ్యత మనదే. వడగాలులు సాధారణ రోజుల కన్నా ఎక్కువ ప్రభావం చూపుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతమైన కోస్తా జిల్లాల్లో వడగాలులనపలుప్రభావం నుంచి బయటపడే ఆలోచన చేయాల్సి ఉంది. ఇప్పటికే మంగళశారం నాడు తెలుగు రాష్ట్రాలలో కనీసంఐదుగురు వడగాల్పులకు మృతి చెందినందున ముందు జాగ్రత్త చర్యగాప్రభుత్వ శాఖలు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ రోజుల్లో ఉష్ణోగ్రత 45 డిగ్రీల నుండి 55 డిగ్రీల వరకు అత్యధిక వేడిమి ఉంటుందనే హెచ్చరికల నేపథ్యంలో డాక్టర్లు, శాస్త్రజ్ఞులు సైతం మానవ సహిత జీవజాలాన్ని, జంతు జాలాన్ని వేడివాతావరణంలో ఎలారక్షించుకోవాలో, సూచిస్తున్నారు. అధిక నీటిని తాగాలన్నది వారి సలహా. వృద్ధులను, పిల్లలను బయటికి రావద్దని ప్రభుత్వాలు హెచ్చరిక చేస్తున్నాయి. ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం3 గంటలకు ఎవరూ బయటకు వెళ్లకూడదని వాతావరణశాఖ హెచ్చరించింది. అతివేడిమి ఉన్న రోజుల్లో భూమి మీదనేరుగా 70శాతం అతి నీల లోహిత సూర్య కిరణాలు ప్రసరిస్తాయి. వీటి ఫలితంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడి, అకస్మాత్తుగా అస్వస్థతకు గురై వైద్య సహాయంకోసం పరుగులు పెట్టాల్సి వస్తుంది. ఉక్కపోత నుంచి ఉపశమనానికి గాలి చొరబడే గదుల్లో గాలి వచ్చేలా తలుపులు కిటికీలు తెరుచుకునేటట్లు ఉంచాలి. మొబైల్ ఫోన్లు పేలిపోవచ్చు. ద్విచక్రవాహనాలకు పెట్రోల్‌ను ట్యాంక్ ఫుల్ చేయవద్దని సూచిస్తున్నారు. ప్రయాణాలు వాయిదా వేసుకోవాలనే సూచనలు ఉన్నాయి. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉక్కపోత అధికంగా ఉంటుందని, గాలిలో తేమ శాతం తగ్గిపోవడం వల్ల వడ దెబ్బ తగిలే అవకాశం ఉంది. వారం రోజులు హీట్ ఇండెక్స్ ఎక్కువగా ఉంటుంది. డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తుతాయి. శ్రామిక జనంఎండవేడిమి లేని ప్రాంతాల్లో పనికి వెళ్లాలని వాతావరణ నిపుణులుహెచ్చరిస్తున్నారు, వేసవిలో ఎండ తీవ్రత 35డిగ్రీల సెల్సియస్‌దాటినప్పటి నుంచి సమస్యలు పెరుగుతాయి. వేసవి ఉష్ణోగ్రతలు 35డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉన్నప్పుడు బయట ఎక్కువసేపు తిరిగే వారిలో డీహైడ్రేషన్, తలనొప్పి, తల తిరగడంవంటి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయి. ఎండల ధాటి 40-45 డిగ్రీలకు చేరుకుంటే, ప్రమాద స్థాయి మరింతగా పెరుగుతుంది. ఉష్ణోగ్రతలు ఈ స్థాయికి చేరినప్పుడు బయట ఎక్కువసేపు ఉంటే త్వరగా అలసట, నీరసం ముంచుకొచ్చి, డీహైడ్రేషన్‌కు లోనవడం, వాంతులు, తలతిరగడం, వడదెబ్బకు లోనవడం వంటి ప్రమాదాలు తలెత్తవచ్చు. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటినట్లయితే, వడదెబ్బ సోకే అవకాశాలు మరింత ఎక్కువగా ఉంటాయి. ఈ ఉష్ణోగ్రతలు ఒక్కోసారి ప్రాణాపాయానికి కూడా దారితీయవచ్చు. గడచిన పదేళ్లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సగటు గరిష్ఠఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే ఎక్కువగానే నమోదవుతున్నాయి. భారత వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్లో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.5-42.5 డిగ్రీల వరకు తెలంగాణలో 41.5 నుంచి 43.5 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. విజయవాడ, కర్నూలు, రామగుండం, భద్రాచలం వంటి కొన్ని ప్రాంతాల్లో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45-47డిగ్రీల వరకు కూడా నమోదవుతున్నాయి. అందువల్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను తాకినప్పటి నుంచి తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించడం మంచిది. ఎల్‌నినో కాస్త ముందే పలుకరించినా భూమధ్య రేఖ వెంబడి పసిఫిక్ మహా సముద్రం వేడెక్కుతుంది. చివరిసరిగా ఎల్‌నినో పరిస్థితులు 2023లో ఏర్పడ్డాయి. ఈ ఏడాదిరుతుపవనాల సమయంలో అత్యల్పవర్షపాతం నమోదవుతుందని వాతావరణశాఖ చెబుతోంది. ఇప్పుడు మీద పడనున్న ఎల్‌నినో ప్రభావంతో దేశంలో నీటి వనరులకు కొరత ఏర్పడుతుంది. దానికితోడు అత్యల్ప వర్షపాతం కూడా రేపటి వ్యవసాయ కార్యాచరణపై ప్రభావం చూపుతుంది. భారత్‌లోకి వచ్చే మొత్తం వర్షపాతం సుమారు 75 శాతం వస్తుంది. ఈసారి నైరుతి రుతుపవనాల ప్రభావం వ్యవసాయ దారులను ఇబ్బందులకు గురిచేసేటట్లుగా ఉండచ్చు. వర్షాధార ఖరీఫ్‌లో సాగు ఆయకట్టు బాగా తగ్గుతుంది నీటి వనరులు ఎండిపోవడం, సాగు అవసరాలు తీర్చే నీరు లభ్యత కాకపోతే సాగులో కొంత ఆయకట్టు తగ్గుతుంది. జూన్, జూలై నెలల్లో అతి తక్కువ వర్షపాతం వలన దేశంలోని అన్నిప్రాంతాలు నీటికరువుని ఎదుర్కొంటాయి. ఈఏడాది వర్షపాతం 94శాతంమాత్రమే ఉంటుంది. కొంత మేర కరువు పరిస్థితుల్ని చూడొచ్చు.

భుజం తడితే లాభం లేదు, పక్కనే నిలబడాలి. అదే నిజమైన ప్రశంస.



మహాత్మా గాంధీ

అందరిపట్లా మర్యాదగా వ్యవహరించండి. ఎక్కువ మందితో పరిచయం పెంచుకోండి. ఒక్కరిద్దరితో స్నేహంగా ఉండండి. ఎవరికీ శత్రువు కాకండి.



బెంజెమెన్ ఫ్రాంక్లిన్

# పేదరిక నిర్మూలన సామాజిక బాధ్యత

*గత దశాబ్దంలో పది లక్షలమంది ప్రజలు పేదరికం నుండి బయటపడినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వివిధ అంచనాల ప్రకారం దాదాపు 24.8 కోట్ల మంది వ్యక్తులు పేదరికం నుంచి బయటపడ్డారు. భారతదేశంలో కొన్ని క్లిష్టమైన సవాళ్లు మిగిలి ఉన్నాయి. అనధికారిక కార్మికులు, పట్టణ పేదలు, వలసదారులు, మహిళలలో సామాజిక రక్షణ కవరేజ్ అంతరాలు కొనసాగుతున్నాయి. వీరిలో చాలా మందికి పోర్టబిలిటీ, ప్రయోజనాల గురించి అవగాహన లేదు. ప్రపంచ ప్రమాణాలతో పోలిస్తే భారతదేశంలో సామా జిక రక్షణ వ్యయం చాలా తక్కువగా ఉంది. ప్రయోజనాల సమర్థతను పరిమితం చేస్తుంది. ప్రభుత్వాలు దీర్ఘకాలిక సామాజిక భద్రత కంటే స్వల్పకాలిక ఉపశమనంపై తర చుగా దృష్టి సారిస్తున్నాయి. సామాజిక రక్షణపై పూర్తిగా సాకారం చేసుకోవడానికి, భారతదేశం సమానత్వం, సమర్థత, స్థిరత్వాన్ని నిర్ధారించే సార్వత్రిక, హక్కుల ఆధారిత, సమగ్ర వ్యవస్థల వైపు పయనించాలి.*



డా. సునీల్ కుమార్ పోతన

సార్వత్రిక ప్రాప్యత, బలహీన వర్గాల ఉత్పాదక వృద్ధిని ప్రాథమిక సామాజిక భద్రతకు సూచికగా చెప్పవచ్చు. భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర పథకాలు, చట్టబద్ధమైన నిబంధనలు, సంక్షేమ కార్యక్రమాల మిశ్రమంగా సామాజిక రక్షణ పనిచేస్తుంది. ఆర్థిక అంతరాలు లేకుండా సామాజిక రక్షణలో సామాజిక భద్రత, పెన్షన్లు, ఆరోగ్య బీమా, నిరుద్యోగ ప్రయోజనాలు, వైకల్య మద్దతు, ప్రసూతి ప్రయోజనాలను కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు అందించాలి. ఐక్యరాజ్యసమితి ఆమోదించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో పేదరిక నిర్మూలనలో అందరికి సామాజిక రక్షణ కల్పించాలి. సామాజిక రక్షణ వ్యవస్థలు, చర్యలను అమలు చేయాలని అన్ని సభ్య దేశాలకు 2015లో ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చింది. ఆదాయ మద్దతు కార్యక్రమాలు చేపట్టి దుర్బలత్వం, అసమానత, పేదరికాన్ని 2030 నాటికీ తగ్గించాలి. వ్యక్తులు, కుటుంబాల జీవిత చక్రంలో పేదరికం, దుర్బలత్వం, అభద్రతను తగ్గించడానికి సామాజిక రక్షణవిధానాలు, కార్యక్రమాలను ప్రభుత్వాలు చేపడుతాయి. ఆదాయభద్రత, ఆరోగ్యసంరక్షణ, ఉపాధి మద్దతు, వృద్ధాప్య పెన్షన్లు, వైకల్య ప్రయోజనాలు, ఆర్థిక రుణభారాల నుండి ప్రజలనురక్షించే, వారి శ్రేయస్సుకు మద్దతుగా సామజిక రక్షణ అవసరం. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డిజి), అంతర్జాతీయ కార్మిక సంస్థ సిఫార్సులకు అనుగుణంగా సామాజిక రక్షణ విధానాలను సభ్య దేశాలు అవలంబిస్తాయి. గడిచిన దశాబ్దంలో భారతదేశం సామాజిక రక్షణ కవరేజీలో గణనీయమైన విస్తరణను నమోదు చేసింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ గుర్తించిన అధికారిక డేటా ప్రకారం భారతదేశంలో సామాజిక రక్షణ కవరేజ్ 2015లో జనాభాలో దాదాపు 19 శాతం ఉంది. అది 2025లో 64.3 శాతానికి పెరిగింది. దీని ఫలితంగా 2025నాటికి 94కోట్ల మంది ప్రజలు చట్టబద్ధంగా కనీసం ఒక సామాజిక రక్షణ ప్రయోజనాన్ని పొందుతున్నారు. పదేళ్లలో కవరేజ్‌లో ఈ 45 శాతం పాయింట్ల పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగవంతమైన విస్తరణలలో ఒకటిగా పరిగణించవచ్చు. లబ్ధిదారుల సంఖ్య పరంగా ప్రపంచంలో రెండవస్థానంలో భారతదేశం ఉంది. ఆదాయ స్థాయిలు, అధికారిక, అనధికారిక రంగాలు, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పౌరులకు నగదు, వస్తువు ప్రయోజనాలను అందించడానికి ప్రభుత్వం చేసిన సమిష్టి ప్రయత్నాన్ని ఈ విస్తరణ ప్రతిబింబిస్తుంది. ఆధార్ ఆధారిత గుర్తింపును ఉపయోగించి అంతర్జాతీయ కార్మిక సంస్థ సహకారంతో జాతీయ సామాజిక రక్షణ డేటా విశ్లేషణ నిర్వహించారు. 34ప్రధాన కేంద్ర పథకాల రికార్డులను సమగ్రపరచి వివరాలను వెల్లడించారు. ఈ విశ్లేషణ ప్రకారం 2024 నాటికి జనాభాలో దాదాపు 65 శాతం అంటే దాదాపు 92కోట్ల మంది ప్రజలు కనీసం ఒక సామా




జిక రక్షణ ప్రయోజనం కిందకు వచ్చారు. ఆహారం, గృహ సహాయం వంటి నగదు, వస్తుపరమైన ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు, కవరేజ్ 2021లో దాదాపు 24.4 శాతం ఉండగా 2024లో 48.8 శాతానికి రెట్టింపు అయింది. భారతదేశంలో బహుళ జనాభా, సామాజిక ఆర్థిక సమూహాలను లక్ష్యంగా సామాజిక రక్షణ నిర్మాణం చేపట్టారు. అనేక ప్రధాన పథకాలను ప్రభుత్వాలు అందిస్తున్నాయి. అతి తక్కువ ప్రీమియంతో పెన్షన్, బీమా చొరవలలో 'ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన' ప్రమాద బీమాను అందిస్తోంది. 2025 మధ్యనాటికి 51 కోట్లకు పైగా నమోదయ్యారు. 'ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన', జీవిత బీమా పథకం, దాదాపు 23.64 కోట్ల వ్యక్తులను కవర్ చేస్తుంది. ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్ ధన్ అనధికారిక కార్మికులను లక్ష్యంగా చేసుకుని పెన్షన్ పథకం, అసంఘటిత రంగ కార్మికులకు 'అటల్ పెన్షన్ యోజన' ఆర్థిక భద్రతను అందిస్తోంది. లక్షలాది మంది చందాదారులను, గణనీయమైన పెన్షన్ కార్పస్ సేకరణలను కలిగి ఉంది. ఆర్థిక బీమాతో పాటు, భారతదేశంలో సామాజిక రక్షణ ఉపాధి, జీవనోపాధి మద్దతు లభిస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద గ్రామీణ కుటుంబాలకు ఏడాదికి కనీసం 125 రోజుల వేతన ఉపాధిని అందిస్తోంది. 'ఇ శ్రమ్ పోర్టల్'లో 30 కోట్లకు పైగా అసంఘటిత కార్మికులు చేరారు. ఇది వివిధ సంక్షేమ పథకాలను ఏకీకృతం చేస్తోంది. సామాజిక రక్షణలో 'ప్రజా పంపిణీ వ్యవస్థ', 'ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన' వంటి విస్తృత సంక్షేమ జోక్యాలు కూడా ఉన్నాయి. ఈ పథకాల ద్వారా లక్షలాది మందికి సబ్సిడీ లేదా ఉచిత ఆహార ధాన్యాలను అందిస్తున్నారు. 'ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన' వంటి చొరవలతో ఆరోగ్య భద్రత బలోపేతం అవుతుంది. ఇది అర్హత కలిగిన కుటుంబాలకు గణనీయమైన ఆరోగ్య కవరేజీని అందిస్తుంది. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను మెరుగుపరుస్తుంది. భారతదేశంలో బహుళకోణ పేదరికం, దుర్బలత్వాన్ని తగ్గించడంలో సామాజిక రక్షణ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. గత దశాబ్దంలో పది లక్షలమంది ప్రజలు పేదరికం నుండి బయటపడినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వివిధ అంచనాల ప్రకారం దాదాపు 24.8 కోట్ల మంది వ్యక్తులు పేదరికం నుంచి బయటపడ్డారు. భారతదేశంలో కొన్ని క్లిష్టమైన సవాళ్లు మిగిలి ఉన్నాయి. అనధికారిక కార్మికులు, పట్టణ పేదలు, వలసదారులు, మహిళలలో సామజిక రక్షణ కవరేజ్ అంతరాలు కొనసాగుతున్నాయి. వీరిలో చాలా మందికి పోర్టబిలిటీ, ప్రయోజనాల గురించి అవగాహన లేదు. ప్రపంచ ప్రమాణాలతో పోలిస్తే భారతదేశంలో సామాజిక రక్షణ వ్యయం చాలా తక్కువగా ఉంది. ప్రయోజనాల సమర్థతను పరిమితం చేస్తుంది. ప్రభుత్వాలు దీర్ఘకాలిక సామాజిక భద్రత కంటే స్వల్పకాలిక ఉపశమనంపై తరచుగా దృష్టి సారిస్తున్నాయి. సామాజిక రక్షణపై పూర్తిగా సాకారం చేసుకోవడానికి, భారతదేశం సమానత్వం, సమర్థత, స్థిరత్వాన్ని నిర్ధారించే సార్వత్రిక, హక్కుల ఆధారిత, సమగ్ర వ్యవస్థల వైపు పయనించాలి. ●

# చిన్నారుల భద్రత అందరి కర్తవ్యం

మేకిరి దామోదర్

కన్నతల్లి పొత్తిళ్లలో ఆడుతూ పాడుతూ పెరగాల్సిన చిన్నారులను కొందరు దుర్మార్గులు అంగడి సరుకుల్లా మార్చుతున్న దారుణ పరిస్థితి సమాజాన్ని కలచివేస్తోంది. చిన్నారి నవ్వులో కనిపించాల్సిన నిర్దోషిత్వం, వారి కళ్లలో మెరవాల్సిన భవిష్యత్తు ఆశలు ఇవన్నీ కొందరి క్రూర వ్యాపా రాలకు బలి పశువులవుతున్నాయి. పేదరికం, అజ్ఞానం, నిరాశ్రయస్థితులను ఆసరాగా చేసుకుని కొన్ని ముఠాలు చిన్నారుల అక్రమ రవాణా అనే ఘోర నేరాన్ని కొనసాగిస్తున్నాయి. నిరుపేద కుటుంబాలకు తక్కువ మొత్తంలో డబ్బు ఇచ్చి పిల్లలను కొనుగోలు చేయడం, అమాయక పిల్లలను అపహరించడం వంటి ఘటనలు పెరుగుతుండటం మన సమాజానికి పెద్ద హెచ్చరికగా మారింది. ఇటీవలి గణాంకాలు చిన్నారుల అదృశ్యాల పెరుగుదలను స్పష్టంగా చూపిస్తున్నాయి. రోజుకు వందల సంఖ్యలో పిల్లలు కనిపించకుండా పోవడం, ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక చిన్నారి అదృశ్యమవుతున్నట్లు అంచనాలు ఉండటం పరిస్థితి ఎంత భయానకమో తెలియజేస్తోంది. ఈ సంఖ్యల వెనుక ప్రతి తల్లి కన్నీరు, ప్రతి కుటుంబం బాధ దాగి ఉంది. ఒక చిన్నారి కనిపించకపోవడం అంటే కేవలం ఒక కేసు నమోదు కాదు ఒక కుటుంబానికి జీవితాంతం మానని గాయం. జనసాంద్రత ఎక్కువగా ఉన్న బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు, మురికి వాడలు ఈ ముఠాలకు వేట స్థలాలుగా మారుతున్నాయి. పర్యవేక్షణ లోపాలు, భద్రతా లోపాలు వీరికి అవకాశాలుగా మారుతున్నాయి. అమాయకత్వమే ఈ చిన్నారుల బలహీనతగా మారుతోంది. తెలియని వ్యక్తుల మాటలకు లోనై ప్రమాదంలో పడుతున్నారు. డిజిటల్ యుగంలో కూడా సోషల్ మీడియా, ఆన్లైన్ గేమ్స్ వంటి వేదికలు కొందరు దుర్వినియోగం చేస్తుండటం మరో ఆందోళనకర అంశం. అపహరించిన చిన్నారులను భిక్షాటనకు దింపడం, బలవంతపు కార్మికులుగా మార్చడం, అక్రమ కార్యకలాపాలకు వినియోగించడం వంటి అమానవీయ చర్యలు జరుగుతున్నాయి. కొందరు బాలికలను వ్యభిచారంలోకి నెట్టివేస్తుండగా, మరి కొన్ని సంఘటనల్లో అవయవాల అక్రమ వ్యాపారం వంటి హీనకృత్యాలు వెలుగులోకి వస్తున్నాయి. చిన్నారి శరీరం, భావాలు, భవిష్యత్తు ఏదీ ఈ ముఠాలకు విలువ కాదు. లాభమే వారి లక్ష్యం. పోలీసులు కొన్ని ముఠాలను పట్టుకోవడం కొంత ఊరటనిచ్చినప్పటికీ, సమస్య మూలాలను



పూర్తిగా నిర్మూలించడంలో ఇంకా లోపాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఒకే ముఠా కొద్ది సంవత్సరాల్లో డజన్ల సంఖ్యలో పిల్లలను విక్రయించడం వంటి ఘటనలు బయటపడటం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోంది. విచారణలో ఆలస్యం, న్యాయ ప్రక్రియలో నత్తనడక, బాధితులకు సరైన పునరావాసం లేకపోవడం వంటి సమస్యలు ఇంకా ఉన్నాయి. దత్తత ప్రక్రియలో ఉన్న ఆలస్యాలు, క్లిష్టతలు కూడా ఈ అక్రమ వ్యవస్థకు బలాన్నిస్తున్నాయి. చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలనుకునే దంపతులు సంవత్సరాల పాటు వేచి చూడాల్సి రావడం వల్ల కొందరు అక్రమ మార్గాల వైపు మళ్లే పరిస్థితి ఏర్పడుతోంది. ఇది ఒక సామాజికపాలనా వైఫల్యానికి సంకేతం. అందుకే పారదర్శకమైన, వేగవంతమైన, సులభమైన దత్తత విధానం అత్యవసరంగా మారింది. ఈ నేపథ్యంలో చట్టాల కఠిన అమలు, వేగవంతమైన న్యాయ ప్రక్రియ, అంతరాష్ట్ర సమన్వయం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా ఈ నేరాలను అరికట్టాల్సిన అవసరం ఉంది. సీసీటీవీలు, ట్రాకింగ్ వ్యవస్థలు, డేటాబేస్‌లు సమర్థంగా ఉపయోగపడాలి. పిల్లల అక్రమ రవాణా సమస్యను నిర్మూలించాలంటే కేవలం చట్టాలు సరిపోవు సమగ్ర దృష్టి అవసరం. పేదరిక నిర్మూలన, ఉపాధి అవకాశాల పెంపు, విద్యా ప్రాచుర్యం వంటి మూల కారణాలను పరిష్కరించాల్సిందే. కుటుంబాలు ఆర్థికంగా బలపడితే పిల్లలను అమ్ముకోవాల్సిన పరిస్థితులు తగ్గుతాయి. ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలుచేస్తూ, పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో బాలల రక్షణ కమిటీలు చురుకుగా పనిచేయాలి. పాఠశాలలు పిల్లలకు సురక్షిత ప్రవర్తన గురించి అవగాహన కల్పించాలి. ప్రజల్లో అవగాహన పెంపు కూడా కీలకం. అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే అధికారులకు తెలియజేయడం, పిల్లలపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. పిల్లల కదలికలపై పర్యవేక్షణ, అత్యవసర సంప్రదింపు వివరాలు వారికి నేర్పించడం వంటి చిన్న చర్యలే పెద్ద రక్షణగా మారవచ్చు. స్వచ్ఛంద సంస్థలు, మీడియా, సామాజిక కార్యకర్తలు కలిసిపిల్లల రక్షణపై చైతన్యం కల్పించాలి. బాధిత పిల్లలకు పునరావాసం, మానసిక బలపరిచే సేవలు అందించడం కూడా అంతే ముఖ్యం. ప్రపంచంలోని కొన్ని దేశాలు అమలు చేస్తున్న కఠిన విధానాలను ఆదర్శంగా తీసుకుని, మన దేశంలో కూడా దృఢమైన చర్యలు చేపట్టాల్సిన సమయం వచ్చింది. పిల్లల రక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు ప్రతి పౌరుడి కర్తవ్యమే. మన చుట్టూ ఉన్న ప్రతి చిన్నారి పరిరక్షణ కూడా మన బాధ్యత అనే భావన పెంపొందాలి. మనం చూసి కూడా చూడనట్టు ఉంటే, వినీ విననట్టు ఉంటే అది ముమ్మాటికి సమాజపు వైఫల్యమే. రేపటి భద్రత, నేటి స్పందనపై ఆధారపడి ఉంది. మన ఉమ్మడి స్పందనే వారి రక్షణగా మారాలి. ●

# ప్రజావాక్కు



## సంయమనం పాటించాలి

నేడుదేశంలో హత్యలు, అత్యాచార సంఘటనల్లో బాధితులపై ఎక్కడ, ఎలా జరిగాయని మీడియాలో సవివరంగా వస్తున్నాయి. దర్యాప్తు చేసే పోలీసులకు తెలుపవలసిన వివరాలన్నీ టీవీ, పేపర్ చూసే సామాన్యులకు అవసరం లేదు. సెల్ ఫోన్లలో వచ్చే ఇలాంటి దారుణ సంఘటనల ప్రసారాలన్నీ కూడా ప్రభుత్వం నియంత్రించాలి. లేకపోతే సమాజంలో బాధితుల పరిస్థితి రచ్చకెక్కి పెనంపైనుండి పొయ్యిలో పడ్డట్టవుతుంది. మరోవైపు నిందితులకు వాళ్ల పరువు పోకుండా ముసుగువేస్తారు. టివీల్లో 24గంటల వార్తా ప్రసారాలవల్ల సమాజంలో సున్నితత్వం, సెంటిమెంట్స్ తగ్గి తాగుడు, డ్రగ్స్ వంటి వాటి మత్తులో సైకోల హింసోన్మాదం, ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. కనుక గతంలో వలె టీవీలు, పత్రికలు సంయమనం పాటించి మొదట జాతీయ వార్తలకి ప్రాముఖ్యత నిచ్చి ఇలాంటి పైశాచిక సంఘటనలని సమాజానికి క్లుప్తంగా తెలపాలి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

## ప్రకృతిని కాపాడుకుందాం

ఒక ప్రక్క అకాలవర్షాలు, వరదలు మరోప్రక్క అడవిలో మంటలు ఇవన్నీచూస్తుంటే, మనిషిమీద ప్రకృతి ప్రతిదాడి చేస్తోందనిపిస్తోంది. ఇంత జరుగుతున్నా ప్రజలకు చీమ కుట్టినట్లయినా లేదు. సుఖాలకు అలవాటు పడిన మనిషి చెట్లను నరుకుతున్నాడు. భూమాత గుండెల్లో గునపాలు నింపుతున్నాడు. దయాదాక్షిణ్యం లేకుండా జంతువులను చంపుతున్నాడు. తనస్వార్థంతో తన సుఖాన్నే వెతుక్కుంటున్నాడే తప్ప ప్రకృతి గురించి ఆలోచించడం మానేశాడు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటే మానవుడు రాక్షసత్వాన్ని వీడి జీవరాశులన్నింటితో సహజీవనం చేయడం నేర్చుకోవాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

## ఫైనాన్స్ సంస్థల ఆగడాలు

రోజురోజుకు డబ్బుల ఎగవేత ఎక్కువ అవుతుంది. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఇవే గొడవలు. కూలి పనులను చేసుకొని పొదుపు చేసిన డబ్బులు అప్పుగా తీసుకోని తరువాత ఇవ్వడంలో ఇబ్బంది పెడుతున్నారు. అనుమతి లెని ఫైనాన్స్ సంస్థలు కొన్ని నడుస్తు న్నాయి. వాటిని అనుమతి తీసుకోని నడిపించేలాప్రభు త్వం కొన్ని నిబంధనలు రూపొందిచడం అవసరం. గొడవలు లేకుండా, అమాయకులు మోసపోకుండా చూడాలి.

- రాపాక. రవీందర్, జనగాం

## ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి

హైదరాబాదు మహానగరంలో పలు కాలనీలలో వారానికి ఒకసారి నిర్వహించే కూరగాయలసంతలలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం జరుగుతోంది. కూరగాయలు అమ్మేవారు కూరగాయలను ప్లాస్టిక్ సంచులలో వేసి ఇవ్వటం, కొనుగోలుదారులు కూడా ప్లాస్టిక్ సంచులలోనే వేసి ఇవ్వాలని అడగటం వల్ల ప్లాస్టిక్ వ్యర్థాల ప్రమాదం ఏర్పడుతోంది. చదువుకున్న వారు కూడా ఇలాంటి దుశ్చర్యలకు దిగటం అత్యంత విచారకరం. దేశనాగరీకులకు పర్యావరణం ఒక పట్టని విషయంగా ఉంది. ప్లాస్టిక్ సంచులవాడకంపై నిషేధఉన్నా, అమలు విషయంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చిన్నట్లు కనపడు తోంది. కూరగాయలను ప్లాస్టిక్ సంచులలో ఉంచి ఫ్రిజ్‌లలో నిల్వ చేయటం వల్ల ప్రమాదకర క్యాన్సర్‌భారీన పడే అవకా శం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నా, అనేకులకు చెవికి ఎక్కటం లేదు. పర్యావరణం పట్ల సరైన తీరు లేని ప్రజలకు తిక్క దించే అధికారగణం రావాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## అమరావతి అభివృద్ధి కాంక్షకు చిహ్నం

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన (సవరణ) చట్టం2026కు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేయడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం. ఏప్రిల్ 6, 2026న ఈ చారిత్రక బిల్లు చట్టంగా మారడంతో, అమరావతికి ఏకైక, శాశ్వత రాజధానిగా చట్టబద్ధమైన హోదా లభించింది. 2014 పునర్విభజన చట్టంలోని సెక్షన్ 5(2)కు చేసిన ఈ సవరణ ద్వారా, "కొత్త రాజధానిఉంటుంది' అనే పాతనిబంధన స్థానంలో "అమరావతియే ఆంధ్రప్రదేశ్ రాజధాని' అనే స్పష్టత వచ్చింది. ఈ విజయం ఐదు కోట్ల ఆంధ్రుల కలల సాకారంగా నిలుస్తుంది. ముఖ్యంగా అమరావతికోసం భూములిచ్చిన రైతుల త్యాగాలకు వారి సుదీర్ఘ పోరాటానికి ఇది దక్కిన గౌరవం. పార్లమెంటు ఉభయ సభలు గత వారం ఈ బిల్లును ఆమోదించగా, దశాబ్దకాలంగా కొనసాగుతున్న సందిగ్ధతకు శాశ్వత ముగింపు పడింది

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## జీవరాశులను పరిరక్షిద్దాం

ప్రస్తుత వేసవికాల దృష్ట్యా మనతో పాటు ప్రకృతి వనంలో భాగమైన జీవరాశులకు ఎక్కడ చూసినా ఎండిపోయిన చెరువులు కుంటలు దర్శనమిస్తుండడంతో సరైన నీరు, ఆహారం లభించక సమస్త జీవరాశులు నేలరాలుతున్నాయి. కాబట్టి అవకాశం ఉన్న చోట నీరు, ఆహారం కల్పించి జీవరాశులను కాపాడే ప్రయత్నం చేద్దాం.

-ఎం.శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# చంద్రగోళం సరే.. మరి భూగోళం పరిస్థితి ఏమిటి?

దాడిశెట్టి శ్యామ్ కుమార్

భారతదేశంతో పాటు రష్యా, చైనా, అమెరికా, జపాన్ లాంటి దేశాలు చంద్రమండలం గురించి ప్రయోగాత్మక పరిశోధనలు చేస్తూనే ఉన్నాయి. ఇటీవల అమెరికాకు చెందిన నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా)మానవ సహిత మిషన్ ఆర్టెమిస్ టూలో భాగంగా చంద్రుడి ఉపరితలం దగ్గరగా వెళ్ళిన వ్యోమగాములు తిరిగి భూమి చేరుకోవడంతో రాబోవు కాలంలో చంద్రమండలం మీద మానవ నివాస నిర్మాణాల విషయమై ఏమైనా అవకాశాలు ఉంటాయా అనే విషయమై విస్తృతంగా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంటుందని శాస్త్రవేత్తల నుండి భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పందొమ్మిది వందల అరవై తొమ్మిది జూలై ఇరవై రోజున అపోలో మిషన్ టూ ద్వారా అమెరికా వ్యోమగాములు చంద్రమండలం మీద అడుగుపెట్టిన తర్వాత చాలా సంవత్సరాల అనంతరం ఆర్టెమిస్ టూ మిషన్ ద్వారా నలుగురు వ్యోమగాములు చంద్రమండలం దగ్గరగా పరిభ్రమణం చేసి రావడంతో అంతరిక్ష పరిజ్ఞానం ప్రయోగాలు మరింత ఆసక్తిని పెంచాయి. మొట్టమొదట చంద్రమండలం మీద అడుగు పెట్టిన మానవుడు చంద్రుని గురించి పరిశోధనలు గావించి శోధించి సాధించింది ఏమున్నా కానీ, భారతదేశం చంద్రయాన్ మిషన్ పేరిట అతి తక్కువ ఖర్చుతో చంద్రమండలం మీదికి పంపిన కృత్రిమ ఉపగ్రహాలు మాత్రం అంతకంటే ఎక్కువగా దక్షిణ ధృవం మీద పరిశోధనలు చేయడమే కాకుండా చంద్రమండలం మీద మంచు రూపంలో నీటి జాడలను గుర్తించినట్టు, అదేవిధంగా సల్ఫర్ ఇనుము ఆక్సిజన్ మెగ్నీషియం సిలికాన్ అల్యూమినియం లాంటి ఖనిజ మూలకాలు చంద్రమండలం మీద కూడా ఉన్నట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో నిర్ధారించుకున్నట్టు చెపుతారు. చంద్రమండల యాత్రలో గతంలో వివిధ దేశాలు కనుగొన్న విశేషాల కంటే భారతదేశ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మానవ రహిత ఉపగ్రహాలను చంద్రమండలం మీదికి పంపి అక్కడ ఉన్నటువంటి అత్యంత విలువైన సమాచారాన్ని ప్రపంచానికి అందించింది. భూమి పుట్టినప్పుడే చందమామ కూడా పుట్టి ఉంటుంది. కాబట్టి పైగా భూమికి ఏకైక సహజ ఉపగ్రహం చందమామ. కాబట్టి చంద్రమండలం మీద చేసిన పరిశోధనలు భూమండలంలో ఉన్న ఖనిజ లవణాలు కూడా చంద్రమండలం మీద పుష్కలంగా ఉండి ఉండవచ్చు అనే భిన్న అభిప్రాయాలు శాస్త్రవేత్తల్లో లేకపోలేదు. అయితే చంద్ర మండలంలో వాతావరణం లేక నిర్మానుష్యంగా ఎందుకు అయిందో నిర్ధారిత కారణాలు ఇంకా తెలుసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఒకవేళ భూమండలంలో మానవుడు ప్రకృతితో చేసే పర్యావరణానికి హాని కలిగించే వికృత కార్యకలాపాలను నియంత్రించుకోలేకపోతే రాబోవు కాలంలో భూమండలం కూడా మానవుని ఉనికిలేని గ్రహంగా మారే అవకాశం లేకపోలేదు అనే వాదనలు వినిపిస్తున్నాయి. భూమండలంలో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా పర్యావరణాన్ని పరీక్షించుకునే బాధ్యత ప్రపంచంలో ప్రతి ఒక్కరిపై ఉంటుందని. భారత పురాణ ఇతిహాసాల్లో చందమామ గురించిన ప్రస్తావన ఉంది. కవులు రచయితలు చందమామను వర్ణించిన సందర్భాలు చందమామ వెన్నెల రాత్రులు చాలా వర్ణనాతీతంగా ఉంటాయని పురాణ కథలు చెపుతూ ఉంటాయి. ఇలాంటి చందమామ అందరిదైనప్పుడు కొందరికే అందుకోవడానికి సాధ్యమవుతుందా అనే సందేహం కలగకమానదు. చందమామను అందుకోవడంలో భారతదేశం కూడా ఉండడం విశేషం. భారతదేశం అంతరిక్ష పరిశోధన కేంద్రం ఇస్రో గగన్‌యాన్ మిషన్ పేరిట అంతరిక్షంలో పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తూనే రాబోవు కాలంలో చంద్రమండలం మీదికి ప్రత్యక్షంగా మానవుని పంపి అక్కడ పరిస్థితులను ఉనికిని అధ్యయనం చేయడానికి ప్రయత్నిస్తుంది అంటే భారతదేశంలో అగ్రరాజ్యాల కన్నా కూడా మరింత వేగవంతంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ అంతరిక్ష ప్రయోగాలను నిర్వహిస్తూ ప్రపంచానికి అంతరిక్ష పరిజ్ఞానంలో ఆదర్శవంతమైన దిశగా పురోగామిస్తుందని చెప్పవచ్చు. భూమండలం చుట్టూ ఉన్న పరిసరాల పట్ల ఆధునికత సంతరించుకుంటున్న మానవుని మితిమీరిన దైనందిన కార్యకలాపాలతో విడుదలవుతున్న వ్యర్థ పదార్థాలు ఇంధనాల మండలం వల్ల వచ్చే విషపూరిత వాయువులు ఇలాంటి అనేకమైన హానికరమైన రసాయనాలు మోతాదు నుంచి వాతావరణంలో కలుస్తూ ప్రకృతి పర్యావరణానికి నష్టం కలిగించే విధంగా ఉంటూనే ఉన్నాయి. ముందు వీటిని నియంత్రించే విధంగా మానవాళి ప్రయత్నం చేస్తూ భూమండలాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉంది. మానవ మేధస్సు భూమండలంలో ఇంకా తెలుసుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నప్పటికీ, వాటి మీద మరింతగా ఆసక్తి చూపించవలసిన అవసరం ఉంది. కానీ అనంత దూరంలో ఉన్న చంద్రమండలంవైపు దృష్టి సారిస్తున్న చంద్రమండలంలో అక్కడ ఏదో సాధిద్దాం అనుకుంటున్న మానవ మేధస్సుకు భూమండలం తప్ప వేరే ఇతర గ్రహాలు ఉపగ్రహాలు మానవ నివాసయోగ్యంగా ఉండగలవా అనేది సంశయమే. అంతరిక్ష పరిజ్ఞానం ఈనాటిది కాదు అతి పురాతనమైన భారతదేశం, గ్రీకు, ఈజిప్టు తదితర దేశాల్లో అంతరిక్ష పరిజ్ఞానం గురించి అనేకమంది పరిశోధనలు గావిస్తూనే అనేక రకాల విలువైన విషయాలను తెలుసుకుంటూ ఖగోళ రహస్యాలతో పాటు ప్రకృతిని కాపాడుకుంటూ భూమి మీద పర్యావరణంపై ప్రత్యేక దృష్టి సారించారని అనేక చారిత్రక అంశాలు తెలియజేస్తాయి. కానీ నేడు అందుకు భిన్నంగా భూమండలంలో జరుగుతున్న పరిణామాలతో మానవ విధ్వంసానికి కారణమయ్యే యుద్ధ నీతితో అధునాతన ఆయుధాలు సృష్టించే బీభత్సం ప్రకృతి పర్యావరణానికి హాని చేసేటటువంటి అస్తవ్యస్తమైన పరిణామాలు భూగోళంలో చోటు చేసుకుంటున్నాయి. అధునాతన విధ్వంసక ఆయుధాలను సమకూర్చుకొని భూమండలంలో కొన్ని దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలతీరు మానవ మనుగడకు పర్యావరణ పరిరక్షణకు నష్టంకలిగించేరీతిలో కొనసాగుతుండడం భూగోళ సహజమైన ప్రకృతికి పర్యావరణ వినాశనానికి ప్రత్యక్షంగా పరోక్షంగా కారణం అవుతున్నాయేమో అని అనిపిస్తుంది. ఏదేమైనప్పటికీ ముందు మానవుడు భూగోళం చుట్టూఉన్న అనేకవిషయాలను లోతుగా తెలుసుకునే అవసరం మరింతగాఉంది. భూమండలాన్ని పరిరక్షించుకోకపోతే మానవ మనుగడకు అంతగా నివాసయోగ్యంగా లేని సురక్షితం కానీ ఉపగ్రహాలు ఇతర గ్రహాలు మానవ జీవన విధానానికి ఏవిధంగా సహకరిస్తాయి అనే అంశాన్ని అంతర్గతంగా ప్రపంచంలోని ప్రతి ఒక్కరు పునరాలోచించాలి. ●

# నోయిడా ఆందోళనల్లో పాక్ హస్తం?

## నిరసనకారుల వాట్సాప్‌చాటింగ్, ఇన్‌స్టా ఎస్ఎంఎస్‌లపై పోలీస్ నజర్, ఏడు ఎఫ్ఐఆర్‌లు, 400 మంది అరెస్టు




**నోయిడా, ఏప్రిల్ 14:** వేతనాల పెంపు కోరుతూ ఉత్తర ప్రదేశ్‌లోని నోయిడాలో కార్మికులు చేపట్టిన నిరసనలు తొలిరోజు హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ఘటనల వెనుక భారీ కుట్ర, ప్లానింగ్ ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీని వెనుక పాకిస్తాన్ హస్తం కూడా ఉండొచ్చనే కోణంలో విచారణ జరుపుతున్నారు. కార్మికుల ఆందోళనలు హింసాత్మకంగా మారడం వెనుకు పాకిస్తాన్ కుట్ర ఉండొచ్చని యూపీ కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్‌బహార్ అన్నారు. ఈ ఘటనల్ని ప్రణాళికాబద్ధంగా జరిగిన కుట్రగా ఆయన అభివర్ణించారు. ఈ విషయాన్ని పోలీసులు తేలుస్తారని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించేందుకే ఈ ఘటనలు జరిగాయని అనుమానం వ్యక్తం చేశారు. ఇటీవల నోయిడాలోని మీరట్ ప్రాంతంలో నలుగురు ఉగ్రవాదులు అరెస్టైన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మరోవైపు ఈ ఘటనపై పోలీసులు లోతైన దర్యాప్తు జరుపుతున్నారు. ఈ విచారణలో సంచలన విషయాలు బయటపడుతున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. ఈ హింస వెనుక భారీ కుట్ర, ప్లానింగ్ ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. ముందుగా కొందరు కార్మికులు వారం రోజుల క్రితం ఫ్యాక్టరీల్లో వేతనాల పెంపు కోరుతూ నిరసన చేపట్టారు. తర్వాత ఈ నిరసనలు వీధుల్లోకి మారాయి. వేల మంది కార్మికులు నిరసనల్లో చేరారు. తర్వాత మరింత ఆందోళనకరంగా మారాయి. పోలీసులపైకి రాళ్లు రువ్వడం, ప్రైవేటు ఆస్తులు ధ్వంసం చేయడం, ఫ్యాక్టరీల్ని ధ్వంసం చేయడం, వాహనాల దహనం వంటి ఘటనలు జరిగాయి. ఈ ఘటనలు ఉన్నట్లుండి జరిగినవి కావని, వీటి వెనుక భారీ కుట్ర ఉందని పోలీసులు తేల్చారు. ఆందోళనకారులు ఈ ఘటనలకు మూడు రోజుల ముందు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని చాటింగ్, ఆడియో కాల్స్ చేసుకున్నట్లు గుర్తించారు. అందరినీ సమీకరించడం, నిరసనలు తెలపడం వంటి వాటిపై చర్చించుకున్నారు. ఈ డిజిటల్ ఎవిడెన్స్‌ను ఫోరెన్సిక్ బృందం పరిశీలిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా చాటింగ్ చేసుకున్నట్లు గుర్తించారు. అందులో ఏకంగా మరుసటి రోజు పోలీసులపై ఎలా దాడి చేయాలో కూడా చర్చించారు. పోలీసులపై దాడి చేసేందుకు కారం కూడా తీసుకురావాలని చర్చించుకున్నారు. పోలీసుల దాడుల్లో తమవాళ్లు గాయపడ్డారని, అందుకు బదులుగా మరిన్ని నిరసనలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ దాడుల్లో కొందరు మాస్కులు ధరించి పాల్గొనడం కూడా చర్చనీయాంశంగా మారింది. వారిని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కార్మికులతో సంబంధం లేని వారు ఈ ఘటనల్లో పాల్గొన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు పోలీసులు దాదాపు 400 మందిని అరెస్టు చేశారు. 7 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

**వేతనాలు పెంచుతున్నట్లు యూపీ ప్రభుత్వం వెల్లడి**

వేతనాలు పెంపు, కనీస హక్కుల కోసం నోయిడా కార్మిక వాడలోని ఫేజ్2లో కార్మికులు చేపట్టిన నిరసన, కార్మికుల డిమాండ్లపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం స్పందించింది. కార్మికులకు కనీస సగటు వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అన్ని స్థాయిల్లోని కార్మికులు ఇది వర్తిస్తుందని తెలిపింది. నిరసనలు జరిగిన గౌతమ్ బుద్ధనగర్ జిల్లా మేజిస్ట్రేట్ మేధా రూపం ఈ వివరాలు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ సూచనలకు అనుగుణంగా వేతనాలు పెంచుతూ సీఎం యోగి ఆదిత్యనాథ్ నిర్ణయం తీసుకున్నట్లు మేధా రూపం తెలిపారు. వేతనాల పెంపు నిర్ణయం ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుందన్నారు. ఈ కమిటీ నిర్ణయం ప్రకారం గౌతమ్ బుద్ధనగర్, ఘజియాబాద్ పరిధిలోని అన్ స్కిల్డ్ వర్కర్స్‌కు నెలకు కనీస వేతనం రూ.13,690గా నిర్ణయించారు. అంతకు ముందు ఈ వేతనం రూ.11,313గా ఉండేది. సెమీ స్కిల్డ్ వర్కర్స్‌కు నెలకు రూ.15,059, స్కిల్డ్ వర్కర్స్‌కు రూ.16,868 అందిస్తారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అన్‌స్కిల్డ్ కార్మికులకు నెలకు రూ.13,006, సెమీ స్కిల్డ్ వర్కర్స్‌కు రూ.14,306, స్కిల్డ్ వర్కర్స్‌కు రూ.16,025 వేతనం అందిస్తారు. యూపీలోని మిగతా జిల్లాల్లో అన్‌స్కిల్డ్ కార్మికులకు నెలకు రూ.12,356, సెమీస్కిల్డ్ వర్కర్స్‌కు రూ. 13,591,స్కిల్డ్ వర్కర్స్‌కు రూ.15,224 వేతనం అందిస్తారు.ఎంప్లాయర్స్ అసోసియేషన్స్, లేబర్స్ యూనియన్లను సంప్రదించిన అనంతరం ఈ మార్పులపై నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వం వేతనాల పెంపుపై నిర్ణయం ప్రకటించినప్పటికీ మంగళవారం కూడా చాలా చోట్ల కార్మికులు నిరసనలు కొనసాగిస్తున్నారు.



# తమిళనాడు ఎన్నికలకు బిజెపి మేనిఫెస్టో

## కుటుంబానికి రూ.10వేలు, ప్రతి మహిళకు రూ.2వేలు

## కుటీర పరిశ్రమలకు రూ.50 లక్షలవరకూ వడ్డీలేని రుణం

**చెన్నై, ఏప్రిల్ 14:** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ మేనిఫెస్టో విడుదల చేసింది. చెన్నైలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ అగ్రనేత, కేంద్ర మంత్రి జేపీ నడ్డా ఈ మేనిఫెస్టో విడుదల చేశారు. మంగళవారం తమిళ నూతన సంవత్సరం కావడం విశేషం. ఈ సందర్భంగా పార్టీ మేనిఫెస్టో విడుదల చేయడం మంచి పరిణామం అని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్, బీజేపీ నేతలు కే అన్నామలై, తమిళిసై సౌందరరాజన్ వంటి కీలక నేతలు పాల్గొన్నారు. ఇక, ప్రజలకు అనేక ఉచిత పథకాల్ని బీజేపీ ప్రకటించింది. సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యం వంటి అంశాల్ని దృష్టిలో పెట్టుకుని ఈ మేనిఫెస్టో రూపొందించినట్లు బీజేపీ నేతలు తెలిపారు. మేనిఫెస్టోలోని కీలక హామీల్లో మహిళలకు ప్రతి నెలా రూ.2,000 ఆర్థికసాయం, ప్రతి కుటుంబానికి ఏటా రూ.10,000 ఆర్థిక సాయం, ఉచిత గ్యాస్ సిలిండర్, జీరో ఎఫ్ఐఆర్ రిపోర్టింగ్ సిస్టమ్ అమలు, క్రూరమైన నేరాల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు, బస్సులు, స్కూళ్లు, యూనివర్సిటీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, అర్హులైన మహిళలు ఈ స్కూటర్లు కొనుక్కునేందుకు రూ.25,000 ఆర్థిక సాయం, స్వయం సహాయక గ్రూపులకు, చిన్న తరహా, కుటీర పరిశ్రమలకు వడ్డీ లేకుండా రూ.50 లక్షల వరకు రుణాలు, రైతులకు అదనంగా రూ.3,000 ఆర్థిక సాయం, జల్లికట్టులో పాల్గొనే ఎద్దుల్ని పెంచేవారికి ప్రతినెలా రూ.2,000 ఆర్థిక సాయం, జల్లికట్టులో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం, మహిళల పేరు మీద ఇల్లు కొంటే మూడు శాతం తక్కువ స్టాంప్ డ్యూటీ విధింపు వంటివి ఉన్నాయి. తమిళనాడులో ఈ నెల 23 అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ 234 అసెంబ్లీ సీట్లున్నాయి. 5.67 కోట్ల మంది ఓటర్లున్నారు. 44 ఎస్సీ సీట్లు, 2 ఎస్టీ రిజర్వుడ్ సీట్లు. మే 4న ఫలితాలు వెలువడుతాయి. డీఎంకే, ఏఐఏడీఎంకే, టీవీకే, బీజేపీ, కాంగ్రెస్ ప్రధాన పార్టీలుగా పోటీ చేస్తున్నాయి.

# దక్షిణాదికి అన్యాయం జరిగితే సహించేదిలేదు..

## దేశం మొత్తం దక్షిణాదివైపుచూసేలా చేస్తాం: తమిళనాడు సిఎం ఎంకే స్టాలిన్



**చెన్నై, ఏప్రిల్ 14:** ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ మంగళవారం కేంద్ర ప్రభుత్వానికితీవ్రహెచ్చరిక చేశారు. రాష్ట్రాలతో సరైన సంప్రదింపులు జరపకుండా కేంద్రంలోని మోడీప్రభుత్వం ఓ రాజ్యాంగ సవరణను బలవంతంగా రుద్దాలని చూస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగినా లేదా దక్షిణ రాష్ట్రాలకు అన్యాయం చేసినా తమిళనాడు భారీ ఉద్యమాన్ని చేపడుతుందని స్టాలిన్ అన్నారు. మహిళా బిల్లు 2023కు సవరణలు, పార్లమెంటులో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్‌ను అమలుకు సంబంధించి ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లుపై చర్చించేందుకు ఈనెల 16, 17, 18 తేదీల్లో పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశం కానున్న నేపథ్యంలో తమిళనాడు సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమిళనాడు, పశ్చిమ్ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతున్న సమయంలోనే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను బలవంతంగా నిర్వహించడం ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేయడమే.. ఈ సమావేశంలో నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణను ఏకపక్షంగా ఆమోదించుకోవాలని కేంద్రం చూస్తోందని, ఇది దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసే కుట్ర అన్నారు. కేంద్రం మార్గదర్శకాల ప్రకారం జనాభా నియంత్రణను దక్షిణ రాష్ట్రాలు సమర్థవంతంగా అమలు చేశాయి. ఇప్పుడు జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచితే నియంత్రణ పాటించినందుకు మాకు శిక్ష వేస్తారాఅని స్టాలిన్ ప్రశ్నించారు.ప్రశాంతంగా ఉన్న దక్షిణాదిని తుఫానుగా మార్చొద్దంటూ కేంద్రాన్ని హెచ్చరిస్తూ, రాష్ట్రాల హక్కుల కోసం ఎటువంటి పోరాటానికైనా సిద్ధమని తమిళనాడు ముఖ్యమంత్రి ప్రకటించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం జరిగినా లేదా దక్షిణ రాష్ట్రాలు అసమానంగా ప్రభావితమైనా తమిళనాడు మౌనంగా ఉండబోదని ముందు నుంచీ మేము దీనిపై నిరంతరం హెచ్చరిస్తూనే ఉన్నామన్నారు.

తమిళనాడులోనే కాకుండా, దేశవ్యాప్తంగా ప్రభావితమయ్యే రాష్ట్రాల ముఖ్య మంత్రులు, ప్రధాన రాజకీయ పార్టీల నాయకులను ఒకచోట చేర్చి, చెన్నైలో సంయుక్త కార్యాచరణ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. తమ ఆందోళనలను తెలియజేయడానికి మరింత సమయం కావాలని కేంద్రాన్ని కోరినట్లు స్టాలిన్ తెలిపారు. వివిధ పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యులు ప్రధానమంత్రిని వ్యక్తిగతంగా కలిసి మా ఆందోళనలను తెలియజేయడానికి మేము సమయం కోరినా కూడా నిరాకరించారని నియోజకవర్గాల పునర్విభజనను తొందరపాటుతో ముందుకు నెట్టే ఈ ప్రయత్నం బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యంపై చేస్తున్న దారుణమైన దాడి. దేశం 1950, 1960ల నాటి డీఎంకే స్ఫూర్తిని మరోసారి చూడబోతోంది. దీనిని బెదిరింపుగా భావించవద్దు. ఇది ఒక హెచ్చరిక. మాకు ఎన్నికలు, అధికారం అనేవి ద్వితీయ ప్రాధాన్యత అంశాలు. మాకు ఆత్మగౌరవం ముఖ్యం రాష్ట్రాల హక్కులు ముఖ్యం.

ఇవి పెరియార్ అన్నా, ముత్తమిళరిగ్నార్ కలైజ్ఞర్ మాకు అందించిన సజీవ ఆదర్శాలన్నారు. మీరు తమిళనాడుకు అన్యాయం చేసి ముందుకు సాగిపోవచ్చని భావిస్తే, మీరు పొరబడినట్టే అని గట్టి హెచ్చరికలు చేశారు. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ జయంతి సందర్భంగా చెబుతున్నది ఒకటే తమిళనాడు ప్రభావితమైతే దేశం మొత్తాన్ని మావైపు చూసేలా చేస్తాం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసి, రాష్ట్రాల హక్కులను కాలరాసే ఏ ప్రయత్నానైనా అడ్డుకుంటాం.. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీజీ తమిళనాడు నుంచి మీకు చేస్తున్న చివరి హెచ్చరిక ఇది. తమిళనాడు పోరాడుతుంది, తమిళనాడు విజయం సాధిస్తుందని స్టాలిన్ ఉద్ఘాటించారు.




# ఐప్యాక్ డైరెక్టర్ వినేష్ చందేల్ అరెస్టు

## రాజకీయ కక్షలో భాగమేనన్న టిఎంసి

**కోల్‌కత్తా, ఏప్రిల్ 14:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ప్రముఖ రాజకీయ వ్యూహకర్త సంస్థ ఐప్యాక్ సహ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ వినేష్ చందేల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్ట్ చేశారు. బెంగాల్ బొగ్గు కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ముందురోజు రాత్రి ఢిల్లీలో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మంగళవారం ఢిల్లీలోని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో హాజరు పరచగా, న్యాయస్థానం ఆయనకు 10 రోజుల ఈడీ కస్టడీ విధించింది. బొగ్గు అక్రమ రవాణా ద్వారా వచ్చిన కోట్లాది రూపాయల నిధులను హవాలా మార్గాల ద్వారా ఐప్యాక్ రిజిస్టర్డ్ కంపెనీకి మళ్లించారని వినేష్ చందేల్‌పై ఈడీ ప్రధానంగా ఆరోపిస్తోంది. 2020లో సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ మనీలాండరింగ్ కేసుపై దర్యాప్తు చేస్తోంది. ఎన్నికలకు కేవలం పది రోజుల ముందు ఈ అరెస్ట్ జరగడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ అరెస్టును తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తీవ్రంగా ఖండించింది. ఇది రాజకీయ కక్ష సాధింపు చర్య అని ఆరోపించింది. టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ స్పందిస్తూ, బెంగాల్ ఎన్నికలకు కేవలం 10 రోజుల ముందు జరిగిన ఈ అరెస్ట్, స్వేచ్ఛాయుత ఎన్నికల స్ఫూర్తిని దెబ్బతీస్తుంది. ఇది ప్రజాస్వామ్యం కాదు, బెదిరింపు చర్య అంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం వినేష్ చందేల్ ఈడీ కస్టడీలో ఉండగా, నిధుల మళ్లింపుపై అధికారులు ఆయన్ను విచారించనున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23,29 తేదీల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

# పెట్రోలుపై రూ.18, డీజిల్‌పై రూ.35 నష్టాలు

## చమురురంగ కంపెనీల అంచనా..

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:** అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో దేశీయ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు భారీ నష్టాలను చవిచస్తున్నాయి. క్రూడ్ ఆయిల్ ధరలు 100 డాలర్లకు పైగా చేరినా దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచకపోవడంతో ఈ నష్టాలు వస్తున్నాయి. ప్రభుత్వ రంగ చమురు కంపెనీలకు లీటర్ పెట్రోల్‌పై రూ. 18, లీటర్ డీజిల్‌పై రూ. 35 చొప్పున నష్టాలు వస్తున్నట్లు కంపెనీ వర్గాలే చెపుతున్నాయి. దశాబ్దం క్రితమే ఆయిల్ ధరలను డీరెగ్యులేట్ చేసినప్పటికీ ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హెచ్‌పీసీఎల్ సంస్థలు 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలను స్థిరంగానే కొనసాగిస్తూ వస్తున్నాయి. రష్యా ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లు దాటింది. ఆ తర్వాత 60 డాలర్ల స్థాయికి దిగవచ్చింది. ఇరాన్ ఇజ్రాయెల్, అమెరికా యుద్ధ ప్రభావంతో ఓ దశలో బ్యారెల్ చమురు 120 డాలర్ల స్థాయికి చేరుకుంది. ఈ క్రమంలో 3 చమురు కంపెనీలు కలిపి రోజుకు రూ. 2400 కోట్ల మేర నష్టాలను భరించాల్సి వచ్చినట్లు చమురు రంగనిపుణుల అంచనా. ప్రభుత్వం మధ్యలో జోక్యం చేసుకోవడంతో కొంత మేర ఊరట లభించింది. పెట్రోల్, డీజిల్ పై లీటరుకు రూ. 10 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. దీంతో ఆయిల్ కంపెనీల నష్టం రోజుకు రూ. 1600 కోట్లకు దిగివచ్చింది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో చమురు కంపెనీలకు వచ్చిన లాభాలు ఒక్క మార్చి నెలలోనే తుడిచిపెట్టుకుపోయినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.జనవరి మార్చి త్రైమాసికంలో నష్టాలు ప్రకటించే అవకాశంఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధర 135 నుంచి 165 డాలర్లకు చేరితే లీటర్ పెట్రోల్ పై రూ. 18,లీటర్ డీజిల్ పై రూ. 35 చొప్పున నష్టాలు వస్తాయని మాక్వారీ గ్రూప్ పేర్కొంది. ముడి చమురు ధర 10డాలర్లు పెరిగితే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు లీటరుకు రూ.6చొప్పున నష్టపోవాల్సి వస్తుందని తెలిపింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిశాక పెట్రోల్ ధరలుపెంచే అవకాశం ఉందనే వాదనలూ వినిపిస్తున్నాయి.ప్రభుత్వం నుంచి మాత్రం పెట్రోల్,డీజిల్ ధరల పెంపునకు సిద్ధమవుతున్నట్లు ఎలాంటి వాదనలు వినిపించడం లేదు.

# ఆస్ట్రేలియా చరిత్రలోనే తొలి ఆర్మీచీఫ్‌గా మహిళ నియామకం



**క్యాన్‌బెరా, ఏప్రిల్ 14:** ఆస్ట్రేలియా కొత్త చరిత్ర లిఖించనున్నది. తొలిసారి ఓ మహిళా ఆ దేశ ఆర్మీకి చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. సుసాన్ కోయిలీని ఆర్మీ చీఫ్‌గా నియమించారు. ఆస్ట్రేలియా సర్కారు ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. 125 ఏళ్ల ఆసీస్ చరిత్రలో ఆర్మీకి తొలిసారి ఓ మహిళ అత్యున్నత పదవిలో కొనసాగనున్నది. జూలైలో ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం సుసాన్ కొయిలీ లెఫ్టినెంట్ జనరల్ గా ఉన్నారు. లెఫ్టినెంట్ జనరల్ సైమన్ స్టువార్ట్ స్థానంలో ఆమె తన కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. 1987లో ఆర్మీ రిజర్వ్‌లో ఆమె ఉద్యోగంలో చేరారు. కమాండ్ పాత్రలో ఆమె ఎన్నో మిషన్స్ చేపట్టారు. ఆఫ్ఘనిస్తాన్, పశ్చిమాసియాలో ఆమె విధులు నిర్వర్తించారు. కొత్త మిలిటరీ చీఫ్‌పై ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటన చేశారు. ఇది చరిత్రాత్మక సందర్భం అవుతుందని రక్షణ మంత్రి రిచర్డ్ మార్ల్స్ పేర్కొన్నారు.

# శోభనం జరగాలంటే రూ.90 లక్షలు ఇవ్వాల్సిందే..

## యుపిలో నవవధువు కండిషన్‌తో అవాక్కయిన పెళ్లికొడుకు

**ఆగ్రా, ఏప్రిల్ 14:** ఏడడుగులు నడిచి జీవితాంతం తోడుంటానని ప్రమాణం చేసిన ఓ నవవధువు, మొదటి రాత్రే తన అసలు స్వరూపాన్ని చూపించింది. మేలిముసుగు తీయాలంటే రూ.90 లక్షలు ఇవ్వాలని భర్తను డిమాండ్ చేసింది. అందుకు అతను నిరాకరించడంతో ఏడాది పాటు వేధించి, చివరకు అతడిని, అతని కుటుంబాన్ని సజీవ దహనం చేసేందుకు యత్నించిన దారుణ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో వెలుగుచూసింది. ఆగ్రాకు చెందిన యువకుడికి గతేడాది ఏప్రిల్ 29న కల్పన అనే యువతితో వివాహం జరిగింది. శోభనం రోజు రాత్రి గదిలోకి వెళ్లాక, తనకు రూ.90 లక్షల నగదు ఇస్తేనే ముసుగు తీస్తానని ఆమె భర్తకు షరతు పెట్టింది. అంత పెద్ద మొత్తం ఇవ్వడం కుదరదని అతను స్పష్టం చేయడంతో, మరుసటి రోజే ఆమె పెళ్లి నగలన్నింటితో పుట్టింటికి వెళ్లిపోయింది.





అప్పటి నుంచి ఏడాది పాటు కల్పన, ఆమె కుటుంబ సభ్యులు వరుడిని వాట్సాప్ ద్వారా బెదిరిస్తూ, ఇంటిపై దాడులు చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఈ ఏడాది మార్చి 26న కల్పన తండ్రి, సోదరుడు వరుడి ఇంటికి వచ్చి గొడవకు దిగారు.

ఉద్దేశపూర్వకంగా ఇంట్లోని పీఎన్‌జీ గ్యాస్ పైప్‌లైన్‌ను ధ్వంసం చేసి, నిప్పు అంటించి కుటుంబాన్ని సజీవ దహనం చేసేందుకు ప్రయత్నించారు.

ఈ ఘటనలో వరుడితో పాటు అతని తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించలేదు. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం జోక్యంతో, ఆగ్రా పోలీసులు తాజాగా వధువు కల్పనతో పాటు ఆమె కుటుంబ సభ్యులపై హత్యాయత్నం, బలవంతపు వసూళ్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మంటల్లో పశ్చిమాసియా

## యుద్ధంతో ఇరాన్‌కు రోజూ రూ.4700 కోట్ల నష్టం




**టెహ్రాన్; ఏప్రిల్ 14:** పశ్చిమాసియాలో యుద్ధం ముదురుతున్నా కొద్దీ ఇరాన్ ఆర్థిక వ్యవస్థ మరింతగా చితికిపోతోంది. ముఖ్యంగా ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీసే లక్ష్యంతో అమెరికా ఆ దేశ ఓడరేవులపై విధించిన నౌకాదళ దిగ్బంధం ఇప్పుడు టెహ్రాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. హార్మూజ్ జలసంధి వేదికగా జరుగుతున్న ఈ ఆపరేషన్ వల్ల ఇరాన్ ప్రతిరోజూ ఏకంగా 435 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ. 4,700 కోట్లకు పైగా) ఆదాయాన్ని కోల్పోతోందన్న అంచనాలున్నాయి. ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి చమురు ఎగుమతులు ఈ దిగ్బంధనం వల్ల పూర్తిగా స్తంభించిపోయాయి. రోజువారీ నష్టంలో 276 మిలియన్ డాలర్లు కేవలం ముడి చమురు, పెట్రోకెమికల్ ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయమే కావడం గమనార్హం. గత నెలలో ఇరాన్‌కు చెందిన ప్రధాన చమురు కేంద్రం ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా బాంబుల వర్షం కురిపించడంతో ఆ దేశ ఎగుమతి సామర్థ్యం ఇప్పటికే 90 శాతం దెబ్బతిన్నట్లు అంచనాలున్నాయి. మార్చి నాటికి ఇరాన్ వద్ద సుమారు 15.4 కోట్ల బ్యారెళ్ల చమురు నిల్వలు ఉన్నప్పటికీ అవి ఎగుమతి కాకపోతే ఆ దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో మునిగిపోవడం ఖాయమని చమురు రంగ నిపుణుల అంచనా.

# అసలు సినిమా ముందుంది..


## ట్రంప్ వ్యాఖ్యలకు ఇరాన్ సినిమాస్టైల్‌లో హెచ్చరిక



**ముంబయి, ఏప్రిల్ 14:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇరాన్ సినిమా స్టైల్‌లో గట్టికౌంటర్ ఇచ్చింది. తమ దాడుల్లో ఇరాన్ నౌకాదళం దాదాపు అంతమై పోయిందన్న ట్రంప్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించింది. బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ సినిమాలోని పిక్చర్ అభీ బాకీ హై (అసలు సినిమా ముందుంది) అనే డైలాగ్‌తో హెచ్చరికలు జారీ చేసింది.ముందురోజు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, ఇరాన్ నౌకాదళం పూర్తిగా కనుమరుగైపోయిందని ప్రకటించారు. అమెరికా దళాలు ఇప్పటికే 158 ఇరాన్ నౌకలను సముద్రంలో ముంచివేశాయని పేర్కొన్నారు. కేవలం కొన్ని ఫాస్ట్ అటాక్ షిప్స్ మాత్రమే మిగిలి ఉన్నాయని, వాటిని తాము పెద్ద ముప్పుగా పరిగణించడం లేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ ఆరోపణలను తిప్పికొడుతూ ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ ఒక వీడియోను విడుదల చేసింది. తమ వేగవంతమైన క్షిపణి బోట్లను పర్షియన్ గల్ఫ్ ఎర్ర తేనెటీగలుగా అభివర్ణిస్తూ, అవి ఇప్పుడే వార్మప్ అవుతున్నాయని తెలిపింది.ఇది కేవలం ట్రైలర్ మాత్రమే,అసలు సినిమా ముందుందని పేర్కొంటూ, తమ చిన్న పడవల గుంపు శత్రువును ఎంత వేగంగా చుట్టు ముట్టగలదో త్వరలోనే చూస్తారని అమెరికాకు బదులిచ్చింది.

# ఐదు గల్ఫ్‌దేశాలకు ఇరాన్ నోటీసులు..

## యుద్ధంలో నష్టానికి మాకు పరిహారం చెల్లించాల్సిందే!




**టెహ్రాన్, ఏప్రిల్ 14:** పశ్చిమాసియాలో యుద్ధం ముదురుతున్న వేళ ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ దేశంపై అమెరికా, ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులకు సహకరిస్తున్నాయనే ఆరోపణలతో పొరుగున ఉన్న ఐదు దేశాల నుంచి యుద్ధ నష్టపరిహారం కోరుతూ ఐక్యరాజ్య సమితిలో ఫిర్యాదు చేసింది. సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, జోర్డాన్ దేశాలు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని అందుకే తమకు వాటిల్లిన నష్టానికి పరిహారం చెల్లించాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. సహకరించిన దేశాలకు మూల్యం తప్పదని ఐక్యరాజ్య సమితిలో ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరవానీ అధికారిక ప్రకటన చేశారు. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ఈ ఐదుదేశాలు తమ భూభాగాలను, వాయు మార్గాన్ని ఉపయోగించుకునేలా సహకరించాయని ఆయన ఆరోపించారు. ఈక్రమంలోనే ఇరాన్‌కు జరిగిన భౌతిక, నైతిక నష్టాలకు ఈ దేశాలే పూర్తి బాధ్యత వహించాలని ఇరాన్ విదేశీ వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది.

# యుద్ధంతో 25 లక్షలమంది పేదరికంలోకి..

## ఐక్యరాజ్యసమితి మానవాభివృద్ధి విభాగం నివేదిక

**న్యూయార్కు, ఏప్రిల్ 14:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావం భారతదేశంపై పడుతోంది. ఈ యుద్ధం కారణంగా దేశంలోని 25 లక్షల మంది ప్రజలు పేదరికంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. పశ్చిమాసియాలో సంక్షోభం నేపథ్యంలో ఇప్పటికే చమురు ధరలు భారీగా పెరిగాయి. పలు దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్నాయి. ఈ సంక్షోభం భారత్‌పైనా తీవ్ర ప్రభావం చూపనుందని ఐక్యరాజ్యసమితి తాజాగా తెలిపింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఆసియా, పసిఫిక్‌లో మానవ అభివృద్ధిపై ప్రభావాలు పేరుతో ఐక్యరాజ్య సమితి డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఓ నివేదికను రూపొందించింది. ఈ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 88లక్షల మంది ప్రజలు పేదరికంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.ఈ యుద్ధం ప్రభావం భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, ఫిలిప్పీన్స్‌తో సహా అనేక దేశాల్లో ఆహార భద్రత ఒత్తిళ్లు తీవ్రమవుతాయని హెచ్చరించింది. యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే భారతదేశంలో యూరియా నిల్వలు తగ్గిపోతాయని తెలిపింది.

# రోజుకు 20 లక్షల బ్యారెళ్ల చమురు ఎగుమతులు నిలిపివేత



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:** అంతర్జాతీయంగా చమురు మార్కెట్‌లో తీవ్ర సంక్షోభం నెలకొంది. అమెరికా సైన్యం ఇరాన్‌కు చెందిన ఓడరేవులను దిగ్బంధించడంతో ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ చర్యతో ఇరాన్ నుంచి రోజుకు సుమారు 20 లక్షల బ్యారెళ్ల చమురు ఎగుమతులు నిలిచిపోనున్నాయని, ఫలితంగా ప్రపంచ మార్కెట్‌లో సరఫరా తగ్గి పెట్రోలియం ఉత్పత్తుల ధరలు మరింత పెరగనున్నాయని నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ నోమురా వెల్లడించిన వివరాల ప్రకారం అమెరికా చర్యల ప్రభావం భారత్‌పైనా తీవ్రంగా పడనుంది. ముఖ్యంగా హార్మూజ్ జలసంధిని పూర్తిగా దిగ్బంధిస్తే, భారత్‌కు వచ్చే ఎల్‌పీజీ సరఫరాకు అంతరాయం కలగవచ్చని నోమురా విశ్లేషకుడు బినీత్ బంకా తెలిపారు. దీంతో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 107 డాలర్ల గరిష్ఠ స్థాయికి చేరింది. మళ్లీ చర్చలు జరగవచ్చన్న ఆశలతో మంగళవారంక్రూడ్ ధర 100 డాలర్ల దిగువకు చేరింది.



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, టి-పిసిసి అధ్యక్షుడు

# ప్రత్యేక ప్రాజెక్టుగా అంబేద్కర్ మ్యూజియం

## ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

**హైదరాబాద్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త:** రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఎన్టీఆర్ మార్గ్‌లోని అంబే ద్కర్ విగ్రహం, మ్యూజియం వద్ద మంగళవారం స్మారక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, తెలంగాణ పిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్‌గౌడ్, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్వరలో ప్రారంభం కానున్న అంబేద్కర్ థీమాటిక్ మ్యూజియం బ్రోచర్, ప్రివ్యూ వీడియాను వారు అధికారికంగా ఆవిష్క రించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ మ్యూజియం దేశంలోనే తొలిసారిగా అంబేద్కర్ జీవితం, తత్వం, దేశ నిర్మాణంలో ఆయన చేసిన సేవలకు అంకితం చేయబడిన ప్రత్యేక ప్రాజెక్టుగా నిలుస్తు ఉదన్నారు. ఈ మ్యూజియం అంబేద్కర్ విగ్రహ సముదాయం లోపల నిర్మించబడుతూ ఒక ప్రముఖ సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చేయబడుతుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అంబేద్కర్ విప్లవాత్మక ఆలోచనలను ప్రజలకు చేరవేయడమే ఈ ప్రాజెక్ట ప్రధాన లక్ష్యమని, ఈ థీమాటిక్ మ్యూజియంలో ఐదు విభాగాలుగా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేయబడతాయన్నారు. అంబేద్కర్, కులం, వర్గం, అంబేద్కర్, రాజ్యాంగం, అంబేద్కర్ ఆధునిక రాజ్యాంగం, అంబేద్కర్ ఆధునిక భారత్, అంబేద్కర్ ప్రపంచం అని వివరించారు. కళాత్మకత, డిజిటల్ సాంకేతికతను సమన్వయం చేస్తూ ఈ మ్యూజియంలో ఇంటరాక్టివ్ డిస్‌ప్లేలు, ప్రత్యేక ప్రదర్శనలు, కాంస్య శిల్పాలు, అధునిక మల్టీ మీడియా ఏర్పాట్లు ఉంటాయని, ఇది సందర్శకులకు విదానపరమైన, ఆసక్తికరమైన అనుభూతిని అందిస్తుందన్నారు. ఈ మ్యూజియం ద్వారా అంబేద్కర్ సమానత్వం, న్యాయం, రాజ్యాగ విలువలపై ఉన్న దృష్టిని గౌరవిస్తూ భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఈ బ్రోచర్, ప్రివ్యూ వీడియో ఆవిష్కరణ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట అభివృద్ధిలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని, త్వరలోనే జ్ఞానం, ఆత్మపరిశీలన, ప్రేరణగా కేంద్రంగా మారుతుందన్నారు.

## టెట్ అర్హత మార్కులు తగ్గించకపోవడం బాధాకరం

### పిటిఎ టిజి డిమాండ్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 14:** టీజర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)లో ఇన్‌సర్వీస్ టీచర్లకు అర్హత మార్కులు తగ్గించకపోవడం బాధాకరమని ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ(పిటిఏ టిజి) అభిప్రాయ పడింది. రాష్ట్రంలో టెట్ అర్హత మార్కులను తగ్గించాలన్న విజ్ఞప్తులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోవడం తీవ్ర నిరాశ కలిగిస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె మల్లిఖార్జున్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కె శారద, అదనపు జనరల్ సెక్రటరీ మేడ దేవదాస్ అన్నారు. పలు మార్లు ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ తరఫున, వివిధ ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు విజ్ఞాపన పత్రాలు సమర్పించినప్పటికీ, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఉపాధ్యాయుల పట్ల మొండి వైఖరిని సూచిస్తోందనానరు. ఈ విషయాన్ని తమ సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్య హక్కు చట్టం అమలు (2010)కు ముందు నియామకం పొందిన వేలాది మంది సీనియర్ ఉపాధ్యాయులు, వారి కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే పునరాలోచన చేయాలన్నారు. టెట్ అర్హత మార్కులను తగ్గించడం, సీనియర్ ఉపాధ్యాయుల సర్వీస్‌ని పరిగణలోకి తీసుకొని ప్రతి సంవత్సరానికి 1 మార్కు చొప్పున వెయిటేజ్ మార్కులు ఇవ్వడం ద్వారా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించవచ్చని సూచించారు.

# కార్యకర్తల ఆత్మగౌరవాన్ని కెసిఆర్ కాళ్ల వద్ద తాకట్టు పెట్టిన జీవన్

## త్వలో జగిత్యాల వస్తా: నియోజకవర్గ ముఖ్యనేతలతో సిఎం రేవంత్‌రెడ్డి



జగిత్యాల ముఖ్యనాయకులతో సిఎం రేవంత్‌రెడ్డి సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్14:** మంగళవారం సాయంత్రం జగిత్యాల నియోజకవర్గ ముఖ్య నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ నివాసంలో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పరిస్థితులను పంచుకోవాలనే మీతో సమావేశమయ్యామని సిఎం చెప్పారు. మేం ఎప్పుడూ జీవన్ రెడ్డిని తక్కువ చేసి చూడలేదు.. ఆయన మర్యాదను తగ్గించేలా మాట్లాడలేదు ఆయన గౌరవాన్ని తగ్గించేలా వ్యవహరించలేదు అని సిఎంకు తెలిపారు. 2023 ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం అంతా కష్టపడ్డాం, పార్లమెంటు ఎన్నికల్లో ఆయన్ను కరీంనగర్ నుంచి పోటీ చేయాలని సూచించాం కానీ ఆయన నిజామాబాద్ నుంచి పోటీ చేస్తానని కోరినా పార్టీ టికెట్ ఇచ్చింది. దురదృష్టవశాత్తు ఆయన ఓడిపోయారు అని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో కూడా జీవన్ రెడ్డి సూచించిన వారికే టికెట్లు ఇచ్చాం భవిష్యత్‌లో ఆయనకు, ఆయన కుటుంబ సభ్యుల రాజకీయ భవిష్యత్‌కు హామీ ఇచ్చినా వినలేదు. మొండి పట్టుతో జీవన్ రెడ్డి పార్టీ వీడారు అని పేర్కొన్నారు. 40 ఏండ్లు ఆయన కోసం పనిచేసిన కార్యకర్తలను మోసం చేసి.. దుర్మార్గుడైన కెసిఆర్‌తో జతకట్టారు అని వ్యాఖ్యానించారు. జీవన్ రెడ్డి లాంటి వ్యక్తి కేసీఆర్ దగ్గర చేతులు కట్టుకుని నిలబడటం అత్యంత బాధాకరం అని చెప్పారు. జగిత్యాల కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మగౌరవాన్ని జీవన్ రెడ్డి, కేసీఆర్ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారు అని వ్యాఖ్యానించారు. ఆయన వయసుకు,అనుభవానికి ఇది తగదు ఈనాటికీ ఆయన గౌరవానికి భంగం కలిగేలా ఒక్క మాట మాట్లాడలేదు అని చెప్పారు, కుట్రలను తిప్పి కొట్టాలని మనం ప్రయత్నం చేస్తుంటే.. ఆయన వెళ్లి అక్కడ చేరారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని పడగొడతామంటే నిలబెట్టడం తప్పా..నేను చేస్తుంది మంచో చెడో మీరే ఆలోచించండి ఎవరు ఏమిటి అన్నది కాలమే నిర్ణయిస్తుంది అండగా నిలబడండి.. మళ్లీ కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకొద్దాం ధైర్యంగా ఉండండి..త్వరలోనే కార్యకర్తలను కలిసేందుకు జగిత్యాలకు వస్తా..అంతా కలిసికట్టుగా జగిత్యాలను అభివృద్ధి చేసుకుందాం వ్యక్తికంటే పార్టీ ముఖ్యమని నిరూపించిన మీ అందరినీ అభినందిస్తున్నా అని సిఎం చెప్పారు.

# ఆశాజనకంగా మిర్చి ధరలు!

## తేజారకం మిర్చి క్వింటా రూ.21,580

## ఇక చపాట మిర్చి క్వింటా రూ.50వేలు



**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** తెలంగాణలో మిర్చి ధరలు భారీగా పెరిగాయి. ఈ ఏడాది మిర్చి రైతులకు అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. అన్ని రకాల మిర్చి ధరలు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా ఖమ్మం, వరంగల్ వ్యవసాయ మార్కెట్లలో తేజా రకం ఎండు మిర్చి క్వింటా రూ. 21,000 రూ. 21,580 వరకు ధర పలుకుతోంది. తాజాగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తేజా మిర్చి క్వింటా రూ.21,000 వరకు, ఏసీ మిర్చి రూ.21,580 వరకు పలికింది. చైనా నుంచి ఆర్డర్లు పెరగడంతో అంతర్జాతీయ డిమాండ్ పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. అలాగే టమాటా మిర్చి, ఎల్లో మిర్చి వంటి ప్రీమియం రకాలు కూడా రూ.40,000-50,000 వరకు ధర పలుకుతున్నాయి. ఈ సిజన్‌లో మిర్చి కొనుగోళ్లు మొదలైన జనవరి 1 నుంచి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు 13లక్షల మిర్చి బస్తాలను విక్రయించేందుకు రైతులు తీసుకొచ్చారు. ఈ సీజన్ పూర్తయ్యే నాటికి మరో 3లక్షల బస్తాల వరకు రావొచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది 34లక్షలకు పైగా మిర్చి బస్తాలు ఖమ్మం మార్కెట్‌కు తరలివచ్చాయి. అయితే గతేడాది మిర్చి ధర రూ.12,500 నుంచి 14వేల వరకు మాత్రమే పలికింది. కేవలం తేజా మిర్చి మాత్రమే కాకుండా, టమాటా మిర్చి, ఎల్లో మిర్చి ధరలు కూడా అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. ఇవి క్వింటాకు రూ.40,000 నుండి రూ.50,000 వరకు పలకడం విశేషం. పంట నాణ్యత బాగుండటం, విదేశీ మార్కెట్ అవసరాలు పెరగడంతో మిర్చి రైతులకు ఈ ఏడాది మార్కెట్ పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో మిర్చి ధరలకు ఫుల్ డిమాండ్ ఉండడంతోపాటు మధ్యప్రదేశ్, ఇతర రాష్ట్రాల్లో మిర్చి సాగు తగ్గడం వల్ల తెలంగాణలో మిర్చికి ఫుల్ డిమాండ్ పెరిగింది.

## అంబేద్కర్ స్ఫూర్తితో మహిళా రిజర్వేషన్ల అమలు


### ప్రతి ఒక్కరూ మహిళా బిల్లుకు మద్దతివ్వాలి

### అంబేద్కర్‌కు ఘన నివాళి అర్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త:** మహిళలకు సమానత్వ హక్కు కోసం పోరాడిన మహనీయుడు రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. అంబేద్కర్ స్ఫూర్తితోనే కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టబోతోందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ బిల్లుకు మద్దతు తెలపాలని కోరారు. మంగళవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆ మహనీయుడి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. అణగారిన వర్గాల ప్రజల వెలుగు రేఖ... అంటరానితనాన్ని పాతాళానికి తొక్కి కుల రక్కసిని కూకటివేళ్లతో పెకలించేందుకు తన జీవిత సర్వస్వాన్ని ధారపోసిన మేధావి అంబేద్కర్ అన్నారు. భారత ప్రజాస్వామ్యానికి దిక్సూచి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్. అణగారినవర్గాల ఆత్మగౌరవ సూచిక అంబేద్కర్ అంటూ ఐక్యరాజ్యసమితి ప్రశంసించిందంటే అంబేద్కర్ ఎంత గొప్పవాడో అర్థం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం స్మరించుకోవాల్సిన మహనీయుడు అంబేద్కర్. ఆయన జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. అత్యంత నిరుపేద కుటుంబంలో పుట్టి కిరోసిన్ దీపాల వెలుగుల్లో కష్టపడి చదువుకుని ప్రపంచమే గర్వించే స్థాయిలో గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మేధావి అంబేద్కర్, మన పొరుగు దేశాలతోసహా ప్రపంచంలోని ఎన్నో దేశాల్లో తూ రాచరిక పాలన కొనసాగుతున్న పరిస్థితులు.

# డా. అంబేద్కర్ విప్లవాత్మక ఆలోచనలను ప్రజలకు చేరవేయడం ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం

## అంబేద్కర్ థీమాటిక్ మ్యూజియం బ్రోచర్, ప్రివ్యూ వీడియో ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం భట్టి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్14:** డా. బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా, ఎన్టీఆర్ మార్గ్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం, మ్యూజియం వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించిన స్మారక కార్యక్రమంలో అంబేద్కర్ జీవితం, ఆయన చిరస్థాయిగా నిలిచిన వారసత్వాన్ని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రముఖులు స్మరించుకున్నారు. త్వరలో ప్రారంభం కానున్న డా. బి.ఆర్. అంబేద్కర్ థీమాటిక్ మ్యూజియం బ్రోచర్, ప్రివ్యూ వీడియోను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ మ్యూజియం భారతదేశంలోనే తొలిసారిగా డా. బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితం, తత్వం, దేశ నిర్మాణంలో ఆయన చేసిన సేవలకు అంకితం చేయబడిన ప్రత్యేక ప్రాజెక్ట్‌గా నిలుస్తుంది. ఈ మ్యూజియం అంబేద్కర్ విగ్రహ సముదాయం లోపల నిర్మించబడుతూ, ఒక ప్రముఖ సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చేయబడుతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా డా. అంబేద్కర్ విప్లవాత్మక ఆలోచనలను ప్రజలకు చేరవేయడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. ఈ థీమాటిక్ మ్యూజియంలో ఐదు విభాగాలుగా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేయనున్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ జీవితం, అంబేద్కర్ కులం వర్గం, అంబేద్కర్ రాజ్యాంగం, అంబేద్కర్ ఆధునిక భారత్, అంబేద్కర్ ప్రపంచం విభాగాలుగా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేయనున్నారు.

## అసెంబ్లీ ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్,చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్14:** రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా శాసనసభ ఆవరణలోని విగ్రహానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్. వి.నరసింహా చార్యులు, అధికారులు పాల్గొన్నారు.



# సీట్ల విభజనలో బిజెపి కుట్ర

## - పెంచడం కాదు.. తగ్గిస్తున్నారు
## - మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయమే
## - దేశానికి గాంధీ, అంబేద్కర్ రెండు కళ్లు
## - అంబేద్కర్ జయంతి వేడుకలో సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్14:** రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రజాపాలన సాగిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్ మణ్, సీతక్క, తదితర నేతలు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వాధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ పదేళ్ల విధ్వంసం వందేళ్ల నష్టానికి దారి తీసిందని విమర్శించారు. గతంలో చేసిన అప్పులు చెల్లిస్తూ తప్పులు సరిదిద్దుతూ పాలన సాగిస్తున్నామని అన్నారు. గత సర్కారు పాలనతో పోలిస్తే ఈ ప్రజా ప్రభుత్వంలో దళితులకి అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో బీజేపీ కుట్రలు చేస్తోందని, 50 శాతం ప్రాతిపదికన సీట్లు పెంచుతామని దక్షిణాది రాష్ట్రాల సీట్ల కోటా తగ్గించాలని చూస్తున్నారని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలలో మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతుంది ఈ చిన్న లెక్క కేంద్ర మంత్రులుగా ఉన్నవాళ్ళకి తెలియడం లేదా? బండి సంజయ్,కిషన్‌రెడ్డిలను ప్రశ్నించారు. సమాన అవకాశాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడపవచ్చని అంబేద్కర్ మార్గదర్శనం చేశారని రేవంత్ రెడ్డి అన్నారు. గాంధీ, అంబేద్కర్ దేశానికి రెండు కళ్ల లాంటివారని కొనియాడారు. రక్తం చిందకుండా యుద్ధం గెలవచ్చని గాంధీ నిరూపించారని, బలమైన దేశంగా భారత్ ఎదగడానికి అంబేద్కర్ కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజల కలలు సాకారం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పేదలకు నాణ్యమైన విద్య కోసం గతంలో లేని విధంగా చర్యలు చేపట్టామని, తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానంతో పిల్లల భవిష్యత్ మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, గతంలో చేసిన అప్పులు, తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నామని, పదేళ్ల విధ్వంసం వందేళ్ల నష్టానికి దారి తీసిందని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందిందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ బిల్లును లోక్‌సభలో కొన్ని పార్టీలు అడ్డుకున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నారని, దక్షి ణాదిన కుటుంబ నియంత్రణ వల్ల జనాభా తగ్గి సీట్లు కోల్పోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కేంద్రం రాష్ట్రాల్లో దామాషా ప్రకారం 50 శాతం సీట్లు పెంచుతామన్నారని తెలిపారు.

# భారత రాజ్యాంగ రచనలో అంబేద్కర్ పాత్ర మరువలేనిది

## బిసి కమిషన్ కార్యాలయంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 14:** భారత రాజ్యాంగ రచనలో భారత రత్న, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పాత్ర మరువలేనిదని తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ జి నిరంజన్ అన్నారు. మంగళవారం రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఛైర్మన్ జి నిరంజన్ సభ్యులు రాపోలు జయ ప్రకాష్, రంగు బాలు లక్ష్మి ్మ కార్యాలయ సిబ్బంది అంబే ద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివా ళులర్పించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లా డుతూ.. భారత రాజ్యాంగ రచనలో అంబేద్కర్ పాత్ర మరువలేనిదని అలాగే అణగారిన వర్గాలు రిజర్వేషన్లు కల్పించిన వ్యక్తి అని అంబేద్కర్‌ను కొనియాడారు. రాజ్యాంగ రచనల సందర్భంలో ఎలాగైతే ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించారో అలాగే బీసీలకు రిజర్వేషన్లు పొందు పరిచే అంశాన్ని నేడు పరిశీ లించాల్సిన అవసరం ఉందన్నారు.

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసే సందర్భంలో బీసీ మహిళలకు కూడా రిజర్వేషన్ కల్పించాలని నిరంజన్ కోరారు.

# అనుమతులు లేకుండానే నిర్మాణాలు

## అద్దెకున్న వారిని ఖాళీ చేయించాకే కూల్చివేతలు

## అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ వివాదంపై హైడ్రా వివరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 14,ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో న్యాయవాది ఎం.ఎ. ముఖీం సాగిస్తున్న ఆక్రమణకు చెక్‌పెట్టినట్లు హైడ్రా తెలిపింది. గతవారం రోజులుగా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో జరుగుతున్న కూల్చివేతల వివాదం, దుష్ప్రచారంపై మంగళవారం వివరణ ఇచ్చింది. అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ విలేజ్లోని ప్రభుత్వ భూమిలో ముఖీం సోదరుడు అజీం అపార్టుమెంట్లు కట్టి హైడ్రా వచ్చేసరికే అమ్ముకున్నాడని.. ఇప్పటికే 4 అపార్టుమెంట్లు నిర్మించి ప్రజలకు అమ్మేయగా.. హైడ్రా వచ్చాక 6 అంతస్తుల భవన నిర్మాణ దశలోనే హెచ్చరించిందని తెలిపింది. ఈ భవనానికి ఎలాంటి అనుమతులు లేవని 2025వ సంవత్సరం జూన్ నెల 25వ షోకాజ్ నోటీసు ఇచ్చామని అయితే ఈ షోకాజ్ నోటీసుకు గతంలో గ్రామపంచాయతీ అనుమతులు ఇచ్చిందని.. కిష్టారెడ్డి పేటలో తన భవనం వస్తుందని అజీం వివరణ ఇచ్చాడని కానీ ఎక్కడా నిర్మాణ అనుమతులను హైడ్రాకు ప్రొడ్యూస్ చేయలేదని తెలిపారు. పంచాయతీ అనుమతులున్నాయని చెప్పడంతో వాటిపై విచారించగా.. పంచాయతీతో పాటు తర్వాత మున్సిపాలిటీలోనూ ఎలాంటి అనుమతులు తీసుకున్నట్టు ఆధారాలు లేవని హైడ్రా నిర్ధారించిందని దీంతో 2025జులై 3వ తేదీన స్పీకింగ్ ఆర్డర్‌ను జారీ చేసి..15 రోజుల గడువు కూడా ఇచ్చినట్లు హైడ్రా ఇచ్చినట్లు తెలిపారు. అయితే భవన నిర్మాణాన్ని ముఖీం సోదరుడు అజీం పూర్తి చేయగా హైడ్రా నోటీసుల దృష్ట్యా ఆ భవనంలోని 45 ఫ్లాట్లలో ఏ ఒక్కటినీ కొనడానికి వినియోగదారులు ముందుకు రాలేదని దీంతో వాటిని తన అనుచరులతో పాటు.. ఈ విషయాలు ఏవీ తెలియని అమాయకులతో 20 ఫ్లాట్ల వరకూ నింపాడని పేర్కొన్నారు. గతంలో అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో కట్టిన 4 అపార్టుమెంట్లలో కొన్నవారు నష్టపోకూడదని సైలెంట్‌గా ఉన్న హైడ్రా.. షోకాజ్ నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చిన భవనం విషయంలో చర్యలకు సిద్ధమై అద్దెకు ఉన్న వారిని ఖాళీ చేయాలని స్పష్టంగా సూచిస్తూ భవన యజమానికి నోటీసులు ఇచ్చిందని తెలిపారు.

# మూడోసారి ఇంటర్ బోర్డ్ చరిత్రలోనే అత్యుత్తమ మార్కులతో నారాయణ ఆల్‌టైమ్ రికార్డ్!




**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 14:** తెలంగాణ రాష్ట్ర ఇంటర్-2026 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు సత్తా చాటారు. జూనియర్ ఇంటర్ యం.పి.సి. విభాగంలో 470 మార్కులకు గాను 469, 469 మార్కులతో రెండు స్టేట్ ఫస్ట్ మార్కు సాధించి విజయదుందుభి మోగించారు. సీనియర్ ఇంటర్ యం.పి.సి. విభాగంలో 1000 మార్కులకు గాను 996 మార్కులను ఐదుగురు విద్యార్థులు సాధించారు. జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 440 మార్కులకు 438 మార్కులను 14 మంది విద్యార్థులు సాధించారు. సీనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలోనూ 1000 మార్కులకు గాను 994 మార్కులను ముగ్గురు నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఇక ఫలితాలను గ్రూపుల వారీగా విశ్లేషిస్తే జూనియర్ ఇంటర్ యం.పి.సి. విభాగంలో ఇంటర్ బోర్డ్ చరిత్రలోనే అత్యధికంగా 470 మార్కులకు గాను 169 మార్కులతో నారాయణ విద్యార్థులు కె. సాయిగౌతమ్, జి, వరేణ్య చరిత్ర సృష్టించారు, 468 మార్కులు 183 మంది, 467 మార్కులు 470 మంది, 466 మార్కులు 667 మంది, 465 మార్కులు 694 మంది విద్యార్థులు సాధించారు. అలాగే సీనియర్ ఇంటర్ యం.పి.సి. విభాగంలో 1000 మార్కులకు గాను 996 వంటి అత్యుత్తమ మార్కులను ఐదుగురు విద్యార్థులు కైవసం చేసుకున్నారు. అలాగే 995 మార్కులను 10 మంది, 994 మార్కులను 29 మంది, 993 మార్కులను 71 మంది, 992 మార్కులను 121 మంది సాధించారు. అదేవిధంగా జూనియర్ ఇంటర్ బై.పి.సి. విభాగంలో 440 మార్కులకు గాను 438 మార్కులను మొత్తం 14 మంది విద్యార్థులు కైవసం చేసుకోగా 437 మార్కులను 49 మంది, 436 మార్కులను 68 మంది, 435 మార్కులను 67 మంది నారాయణ విద్యార్థులు సాధించారు. సీనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 994 మార్కులు ముగ్గురు సాధించగా, 993 మార్కులు ముగ్గురు, 992 మార్కులు 11 మంది, 991 మార్కులు 11 మంది, 990 మార్కులు ఏడుగురు సాధించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్స్ డాక్టర్ పి. సింధూర నారాయణ, శరణి నారాయణ, రమా నారాయణ తెలిపారు.

# కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నాడు అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరి గాయి. ఈ వేడుకలకు డిజిపి శివధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి డిజిపి పూలమాలవేసి నివాళు లు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డిజిపి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతగా అన్ని వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ ఎంతగానో కృ షి చేశారని కొనియాడారు. అంబేద్కర్ సేవలు చిరస్మరణీయమని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో మల్టీ జోన్ 1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్‌పి రాజేష్ చంద్ర, ఏఎస్‌పి చైతన్య రెడ్డిలతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



డా॥బి.ఆర్.అంబేద్కర్, డా॥బాబుజగ్జీవన్ రామ్‌ల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలి

### ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు బక్కి వెంకటయ్య, మంద కృష్ణ మాదిగ

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 14,ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మందపల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవంలో భాగంగా మంగళవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలను రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య,ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదగి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలన్నారు. డాక్టర్ అంబేద్కర్, డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతి రావు పూలే ముగ్గురు మహనీయుల వలనే దళితుల బతుకులు మారాయన్నారు. కార్యక్రమంలో మాజీ సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పోచబోయిన శ్రీహరి యాదవ్, ప్రజాప్రతినిధులు, దళిత, ప్రజాసంఘాల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## డిజిపి కార్యాలయంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** డిజిపి కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిజిపి కార్యా లయ అధికారులు పలువురు పాల్గొన్నారు.

## 23 నుంచి 25 వరకు కొత్తగూడెంలో రైతుసంఘం రాష్ట్ర మహాసభలు

### రాష్ట్ర 3వ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించిన సంఘం నేతలు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 14:** ఈ నెల 23, 24, 25 తేదీల్లో కొత్తగూడెంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర 3వ మహాసభలు జరగనున్నాయి. మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం రైతుసంఘం నేతలు సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. తెలంగాణ వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభంపై సమరశంఖం పూరించడానికి, రైతాంగ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర 3వ మహాసభలు ఈ నెల ఏప్రిల్ 23, 24, 25 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్నాయని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పోతినేని సుదర్శన్ రావు, టి సాగర్ తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రైతుల జీవితాల్లో ఆశించిన మార్పు రాలేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు, పాలకుల నిరక్ష ్యం మరోవైపు రైతన్నను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయని, ఈ నేపథ్యంలో గడిచిన మూడేళ్లలో జరిగిన పోరాటాలను సమీక్షించుకుని, భవిష్యత్ కార్యాచరణను రూపొందించు కోవడానికి ఈ మహాసభలు ఒక వేదిక కానున్నాయన్నారు.

# బలహీన వర్గాల కోసం పోరాడిన మహానుభావుడు అంబేద్కర్

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు



**హైదరాబాద్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త:**సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల సాధికారత కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు, ఆయన కృషి వల్లే ఈరోజు రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ సమాజంలో ఉన్న అసమానతలను తగ్గించే విధంగా మార్గం చూపించారని అన్నారు. రాహుల్ గాంధీ రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకొని తిరుగుతున్నారని, ఆయన అలా ఎందుకు చేస్తున్నారో తెలియదు కానీ, ముందుగా కాంగ్రెస్ పార్టీ చరిత్రలో అంబేద్కర్‌పై వారు ఎలా వ్యవహరించారో పరిశీలించుకోవాలన్నారు. స్వాతంత్ర్యానికి ముందు బాంబే ప్రెసిడెన్సీలో అంబేద్కర్‌ని పోటీ చేయకుండా అడ్డుకోవడం, ఆయనకు వ్యతిరేకంగా అభ్యర్థులను నిలబెట్టి ఓడించడం, రాజ్యాంగ సభలో ఆయనకు అవకాశం ఇవ్వకపోవడం వంటి చర్యలు కాంగ్రెస్ పార్టీ చేసినవే. చివరికి ముస్లిం లీగ్ మద్దతుతోనే ఆయన అసెంబ్లీలోకి ప్రవేశించాల్సి వచ్చిందన్నారు. స్వాతంత్ర్యం తర్వాత కూడా పరిస్థితి మారలేదు. డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్‌గా అంబేద్కర్‌ని అంగీకరించడంలో కూడా కాంగ్రెస్ నాయకత్వం తొలుత వెనుకంజ వేసింది. ముఖ్యంగా జవహర్ లాల్ నెహ్రూ ఆయన అనేక ప్రతిపాదనలను వ్యతిరేకించారు.1953లో నెహ్రూ ముఖ్యమంత్రులకు రాసిన లేఖలో రిజర్వేషన్లు ప్రమాదకరమని పేర్కొన్నారు. 1961లో నేను ఏ రూపంలోనైనా రిజర్వేషన్లను ఇష్టపడను, ముఖ్యంగా ఉద్యోగాల్లో అని స్పష్టం చేశారు. ఇవన్నీ రికార్డుల్లో ఉన్న విషయాలే అన్నారు. ఇంతటితో ఆగకుండా, అంబేద్కర్ రాజకీయ జీవితాన్ని కాంగ్రెస్ పార్టీ పదేపదే దెబ్బతీసింది. ఆయన ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రత్యర్థులను నిలబెట్టి రెండు సార్లు ఓడించిందన్నారు. హరిజన్ సేవక్ సంఘ్ వంటి సంస్థలను ఏర్పాటు చేసి ఆయన ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నం చేసింది.

ఆయనకు భారతరత్న కాంగ్రెస్ పాలనలో కాకుండా తర్వాతి ప్రభుత్వ కాలంలోనే లభించిందన్నారు.

# ఇంజనీరింగ్ ఎగుమతుల్లో తెలంగాణ దూకుడు

## 2023-24 నుండి 2024-25 వరకు 118శాతం వృద్ధి నమోదు

## ఫార్మాకు దీటుగా ఇంజనీరింగ్ ఎగుమతులు కొత్త రికార్డులు

## విమాన విడిభాగాలు, రక్షణ రంగ ఉత్పత్తుల్లో పరుగులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్14:**ఇప్పటివరకూ ఫార్మా రంగ ఎగుమతులకు ప్రసిద్ధి చెందిన తెలంగాణ తాజాగా ఇంజనీరింగ్ ఎగుమతుల్లో కొత్త రికార్డులు నెలకొల్పుతోంది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నేషనల్ ఇంపోర్ట్-ఎక్స్‌పోర్ట్ రికార్డ్ ఫర్ ఇయర్లీ అనలిసిస్ ఆఫ్ ట్రేడ్ (నిర్యాత్) పోర్టల్లో పొందుపరచిన గణాంకాల ప్రకారం 2023-24 నుంచి 2024-2025 మధ్య తెలంగాణ, దేశంలో ఇంజనీరింగ్ ఎగుమతుల్లో అత్యధికంగా 117.9శాతం వృద్ధిని నమోదు చేసి అగ్రస్థానంలో నిలిచింది. విమాన విభాగాలు, రక్షణ పరికరాలు, పరిశ్రమ యంత్రాలు వంటి ఇంజనీరింగ్ వస్తువుల ఎగుమతుల్లో రాష్ట్రం గణనీయమైన వృద్ధి రేటుని నమోదు చేసింది. కేవలం రెండేళ్లలోనే ఇంజనీరింగ్ ఎగుమతులు నాలుగు రెట్లు పెరిగాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మంగళవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. 2022-23లో 1,827 మిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు 2024-25 నాటికి 7,536 మిలియన్ డాలర్లకు చేరుతూ 103శాతం వార్షిక సమ్మిళిత వృద్ధి రేటు (సిఎజిఆర్)ను నమోదు చేయడం చారిత్రాత్మకం. అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాల సగటు వృద్ధి కేవలం 10శాతం మాత్రమే ఉండగా, తెలంగాణ రికార్డు నెలకొల్పే వృద్ధి నమోదు చేసుకోవడం గమనార్హం. రాష్ట్ర సరుకుల ఎగుమతుల్లో ఇంజనీరింగ్ వస్తువుల వాటా 38.44శాతంకు చేరింది. ఇది తెలంగాణ ఎగుమతి రంగంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా భారీ మార్పును సూచిస్తోంది. కాగా, 2025-26తో పాటు రానున్న పది సంవత్సరాల్లో ఇదే రకమైన వృద్ధిని కనబరిచే అవకాశాలున్నాయని పరిశ్రమ వర్గాలు సూచిస్తున్నాయి. కాగా, ఈ వృద్ధికి గల ప్రధాన కారణం ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో భారీ స్థాయిలో ఉత్పత్తులు పెరగడమేనని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. హైదరాబాద్‌లో లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, ఎయిర్‌బస్, సఫ్రాన్, జీఈ ఏవియేషన్, ప్రాట్ విట్నీ, కాలిన్స్ ఏరోస్పేస్, హనీవెల్ వంటి అంతర్జాతీయ కంపెనీలు తమ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో, విడి విభాగాలు ఉత్పత్తి వల్ల తెలంగాణ రాష్ట్రం కీలక తయారీ కేంద్రంగా అవతరించింది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుదీరిన నాటి నుండి గణనీయమైన పురోగతితో దేశంలో తెలంగాణ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న రాష్ట్రంగా నిలిచింది.

# కోటి రూపాయల విలువైన పాన్ మసాలా రికవరీ..

**ఆలేరు ఏప్రిల్ 14 ప్రభాతవార్త :** ఇటీవల ఆలేరు సమీపంలో దొంగతనానికి గురైన రూ.కోటి విలువైన పాన్ మసాలా కాటన్లను ఆలేరు పోలీసులు పట్టుకున్నారు. ఆలేరు ఎస్‌ఎచ్ ఓ డియాలాద్రి మంగళవారం ఆలేరు పోలీస్ స్టేసన్లో విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఢిల్లీ సమీపంలోని నోయిడా నుంచి హైదరాబాదుకు రూ.కోటికి పైగా విలువైన పాన్ మసాలా కాటన్ల లోడుతో ఈనెల 8న కంటెయినర్ బయలుదేరింది. రెండు రోజుల అనంతరం కంటైనర్ ఆచూకీ లేకుండా పోయింది. పాన్మసాలా వ్యాపారి వినోద్ ఉపాధ్యాయ యాదాద్రి జిల్లా ఆలేరు సమీపంలోకి చేరిన అనంతరం కంటెయినర్ ఆచూకీ లేకుండా పోయిందని, కంటెయినర్ డ్రైవర్ సద్దాంపై అనుమానం వ్యక్తం చేస్తూ ఈనెల 12 ఆలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోని దిగిన పోలీసులు కంటెయినర్ డ్రైవర్ సద్దాం ను కాచిగూడ(హైదరాబాదు) లో ఉన్నట్లు గుర్తించి ఈనెల 13న అదుపులోకి తీసుకుని విచారించారు. హైదరాబాదుకు చెందిన మరో వ్యక్తి సిరాజ్తో కలిసి కంటెయినర్ ను సద్దాం ను విచారించగా ఆలేరు బైపాస్రోడ్డు పక్కన క్రషర్ మిల్లు వద్ద నిలిపి ఉంచాడు. హైదరాబాదుకు చెందిన సిరాజ్ తో మాట్లాడి డిసిఎంను తెప్పించాడు. సద్దాం, సిరాజ్ కలిసి కంటెయినర్లోని పానమసాలా కాటన్లను డీసీఎంలోకి చేర్చారు.

# అన్ని రాష్ట్రాలకు న్యాయం కోసం హైబ్రిడ్ మోడల్‌కు మద్దతివ్వండి

**- దక్షిణాది రాష్ట్రాల గొంతుక బలంగా వినిపించాలి**

**: తమిళనాడు, పుదుచ్చేరి,కర్ణాటక, ఎపి, కేరళ సిఎంలకు రేవంత్ లేఖలు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్14:** డీలిమిటేషన్ ప్రక్రియ విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. మోదీ సర్కార్‌పై యుద్ధం చేసేందుకు సిద్దమయ్యారు. ఈ నేపథ్యంలోనే దక్షిణాది రాష్ట్రాల మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. లోక్‌సభ సీట్లను ప్రోరేటా పద్ధతిలో పెంచే ప్రతిపాదన దక్షిణాది రాష్ట్రాలకు నష్టం చేస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి మొదట లేఖ రాసి తర్వాత దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాశారు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల సీఎంలు కలిసి రావాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.దక్షిణాది రాష్ట్రాలు కలిసి కట్టుగా దీనికి వ్యతిరేకంగా నిలబడాలని తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.కె. స్టాలిన్, కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ద రామయ్య. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్, పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామిలకు మంగళవారం సాయంత్రం లేఖలు రాశారు. మహిళల రిజర్వేషన్, డిలిమిటేషన్, లోక్‌సభ సీట్ల పెంపు అనే మూడు వేర్వేరు అంశాలను కలిపి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని లేఖలో ప్రస్తావించారు. లోక్‌సభ సీట్లను 543 నుంచి 850కు పెంచేందుకు ప్రోరేటా పద్ధతిలో సీట్లను పంచితే దక్షిణ రాష్ట్రాల ప్రాధాన్యం తగ్గిపోతుందని అప్రమత్తం చేశారు. దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకునే రాష్ట్రాలు నష్టపోతూ, జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు లాభపడే పరిస్థితి వస్తుందని అన్నారు. అందుకే అన్ని రాష్ట్రాలకు న్యాయం జరిగేలా లోక్‌సభ సీట్లను పెంచేందుకు హైబ్రిడ్ మోడల్(50శాతం ప్రోరేటా, 50శాతం జీఎస్‌డిపి ఆధారంగా)ను పరిశీలించాలని, ఈ అంశంపై మద్దతు ఇవ్వాలని కోరారు. నియోజకవర్గాల పెంపునకు వ్యతరేకంగా పోరాడేందుకు రాష్ట్రాలు ఐక్యంగా ముందుకు రావాలని ఆయన కోరారు, జనాభా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం.. లోక్‌సభ సీట్లను పెంచితే.. జనాభా నియంత్రణను కచ్చితంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు భారీగా అన్యాయం జరుగుతుందని స్టాలిన్‌కు రాసిన లేఖలో రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా దక్షిణాది రాష్ట్రాలు.. జనాభా నియంత్రణలో కఠిన చర్యలు చేపట్టి.. జనాభా విస్ఫోటనాన్ని అడ్డుకున్నాయని.. ఇప్పుడు అదే పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు.డీలిమిటేషన్ విషయంలో దక్షిణాది రాష్ట్రాల గొంతుకను బలంగా వినిపించాల్సిన అవసరం ఉందని.. దానికి సమయం కూడా వచ్చిందని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# డీలిమిటేషన్ రాజ్యాంగబద్ధ ప్రక్రియ రాజకీయ పార్టీ తీసుకున్న నిర్ణయం కాదు

**మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించడం తగదు : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**డిలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని, ఇది రాజకీయ పార్టీగా తీసుకుంటున్న నిర్ణయం కాదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కొద్దిరోజులుగా తమిళనాడు, తెలంగాణ సీఎంలు రేవంత్‌రెడ్డి, స్టాలిన్ అనేక రకాలుగా విమర్శించే ప్రయత్నం చేస్తున్నారని తప్పుబట్టారు. దేశ హితం కోసం కీలక నిర్ణయాలు తీసుకునే శక్తి కాంగ్రెస్ పార్టీకి లేదని విమర్శించారు. అన్ని పార్టీల సహకారంతో మహిళా రిజర్వేషన్ బిల్లుకు సవరణలు తీసుకొచ్చి అమలు ప్రక్రియను త్వరలోనే ప్రారంభిసామని ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఢిల్లిలో విలేకరులతో మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన డిలిమిటేషన్ ప్రక్రియను చేపడితే తక్కువ జనాభా ఉండే దక్షిణాదికి నష్టమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకూడదని ఆలోచించి మోది సర్కారు నిర్ణయం తీసుకుందన్నారు. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సీట్ల ప్రాతిపదికన కొత్త సీట్లు పెంచుతున్నామని వివరించారు. అయినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి వితండవాదంతో విమర్శించడం సరికాదన్నారు. ఈ విషయంలో తనను బంట్రోతు అని విమర్శించారని, కాని కాంగ్రెస్ పార్టీనే తెలుగు ప్రజలను, తెలుగు నాయకులను బంట్రోతులుగా చూసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోది హయాంలో దక్షిణాదినుంచి ఇద్దరు ఉపరాష్ట్రపతులను చేశామని, దక్షిణాది నేతలకు ఆర్థిక, రక్షణ, వాణిజ్య, గ్రామీణ, పట్టణాభివృద్ధి శాఖ వంటి ఎన్నో బాధ్యతలు ఇచ్చామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. మరి రాహుల్ గాంధి ఎందుకు యూపి వదిలిపెట్టి కేరళకు వచ్చారని, అభిషేక్ సింఘ్వీ ఉత్తరాదిని వదిలిపెట్టి తెలంగాణకు ఎందుకొచ్చారని..?, సిఎం రేవంత్ సమాధానం చెప్పగలరా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో మొదటి అతిమేధావి రాహుల్ గాంధీ అయితే రెండో అతిమేదావి రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ పార్టీకి కోశాధికారిగా మారారని ఆయన ఎద్దేవా చేశారు. డిలిమిటేషన్ ప్రక్రియ 50శాతం జనాభా ప్రాతిపదికన, 50శాతం ఎకనమిక్ ఇండెక్స్ ఆధారంగా ఉండాలని సిఎం రేవంత్ తీసుకొచ్చిన విధంగా ప్రపంచంలో ఎక్కడా జరగలేదన్నారు.

# హెచ్‌సిఎకు త్వరలోనే మంచిరోజులు

**కొత్త సెక్రటరీ మన్నె జీవన్ రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 14,ప్రభాతవార్త :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ను పారదర్శకంగా నడిపిస్తామని ఇటీవలే కొత్తగా సెక్రటరీ బాధ్యతలు చేపట్టిన జీవన్ రెడ్డి అన్నారు. క్లబ్ సెక్రటరీలు, అసోసియేషన్ సభ్యులతో సమావేశమైన ఆయన అందరి అభిప్రాయాలు తీసుకున్నారు. హెచ్‌సీఎకు త్వరలోనే మంచిరోజులు రాబోతున్నాయని చెప్పారు. క్లబ్ సెక్రటరీలకు ఎలాంటి ఇబ్బందులున్నా నేరుగా వచ్చి తనను కలవచ్చని, స్టేడియంలోని తన ఛాంబర్‌లో అందుబాటులో ఉంటానని తెలిపారు. అసోసియేషన్ ను పారదర్శకంగా, అవినీతికి తావులేకుండా నడిపించడమే తన లక్ష్యమన్నారు. ఆటగాళ్ల వయసు మోసాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. ప్రతీ ప్లేయర్ బర్త్ సర్టిఫికెట్,. ఆధార్ కార్డును అప్లికేషన్‌తో పాటు క్లబ్స్ తీసుకోవాలని సూచించారు. అలాగే క్లబ్ సెక్రటరీల సూచన ఆధారంగా నాలుగురోజుల మ్యాచ్‌లను మూడురోజుల మ్యాచ్ లుగా మార్చే ఆలోచన చేస్తున్నట్టు వెల్లడించారు.

# ప్రధానికి సిఎం రేవంత్ లేఖ రాయడం సరికాదు: ఎన్‌వి సుభాష్

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**మహిళల సాధికారతకు వ్యతిరేకంగా సిఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని బిజెపి విమర్శించింది. పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు వ్యతిరేకంగా ప్రధాని మోదికి సిఎం రేవంత్ లేఖ రాయడాన్ని తీవ్రంగా తప్పుబట్టఇంది. సిఎం రేవంత్ చారిత్రాత్మక సంస్కరణను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని బిజెపి సీనియర్ నేత, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్‌వి. సుభాష్ మండిపడ్డారు. ఈ విషయమై ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అకస్మాత్తుగా ఏకాభిప్రాయం అంటూ రేవంత్ మాట్లాడడం ఉద్దేశ్యపూర్వక ప్రయోజనాల కోసమేనని విమర్శిఇంచారు. గతంలో కాంగ్రెస్ పలు వివాదాస్పద నిర్ణయాలను విస్తృత చర్చ లేకుండానే తీసుకున్నప్పుడు ఈ ఏకాభిప్రాయం ఎక్కడికి పోయింది? అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డిలిమిటేషన్‌తో అనుసంధానం చేయకుండా వేరుచేయాలని సీఎం పట్టుబడటం సంస్కరణను ఆలస్యం చేయాలనే యత్నమేనని స్పష్టం చేశారు. కాగా సిఎం రేవంత్ దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాయడాన్ని కూడా బిజెపి తప్పుబట్టింది. ఇది ఉత్తర-దక్షిణ విభజనకు దారి తీసే ప్రమాదకర ప్రయత్నమని మండిపడింది. సిఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ మోడల్‌ను తిరస్కరించింది. రాష్ట్రంలో పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే సిఎం రేవంత్ లేఖా రాజకీయాలకు పాల్పడుతున్నారని బిజెపి మండిపడింది.

# రోడ్డు ప్రమాదాల నివారణకు అరైవ్ అలైవ్ కార్యక్రమం

**ట్రాఫిక్ నియమాలపై అవగాహనతోనే ప్రాణ రక్షణ :డిజిపి శివధర్ రెడ్డి**



ప్రతిజ్ఞచేస్తున్న డీజీపీ శివధర్ రెడ్డి, అధికారులు

**నిర్మల్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిళలతో కలిసి పాల్గొన్నారు. డీజీపీకి గుస్సాడీ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించడం వల్ల జరిగే ప్రమాదాలు కుటుంబాలను తీవ్రంగా దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్ వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించరాదని హెచ్చరించారు. రాష్ట్రంలో అధిక శాతం మరణాలు రోడ్డు ప్రమాదాల వల్లనే జరుగుతున్నాయని, ఇది ఆందోళనకరమని అన్నారు. ప్రతి గ్రామంలో రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేసి, అవగాహన పెంపొందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో అన్ని గ్రామాల్లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బాధ్యతా యుతంగా ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. వారోత్సవాలకే పరిమితం కాకుండా ఎల్లప్పుడూ రోడ్డు భద్రతపై చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, గ్రామస్థులు ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకోవడమే కాకుండా, తెలియజేయాలని సూచించారు.

# సింగూరు డ్యాం నుండి సాగునీటి విడుదలకు సర్కారు గ్రీన్ సిగ్నల్

## హార్షం వ్యక్తం చేస్తున్న ఉమ్మడి మెదక్ జిల్లా అన్నదాతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాల పరిధిలోని యాసంగి పొలాలకు సాగునీరు విడుదల కావడంతో అన్నదాతలు హార్షం వ్యక్తం చేస్తున్నారు. ఎట్టకేలకు మంజీర డ్యామ్ నుంచి 0.3 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నీటిపారుదల శాఖ ఎస్‌ఈ (ఐఅండ్‌క్యాడ్ సర్కిల్) విజ్ఞప్తి మేరకు మంజీరా బరాజ్ నుంచి 0.3 టిఎంసిల నీటిని దశల వారీగా విడుదల చేస్తున్నారు. సోమవారం రాత్రి డ్యామ్ గేట్లు ఎత్తి నీటిని ఆయకట్టు కాలువలకు విడుదల చేశారు. సాగునీటి విడుదలతో ఘన్‌పూర్ ఆయకట్టు పరిధిలోని రైతాంగానికి ఊరట లభించింది. ఘన్‌పూర్ ఆయకట్టు పరిధిలోని 10 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, ఏడు చెక్‌డ్యామ్‌లకు నీరు చేరుతోంది. మెదక్ జిల్లాలోని ఘనపూర్ ఆనకట్ట కింద యాసంగి సీజన్‌లో పెద్ద ఎత్తున వరి సాగు అయింది. అయితే పంట చేతికందే దశలో నీటి తడులు అందక వరి ఎండుముఖం పడుతుండటంతో వేలాది మంది రైతులు సింగూర్ ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల కోసం ఎదురుచూశారు. ఘనపూర్ ఆనకట్ట కింద కొల్చారం, పాపన్నపేట, మెదక్ రూరల్, మెదక్ టౌన్, హవేలి ఘనపూర్ మండలాల్లో 21,625 ఎకరాల ఆయకట్టు ఉంది. సాధారణంగా సంగారెడ్డి జిల్లాలోని సింగూర్ ప్రాజెక్ట్ నుంచి నీరు విడుదలైతేనే ఈ ప్రాంతాల్లో సాగు జరుగుతుంది. అయితే ప్రాజెక్ట్ మరమ్మతుల కారణంగా ఈ యాసంగి సీజన్‌కు క్రాప్ హాలిడే ప్రకటించారు. అయినప్పటికీ రైతులు బోర్ల ఆధారంగా సుమారు 20 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా సింగూర్ నుంచి రెండు సార్లు నీరు విడుదల కావడంతో ఘనపూర్ ఆనకట్ట నిండి కాల్వలకు నీరు చేరి వరి పంటలు ఎదిగాయి.

ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉండగా ఆనకట్టలో నీరు పూర్తిగా తగ్గిపోయి కాల్వలు వెలవెలబోతున్నాయి. ఎండలతో భూగర్భ జలాలు కూడా తగ్గిపోవడంతో బోర్ల ద్వారా సరిపడా నీరు అందడం లేదు. కీలక దశలో నీటి కొరతతో పంటలు దెబ్బతింటాయని ఆందోళనలో కూరుకుపోయిన రైతులకు ఊరట కలిగేలా రాష్ట్ర ప్రభుత్వం సింగూరు డ్యాం నుంచి సాగునీటిని విడుదల చేస్తోంది.

# ఆర్టీసీ సిబ్బంది ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..ఆర్టీసి ఎండి నాగి రెడ్డి



ప్రసంగిస్తున్న ఆర్టీసీ ఎండీ నాగి రెడ్డి

**చిక్కడపల్లి ఏప్రిల్ 14 ( ప్రభాతవార్త ) :** ఆర్టీసీ సిబ్బంది ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, సిబ్బంది సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం అని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మంగళవారం ఆర్టీసీ కళాభవన్ లో అత్యంత ఘనంగా నిర్వహించారు. నాగిరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సిహెచ్. వెంకన్న, ఖుస్రో షా ఖాన్, రాజశేఖర్, సాల్మన్, ఫైనాన్షియల్ అడ్వైజర్ విజయపుష్ప తదితరులు పాల్గొని అంబేద్కర్‌కు అంజలి ఘటించారు. వై. నాగిరెడ్డి మాట్లాడుతూ ఒక సమాజం ఎంత పురోగతి సాధించిందనేది ఆ సమాజంలోని మహిళలు సాధించిన అభివృద్ధిని బట్టే తాను కొలుస్తానన్న అంబేద్కర్ మాటలను ప్రతి ఒక్కరూ మనసా వాచా స్మరించుకోవాలని గుర్తు చేశారు. నేడు భారతదేశం ప్రపంచంలోనే అత్యంత బలమైన ప్రజాస్వామ్య దేశంగా నిలవడానికి అంబేద్కర్ అందించిన అత్యున్నత రాజ్యాంగమే కారణమని ఆయన కొనియాడారు. ప్రతి పౌరుడికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించి, రాజ్యాంగ రక్షణ అందించిన మహనీయుని ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ, బాధ్యత కలిగిన పౌరులుగా జీవించడమే మనం ఆ మహనీయునికి ఇచ్చే అసలైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమం పట్ల మేనేజ్‌మెంట్ ఎల్లప్పుడూ సానుకూలంగా ఉందని నాగిరెడ్డి గారు స్పష్టం చేశారు. కార్మికులు, సిబ్బంది ఎవరూ కూడా అనవసర ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, సిబ్బంది సమస్యలను పరిష్కరించడమే సంస్థ యొక్క ప్రధాన ధ్యేయమని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సంస్థను మరింత ముందుకు తీసుకువెళ్లడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జేడీ సి.నర్మద, ఈడీ లు సిహెచ్.వెంకన్న, ఖుస్రో షా ఖాన్, రాజశేఖర్, సాల్మన్, ఎఫ్‌ఏ విజయపుష్ప, సిటీఎం ఏం సి శ్రీ .శ్రీధర్, సిపిఎం ఉషాదేవి, సీఈ(ఐటి) శ్రీమతి శ్రీదేవి, రంగారెడ్డి ఆర్ఎం శ్రీలత, ఎస్సీ, ఎస్టీ యూనియన్ చైర్మన్ రాజయ్య నాయక్, , పలువురు ఆర్ఎం లు, అధికారులు పాల్గొన్నారు.

# ఎండల బారి నుండి జాగ్రత్తగా ఉండండి

**రాష్ట్రవ్యాప్తంగా చలివేంద్రాల ఏర్పాటు: మంత్రి సీతక్క**

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని పంచాయత్‌రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రజా భవన్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఎండల తీవ్రత ఎకుక్కవగా ఉన్నందున ప్రజలు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు బయటికి రావొద్దని సూచించారు. అత్యవసర పనులు ఉంటే ఉదయం 6 గంటల నుండి 10 గంటల మధ్యలో పూర్తి చేసుకుని మిగిలిన సమయాల్లో ఇంటి వద్దే ఉండటం శ్రేయస్కరమన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటికి రావాల్సి వస్తే తలకు టోపి, తలపాగా పెట్టుకోవాలని, శరీరాన్ని ఎండ నుంచి రక్షించుకోవాలని సూచించారు. ఈ జాగ్రత్తలు పాటించకపోతే వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పంచాయత్‌రాజ్‌శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలు, మండల కేంద్రాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ చలివేంద్రాలు తక్షణమే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కాగా ఉపాధిహామీ పథకం కింద పనిచేస్తున్న కార్మికులకు మంత్రి సీతక్క ప్రత్యేక సూచనలు చేశారు. వేసవికాలంలోనే ఎక్కువగా పనులు జరుగుతున్న నేపథ్యంలో కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలో పని చేయాల్సి వస్తే తలకు తలపాగా ధరించడం, సమీపంలో తాగునీరు ఉంచుకోవడం తప్పనిసరి అని చెప్పారు.

# ఆర్టీసీ సమ్మెపై సంఘాలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

**సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది: మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 14:** ప్రజల ప్రజా రవాణా దృష్ట్యా ఆర్‌టీసీలో సంఘాలు చేపట్టనున్న సమ్మెపై సంఘాలు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆర్‌టీసీ విలీనం, కార్మిక సంఘాల అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయని, ఆర్టీసీ విలీనానికి సంబంధించి కమిటీ పని చేస్తుందన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు చెప్పుకోవడానికి మా తలుపులు తెరిచే ఉన్నాయన్నారు. ఎవరైనా వచ్చి తమ సమస్యలు చెప్పుకోవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనీ, ఉద్యోగుల సమస్యలను సామరస్యపూర్వకంగా చర్చల ద్వారా పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాలకు సంబంధించిన అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయని, ఈ రెండు అంశాలు తప్ప మిగతా ఉద్యోగుల సమస్యలపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే ఆర్టీసీ ఉద్యోగులకు 2.1 శాతం డీఏ అమలులోకి తీసుకువచ్చామని, ప్రస్తుతం ఎలాంటి డీఏ బకాయిలు లేవని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ అంశం కూడా ఆలోచిస్తున్నామని, ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ప్రకటించారు. ఆర్టీసీ ఉద్యోగుల విలీనంపై గత ప్రభుత్వం 9 సెప్టెంబర్ 2023న కమిటీ ఏర్పాటు చేసిందని ఎన్నికల షెడ్యూల్‌కు 10 రోజుల ముందు హడావిడిగా విలీనం అంశాన్ని ముందుకు తీసుకువచ్చారని మంత్రి పొన్నం గుర్తుచేశారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి, జీఏడి సెక్రటరీ, రోడ్డు రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి, ఆర్టీసీ ఎండీ సభ్యులుగా ఉన్నారని తెలిపారు.

# ప్రతికూలతలపై స్ఫూర్తిదాయక విజయానికి అంబేద్కర్ జీవితం నిదర్శనం

**లోక్‌భవన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులు అర్పించిన గవర్నర్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్14:** రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మంగళవారం లోక్‌భవన్‌లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా డా బి ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, డా. అంబేద్కర్‌ను భారతదేశపు గొప్ప పుత్రులలో ఒకరిగా, రాజ్యాంగ ప్రధాన రూపశిల్పిగా అభివర్ణించారు. 'ప్రతికూలతలపై మానవ స్ఫూర్తి సాధించిన విజయానికి అంబేద్కర్ జీవితం నిదర్శనం అన్నారు. దార్శనిక సంఘ సంస్కర్త, ప్రముఖ న్యాయకోవిదుడైన ఆయన న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల సాధికారతకు జీవితాన్ని అంకితం చేశారు. పేదలు, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదని పేర్కొన్న గవర్నర్, రాజ్యాంగ ఆదర్శాల పట్ల ప్రతి పౌరుడూ నిబద్ధతను పునరుద్ఘాటించాలన్నారు. 'బాబాసాహెబ్ ప్రతిపాదించిన ఐక్యత, సౌభ్రాతృత్వ స్ఫూర్తితో ముందుకు సాగాలి. దేశ వైభవాన్ని పునరుద్ధరించడానికి, అందరికీ న్యాయమైన, సమ్మిళిత సమాజాన్ని నిర్మించడానికి సమిష్టిగా కృషి చేద్దాం'అన్నారు.

# ఇండ్లు లేని 13 వేల మంది గిరిజనులు

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** తెలంగాణలో ఇండ్లు లేని గిరిజనులు 13,151 మంది ఉన్నారు. ప్రధానంగా రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో ఉన్న గిరిజనులకు ఇండ్లు లేవని ఆయా జిల్లాల కలెక్టర్లు కేంద్రనికి నివేదిక పంపించారు. తద్వారా ఒక్కో ఇంటి నిర్మాణానికి 2.39 లక్షల రూపాయల మేర ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉన్నట్లు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు.

దీనిపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఇటీవల కేంద్రం దృష్టికి కూడా తీసుకెళ్లారు. పిఎం జన్ మన్ పథకం కింద రాష్ట్రంలోని 13 వేల మంది గిరిజనులకు నిధులు వస్తే రాష్ట్ర ప్రభుత్వంపై కొంత వరకూ ఆర్థిక భారం తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# హైకోర్టుకు నలుగురు శాశ్వత అదనపు న్యాయమూర్తులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్14:**2025లో తెలంగాణ హైకోర్టుకు నియమితులైన నలుగురు అదనపు న్యాయమూర్తులను శాశ్వతం చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. మంగళవారం జరిగిన కొలీజియం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. శాశ్వత నియామకానికి సిఫార్సు చేయబడిన అదనపు న్యాయమూర్తులలో జస్టిస్ యారా రేణుక, జస్టిస్ నందికొండ నర్సింగ్ రావు, జస్టిస్ ఇ. తిరుమల దేవి, జస్టిస్ బి.ఆర్. మధుసూదన్ రావులు ఉన్నారు. 42 మంది న్యాయమూర్తులను తెలంగాణ హైకోర్టులో ఉండాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుతం 28 మంది న్యాయమూర్తులతో పనిచేస్తోంది, దీంతో 14 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీ ఉన్నాయి.

## తిరుమల సమాచారం



### టిటిడి ట్రస్ట్‌లకు రూ.37 లక్షలు విరాళం

తిరుమల, ఏప్రిల్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. మంగళవారం కర్ణాటక రాష్ట్రం బెలగావికి చెందిన ప్రవీణ్ సోన్వాల్కర్ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.17లక్షలు విరాళంగా అందించారు. సుభాష్ సోన్వాల్కర్ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు 10 లక్షలు విరాళంగా అందించారు. దాతలు తిరుమలలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు విరాళం డిడిలను అందజేశారు. బాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి: టిటిడి ఆధ్వర్యంలోని బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి దాత విరాళమిచ్చాడు. పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడుకు చెందిన కొవ్వూరి రామ్‌దీప్ రెడ్డి బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి రూ.10,01,116 లక్షలు విరాళంగా అందించారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం చెక్కును అందజేశారు.

### శ్రీవారి ఆశీస్సులందరిపై ఉండాలి



తిరుమల, ఏప్రిల్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి ఆశీస్సులు తెలుగురాష్ట్రాల ప్రజలకు కలగాలని, సుఖసంతోషాలతో ఉండాలని మాజీ సిఎస్ ఎల్‌వి సుబ్రమణ్యం ఆకాంక్షించారు. మంగళవారం ఉదయం సుబ్రమణ్యం దంపతులు విఐపి బ్రేక్‌లో తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం అందజేశారు.

# ఎఐ, క్వాంటం రంగాల్లో దేశానికి హబ్‌గా అమరావతి

### - కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి అభయ్ కరాందికర్



విజయవాడ, ఏప్రిల్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని సందర్భంగా ఏపీలో క్వాంటం టెస్టింగ్ ఫెసిలిటీలు మొదలు కావటం క్వాంటం విప్లవంలో ఓ బలమైన సందేశమని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి అభయ్ కరాందికర్ స్పష్టం చేశారు. ఐటీని అందిపుచ్చుకున్న సీఎం చంద్రబాబు ఇప్పుడు డీప్‌టెక్ రంగంలోనూ ముందడుగు వేశారని కొనియడారు. భవిష్యత్ టెక్నాలజీలను ప్రోత్సహించటం ద్వారా పెట్టుబడులు, ప్రగతిని వేగంగా సాధించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. భారత్ సాంకేతికంగా సార్వభౌమ దేశంగా, వికసిత్ భారత్‌గా మార్చటంలో ఇది కీలకమైన ముందడుగు అవుతుందని అన్నారు.

క్వాంటం ఉపకరణాలను దేశీయంగా తయారు చేయటంలో ఈ రిఫరెన్స్ ఫెసిలిటీలు ఎంతో కీలకమని గుర్తుచేశారు. క్వాంటం కంప్యూటర్ హార్డ్ వేర్ తయారీ, సర్టిఫికేషన్‌లో బెంచ్ మార్క్‌గా ఇది మారుతుందని తెలిపారు. ఉపకరణాలు ఒక్కటే కాదు క్వాంటం కంప్యూటింగ్ ద్వారా నూతన ఆవిష్కరణలు రావాల్సి ఉందని తెలిపారు. కమ్యూనికేషన్, ప్రెసిషన్ సెన్సింగ్, ఫైనాన్స్, డిజైన్లు, కొన్ని కీలకమైన రంగాల్లో క్వాంటం ద్వారా ఆవిష్కరణలు రావాలని పిలుపునిచ్చారు. ఈ క్వాంటం రంగంలో మానవ నైపుణ్యాలను కూడా పెంచుకునే దిశగా జాతీయ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నామని అభయ్ కరాందికర్ స్పష్టం చేశారు. క్వాంటం నిపుణులను తయారు చేయటంలో ఏపీ ముందంజలో ఉందని చెప్పారు. నేషనల్ క్వాంటం మిషన్ ద్వారా ప్రైవేటు రంగంలో చేసే పరిశోధనకు ప్రత్యేక నిధిని కూడా కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. విజనరీ సీఎం చంద్రబాబు క్వాంటం రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీల ద్వారా క్వాంటం రంగంలో విప్లవాన్ని అందిపుచ్చుకున్నారని కేంద్ర శాస్త్ర సాంకేతిక సలహాదారు అజయ్ కుమార్ సూద్ స్పష్టం చేశారు. క్వాంటం టెక్నాలజీలో స్వయం సమృద్ధి సాధించటంలో ఇది కీలకమైన ముందడుగని తెలిపారు. అమరావతి ఏఐ, క్వాంటం రంగాల్లో దేశానికి హబ్ గా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ రంగంలో నిపుణులను కూడా సత్వరం సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఐటీ లాగే క్వాంటం రంగంలోనూ ప్రపంచానికి మన సత్తా చాటాలని అజయ్ కుమార్ సూద్ పిలుపునిచ్చారు.

అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటు ద్వారా ఆంధ్రప్రదేశ్ ఓ కీలకమైన ముందడుగు వేసిందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా మారిపోతున్న వివిధ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని టెక్నాలజీ పరంగా మనం బలోపేతం కావాల్సి ఉందని అన్నారు. క్వాంటం హార్డ్ వేర్ తయారీలో భాగంగా ఇవాళ ప్రారంభించుకున్న రిఫరెన్సు ఫెసిలిటీలు కీలకంగా మారతాయని వివరించారు. దేశీయంగా తయారు చేసుకున్న ఉపకరణాలు స్వయం సమృద్ధిని సాధించటంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ క్వాంటం ప్రయణాన్ని సాఫ్ట్ వేర్, హార్డ్ వేర్ డెవలప్‌మెంట్‌తో పాటు ఇతర ఆవిష్కరణలకూ విస్తరించాలని కోరుతున్నట్లు అజయ్ కుమార్ తెలిపారు.



### సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రికి రెండు కళ్లు

కోవూరు (నెల్లూరు), ఏప్రిల్ 14 ప్రభాతవార్త: ఆంధ్ర ప్రదేశ్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలో పయనింపచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరులోని పెళ్లకూరు కాలనీలో 33 లక్షల నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, డ్రైన్‌లను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను క్రమం తప్పకుండా నెరవేరుస్తూ ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారన్నారు. నియోజకవర్గానికి మండల కేంద్రం అయిన కోవూరు పంచాయతీ పరిధిలో ఈ 22 నెలల పాలనలో 11 కోట్ల మేర అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి గడపకు సంక్షేమం, ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నా సూపర్ సిక్స్ లాంటి సంక్షేమ పథకాలను ఆపకుండా నిధులు అందిస్తున్న ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అనంతరం కోవూరు మండలంలోని 10 పంచాయతీలకు సంబంధించి 33 చెత్త రిక్షాలను వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పంపిణీ చేశారు.

## అలిపిరి టోల్ గేట్‌లో ప్రత్యేక కార్గో లేన్

### విస్తరణకు టిటిడి నిర్ణయం



తిరుమల, ఏప్రిల్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: దేశవిదేశాల నుండి శ్రీవారి దర్శనార్థం ఏడుకొండలకు వస్తున్న భక్తుల వాహనాలు, లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు తిరుపతి అలిపిరిలో టోల్‌గేట్ విస్తరణ చేయాలని టిటిడి నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటికే టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అలిపిరి టోల్ గేట్‌ను విస్తరణ చేయాలని భావిస్తున్నారు. ఇక్కడ ప్రత్యేకంగా కార్గో లేన్‌లను అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టనున్నారు. తిరుమలకు అవసరమైన పలు రకాల సరకు రవాణాను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక కార్గో లేన్‌ను నిర్మించేందుకు ప్రణాళిక సిద్దంగా ఉంది. ఇందుకు అలిపిరి టోల్‌గేట్ భారీ ఆధునీకరణ కార్యక్రమానికి టిటిడి ఆమోదం తెలిపింది. త్వరలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. కొండకు చేరుకునే వాహనాల రద్దీని తగ్గించడం, భద్రతను పటిష్టం చేయడం లక్ష్యంగా చేపట్టిన చర్యలో ఇదీ ఒక భాగంగా పేర్కొంటున్నారు. పునఃరూపకల్పన చేసే అలిపిరి చెక్ పోస్ట్‌లో 14 లేన్‌లు ఉంటాయని, వాటిలో మొదటి రెండు లేన్‌లు ప్రత్యేకంగా సరుకు రవాణా వాహనాల కోసం కేటాయించబడతాయి. మిగిలిన లేన్‌లు సాధారణ వాహనాల రాకపోకలకు ఉపయోగపడతాయి. తద్వారా యాత్రికులకు సులభమైన ప్రయాణం సాధ్యమవుతుంది. ప్రస్తుతం రోజుకు సగటున 10వేల వాహనాలను నిర్వహిస్తున్న అలిపిరి చెక్ పోస్ట్ వద్ద ఈ ఆధునీకరణ వలన వాహనాల రద్దీని నియంత్రించే వీలు కలుగుతుంది. ఇప్పటికే ఆమోదం పొందిన డిజైన్లు భవిష్యత్తులో మరో రెండు లేన్‌లను జోడించేందుకు కూడా వీలు కల్పిస్తున్నాయి. భూదేవి కాంప్లెక్స్ సమీపంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న కార్గో స్కానర్‌లను ఇప్పుడు అలిపిరికి తరలించి, కొత్త వ్యవస్థలో సరకు రవాణా తనిఖీలను ఏకీకృతం చేయనున్నారు. ప్రతిపాదిత కార్గో లేన్ ప్రస్తుత చెక్ పోస్ట్‌కు సుమారు 650 మీటర్ల ముందు ఉన్న వినాయక ఆలయం వరకు విస్తరిస్తుంది. కార్గో లేన్ పూర్తయిన తర్వాత చెక్ పోస్ట్ పూర్తి ఆధునీకరణ చేపట్టనున్నట్టుగా టిటిడి ఇంజనీరింగ్ అధికారుల సమాచారం. అప్‌గ్రేడ్‌లో భాగంగా అధునాతన స్క్రీనింగ్ పరికరాలను తెప్పిస్తున్నారు. వీటిలో డోర్‌ఫ్రేమ్డ్ మెటల్ డిటెక్టర్లు, వాహన స్కానర్లు, మానవ స్కానర్లు, లగేజీ స్కానర్లు ఉన్నాయి. ఇప్పటికే మూడు ప్రయోగాత్మకంగా అమర్చారు. ఈ నెలాఖరు నాటికి మరో మూడు డిఎఫ్ఎండిలు, రెండు అదనపు మెటల్ డిటెక్టర్లు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. మే నెల నాటికి లగేజీ స్కానర్లు రానున్నాయి. వాహనాల్లో కూర్చున్న యాత్రికులను తనిఖీ చేయడానికి వాహన స్కానర్లు, "గ్రీన్ స్కానర్ల" సరఫరా కోసం టిటిడి వెబ్‌సైట్‌లో టెండర్లను ఆహ్వానించింది.

## కూటమి కన్ను తెరిస్తే జగన్ అండ్‌కోకు దిబిడి దిబిడే

### - మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఆత్మకూరు (నెల్లూరు), ఏప్రిల్ 14 ప్రభాతవార్త: కూటమి కన్ను తెరిస్తే జగన్ అండ్ కోకు దబిడి దిబిడేనని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. రాజధాని మావిగన్ పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని ,మతిస్థిమితం లేని వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. రాష్ట్రాన్ని డ్రగ్ కల్చర్‌తో భ్రస్టు పట్టించాడని, దుర్మార్గమైన వ్యక్తి అని మండిపడ్డారు. ఆత్మకూరులో మంత్రి ఆనం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జువ్వలదిన్నెతో మత్స్యకార వర్గాలకు మంచి చేయాలని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే అడ్డుకట్టు వేయాలని ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. జువ్వలదిన్నెలో మొత్తం 950 మీటర్లలో 150 మీటర్లు మాత్రమే సాగర్ డిఫెన్స్‌కు ప్రభుత్వం ఇస్తుందని, మిగతాది మత్స్యకారులకేనని స్పష్టం చేశారు. మీ ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యే సముద్ర తీర ప్రాంతాన్నంత లే అవుట్లు వేసి అమ్ముకుంటుంటే ప్రశించలేని వ్యక్తివి ఏ ముఖం పెట్టుకొని మళ్ళీ మత్స్యకారుల దగ్గరకు వస్తావని నిలదీశారు. మత్స్యకారుల కోసం జగన్ రావడం లేదని, కాంట్రాక్టర్లను బెదిరించి కమీషన్లు గుంజుకునేందుకు వస్తున్నాడన్నారు. రహదారులపై జగన్నాధ రథచక్రాలు తిరుగుతున్నాయని వాటి కిందపడి నువ్వు నీపార్టీ నాయకులు నలిగిపోతారని హెచ్చరించారు. మీ బెదిరింపులకు బిదిరే వారు ఎవరూ లేరని మీ ఊరిలో ఎంపిటిసిని గెలిపించుకోలేని దౌర్భాగ్య స్థితిలో నువ్వు ఉన్నావని గుర్తుచేసుకోవాలన్నారు. జగన్ జువ్వల దిన్నెకు వీరభద్రుడిగా వస్తానంటే ఒట్టి భద్రుడుగా మిగిలిపోతవన్నారు. జరుగుతున్న పనులు చెడగొట్టాలని చూడడం దుర్మార్గమని, ఐదేళ్ళు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని నాశం చేశారని, తీర ప్రాంతానిన మీ ఎమ్మెల్యేలు లే అవుట్లు వేసి దోచుకున్నారని, నీవాళ్ళ దోపిడీని ఎందుకు అడ్డుకోలేదని, నువ్వు జువ్వల దిన్నెకి వస్తే ఎవరికీ భయం లేదని, సక్రమంగా తాము కన్ను తెరిస్తే ఎక్కడుంటారో తెలియదన్నారు. అభివృద్ధికి ఆటంకపరిస్తే జగన్నాధ రథచక్రాల కింద నలిగిపోతారు. విధ్వంసం చేయడానికేనా జువ్వలదిన్నె పర్యటన అని మంత్రి ప్రశ్నించారు.



### తిరుపతిలో ఎస్పీ అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు

తిరుపతి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి ప్రశాంతతకు, ప్రజల భద్రతే లక్ష్యంగా అసాంఘిక కార్యకలాపాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకునే అర్ధరాత్రి వేళ రోడ్లపై ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయడు స్వయంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రత్యేక దృష్టి సారించి, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు రహదారులు మాత్రమే కాకుండా వాణిజ్య సముదాయాలు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలు, గ్రామాలు, పట్టణాల్లో ఏకకాలంలో చేపట్టడం జరిగింది. పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ, తనదైన శైలిలో మార్గనిర్దేశం చేశారు.



### మాజీ సిఎం జగన్ పర్యటనకు సర్వం సిద్ధం

బిట్రగుంట (నెల్లూరు), ఏప్రిల్ 14 ప్రభాతవార్త: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె షిప్పింగ్ హార్బర్ సందర్శనకు ఈ నెల 15వ తేదీన మాజీ ముఖ్యమంత్రి రాష్ట్ర వైఎస్‌ఆర్సిపి అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటనకు సర్వం సిద్ధం చేసినట్లు వైఎస్‌ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి చెప్పారు. బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామంలో మంగళవారం వైఎస్‌ఆర్సిపి కేంద్ర పాలిటి బ్యూరో సభ్యులు మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, కావలి మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ ఇన్చార్జి రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, ఉదయగిరి మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రోగ్రాం కోఆర్డినేటర్ శాసన మండలి సభ్యులు తలశిల రఘురాం, పోలీస్ అధికారులతో కలిసి హెలిప్యాడ్ నిర్మాణం, సభా వేదికను పరిశీలించారు. అనంతరం కాకాని గోవర్ధన్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మత్స్యకారుల ప్రయోజనాల కోసం జువ్వల దిన్నెలో 70 ఎకరాల్లో షిప్పింగ్ హార్బర్ నిర్మాణం 90 శాతం పైగా పనులు పూర్తి చేయడం జరిగిందని, దీనిని పూర్తి చేసి మళ్లీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మత్స్యకారులతో స్వయంగా దీని జగన్మోహన్ రెడ్డి ప్రారంభించాలని అనుకున్నారన్నారు. అయితే ఆ తదనంతరం ఎన్నికల కోడ్ రావడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మిగిలిన 10 శాతం పనులు కూడా పూర్తి చేయకుండానే షిప్పింగ్ హార్బర్ కేటాయించిన 70 ఎకరాల భూముల్లో 29.5 ఎకరాలు సాగర్ డిఫెన్స్ కంపెనీకి కూటమి ప్రభుత్వం కట్టబెట్టిందన్నారు. మత్స్యకారులతో సంప్రదించకుండానే ప్రైవేటు కంపెనీకి హార్బర్ భూముల కేటాయించడాన్ని మత్స్యకారులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు.

## వైసిపి ఉన్మాద రాజకీయాలు చేస్తోంది

### ఎపి మంత్రి పార్థసారధి మండిపాటు



విజయవాడ, ఏప్రిల్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత ఐదేళ్ల కాలం ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. అధికార మదంతో విర్రవీగిన వైసిపి నేతలు, సామాన్యుల నుంచి ప్రతిపక్ష నేతల వరకు ఎవరినీ వదలకుండా వేధింపులకు గురిచేశారని మంత్రి పార్థసారథి మండిపడ్డారు. వైసిపి సాగించిన ఈ ఉన్మాద రాజకీయాలు చివరకు ఉగ్రవాదం కంటే ప్రమాదకరంగా మారాయని పౌర సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని పేర్కొన్నారు.

అమరావతిలో మీడియా సమావేశంలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. "గత ప్రభుత్వంలో చట్టాన్ని గౌరవించాల్సిన ప్రజాప్రతినిధులే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని అరాచకాలు సృష్టించారు. ప్రతిపక్షాలపై భౌతిక దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడం ద్వారా వారి గొంతు నొక్కారు. శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించడంతో రాష్ట్రంలో అశాంతి రాజ్యమేలింది. ప్రజల ఆస్తులను కబ్జా చేయడం, ప్రకృతి వనరులను దోచుకోవడమే పనిగా పెట్టుకున్న వైసిపి నేతలు, రాష్ట్రాన్ని అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారు. రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తూ, ఆర్థికంగా రాష్ట్రాన్ని దివాలా తీయించారు. మహిళలపై అసభ్యకర పోస్టులు పెడుతూ పైశాచిక ఆనందం పొందారు. మహిళలపై దాడులు జరుగుతున్నా, ఫిర్యాదులు అందుతున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట. వైసిపి అరాచకాలను భరించలేక ప్రజలు విసిగిపోయి మార్పు కోరుకున్నారు. కూటమి ప్రభుత్వం, అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని ముందుకు నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది" అని అన్నారు.

## మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరుతో కూటమి మోసాలు


### మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్



కర్నూలు అర్బన్ ఏప్రిల్ 14 ప్రభాతవార్త: కర్నూలులో నిర్వహించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విలేకరుల సమావేశంలో మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి తో కలిసి మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలపై గత పది నెలలుగా రాష్ట్ర పాలన అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. ప్రజా సమస్యలను పట్టించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వైయస్ జగన్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక కూటమి నేతలు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని అన్నారు. అమరావతిలో చదరపు అడుగుకు రూ.14,800 నిర్మాణ వ్యయం చూపడం దారుణమని పేర్కొన్నారు. హైదరాబాద్, బెంగళూరులో తక్కువ ఖర్చుతో నిర్మాణాలు జరుగుతున్నాయని, ఇక్కడ ఖర్చు ఎందుకు ఎక్కువగా ఉందని ప్రశ్నించారు. కేవలం ప్లానింగ్ కోసమే రూ. 400 కోట్లు ఖర్చు చేయడం అన్యాయమన్నారు. మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరుతో పనులు చేయకుండానే కాంట్రాక్టర్లకు రూ.5,500 కోట్లు చెల్లించారని ఆరోపించారు. రాజధాని మౌలిక వసతులకు రూ.2 లక్షల కోట్లు అవసరమని, ఈ అప్పులు ఎలా తీర్చుతారని ప్రశ్నించారు. నారా చంద్రబాబు నాయుడు నిర్ణయాల వల్ల రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. 'మావిగన్' ప్రతిపాదనపై దేశవ్యాప్తంగా సానుకూల చర్చ జరుగుతోందన్నారు. తక్కువ ఖర్చుతో రాజధాని సాధ్యమవుతుందని, మేధావులు ఈ ప్రతిపాదనను స్వాగతిస్తున్నారని చెప్పారు. మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు ప్రాంతాలను కలిపితే తక్షణ రాజధాని సాధ్యమని అభిప్రాయపడ్డారు. అభివృద్ధి, పథకాలపై విమర్శలు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులు నిలిచిపోయాయని విమర్శించారు. విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు రూ.10 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.2,600 కోట్లు ఉండటంతో ఆస్పత్రులు రోగులను చేర్చుకోవడం లేదన్నారు. నాడునేడు పనులు నిలిచిపోయి స్కూళ్లు, ఆస్పత్రుల పరిస్థితి దయనీయంగా మారిందని వివరించారు. వ్యవసాయం, రైతుల పరిస్థితి పూర్తిగా దెబ్బతిందని ఆరోపించారు. ఉద్యోగుల హామీలపై విమర్శలు, ఉద్యోగులు మళ్లీ మోసపోయారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మారుతున్న కాలానికి అనుగుణంగా అగ్నిమాపక సేవలు విస్తరించాలి

- ప్రజల సేవ పట్ల నిబద్ధతతే అగ్నిమాపక సిబ్బంది కీలక బాధ్యత
- అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభోత్సవంలో డిజిపి హరీష్ గుప్తా



విజయవాడ, ఏప్రిల్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలకు తెగించి చేసే సాహసాలు నిత్యస్మరణీయమని డిజిపి హరీశ్ కుమార్ గుప్తా వ్యాఖ్యానించారు. విపత్కర పరిస్థితుల్లో క్షణం ఆలోచించకుండా విధి నిర్వహణల్లోకి దూసుకుని వెళ్ళే వారి తెగువ ప్రశంసనీయమన్నారు. రాష్ట్రంలో అగ్నిమాపక శాఖ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. విజయవాడలోని గవర్నర్‌పేటలో అగ్నిమాపక శాఖ హెడ్ క్వార్టర్స్‌లో వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిజిపి హరీశ్ కుమార్ గుప్తా, ఫైర్ డిజి వెంకటరమణ పాల్గొన్నారు. అమరవీరుల స్మృతికి డిజిపి నివాళి అర్పించారు. అనంతరం జెండాను అవగతం చేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ ప్రమాదం సంభవించినప్పుడు ప్రతి ఒక్కరూ అక్కడి నుంచి పారిపోవాలని చూస్తారని, కానీ అగ్నిమాపక సిబ్బంది మాత్రమే లోపలికి వెళ్లి ప్రాణాలను కాపాడతారని అన్నారు. ఇది క్రమశిక్షణతో కూడిన ధైర్యం, నిరంతర శిక్షణ, ప్రజల సేవ పట్ల నిబద్ధత అని చెప్పుకొచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అగ్నిమాపక సేవలు విస్తరించాయన్నారు. పట్టణీకరణ, పారిశ్రామిక విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కారణంగా ప్రమాదాల తీవ్రత పెరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక శాఖ కేవలం ప్రమాదం జరిగినప్పుడు స్పందించే స్థాయి నుంచి డేటా, సాంకేతికత ఆధారంగా ముందుగానే అప్రమత్తమయ్యే దిశగా మారుతోందని వివరించారు. బాణసంచా పరిశ్రమలు, పారిశ్రామిక, రసాయన విపత్తులు వంటి అనేక సవాళ్లను చూస్తున్నామని డిజిపి తెలిపారు. భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాపార సంస్థలు, ప్రైవేట్ కార్యాలయాల నిర్వాహకులు బాధ్యతగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అందరూ కలిసి భద్రతా పరికరాలను ఏర్పాటు చేసుకుని, నిబంధనలను పాటించాలన్నారు. అగ్ని ప్రమాదాలను నివారించడం ఉమ్మడి బాధ్యతగా పేర్కొన్నారు. అగ్నిమాపక, పోలీస్, విపత్తు, ఆరోగ్య శాఖలన్నీ కలిసి ఒకే వ్యవస్థగా పనిచేయాలన్నారు. భవిష్యత్తులో అగ్నిమాపక భద్రతలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని డిజిపి హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు.

**ప్రజల్లో అవగాహన కల్పిస్తాం: అగ్నిమాపక శాఖ డిజి**

ఏప్రిల్ 20 వరకు వారం రోజుల పాటు అగ్నిమాపక శాఖ వారోత్సవాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు ఫైర్ డిజి వెంకటరమణ తెలిపారు. ఈ ఏడాది థీమ్ "సురక్షిత పాఠశాలలు, సురక్షిత ఆసుపత్రులు, అగ్నిమాపక భద్రతపై అవగాహన ఉన్న సమాజం, అగ్ని ప్రమాదాల నివారణకు కలిసి పనిచేస్తాయి" అని ప్రకటించారు. మార్చి 2025 నుంచి మార్చి 2026 వరకు సుమారు 13,000 ఫైర్ కాల్స్‌కు స్పందించినట్లు వెంకటరమణ వెల్లడించారు. మిచాంగ్ తుఫాను, భారీ వరదలు, బాణసంచా పేలుళ్లు, బస్సు ప్రమాదాల సమయంలో అగ్నిమాపక సిబ్బంది ధైర్యంగా సేవలు అందించారని చెప్పారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1,230 ఆసుపత్రులు, పాఠశాలల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించి ప్రజల్లో భద్రతా అవగాహన కల్పించినట్లు ఫైర్ డిజి వెంకటరమణ తెలిపారు.

### డిప్యూటీ తహసీల్దార్లకు వివిధ అంశాలపై శిక్షణ

విజయవాడ, ఏప్రిల్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా డిప్యూటీ తహసీల్దార్లుగా నియమితులైన వారు వివిధ అంశాలకు సంబంధించి ప్రభుత్వ విభాగాల్లో శిక్షణ తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కలెక్టరేట్, జిల్లా సర్వే డైరెక్టర్ కార్యాలయాలతో పాటు గ్రామాలకు వెళ్లి విఆర్‌ఏ, విఆర్‌ఓల వద్ద నాలుగు వారాలు పనిచేయాలి. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయం, పోలీసు శిక్షణకు సంబంధించి సిఐ కార్యాలయం, పంచాయతీ కార్యదర్శి, ఎంపిడిఓ వద్ద శిక్షణ తీసుకోవాలి. జడ్‌పి సిఇఓ, జలవనరులు, సహకార, వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖలతో పాటు ఆరోగ్య కేంద్రం, ఎపిహెచ్‌ఆర్‌డిఐ, సిసిఎల్లో శిక్షణ పొందాలి. మొత్తం 61 వారాల పాటు వివిధ ప్రభుత్వ విభాగాల్లో శిక్షణను నిర్దేశిస్తూ సిఎస్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు.

# రాష్ట్రపతిని మెప్పించిన చీరె



వారంతా సాధారణ నేతకార్మికులు... చదివింది పదోతరగతి లోపే కానీ... ఏదో సాధించాలని తపన పడేవారు. ఆ ఉత్సాహమే.. . వీరికి కొన్ని రకాల పట్టు చీరలను నేసే అవకాశాలను తెచ్చి పెట్టింది. దాన్ని సద్వినియోగం చేసుకున్న వీళ్లంతా తమలోని నైపుణ్యాన్ని చాటు కున్నారు. తాము తయారు చేసిన చీరతో రాష్ట్రపతిని మెప్పించారు. ఈ ఘనత సాధించిన ఉరవకొండ మహిళల గురించి మనమూ తెలుసుకుందాం..

కారుపోతుల శ్యామల, పుల్లా ధనలక్ష్మి, కారుపోతుల వేదావతి, పుల్లా తులసి, ఎర్ర పావని... వీళ్లంతా అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన నవదుర్గ చేనేత పారిశ్రామిక ఉత్పత్తి, విక్రయ కేంద్ర సభ్యులు. గత ఏడాది సెర్ప్ నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి చీరల నేతపై వీరికి ఉన్న ఉత్సాహాన్ని పేర్కొన్నారు. ఈ ఐదుగురికీ అవకాశం కల్పిస్తే అద్భుతాలు చేయగలరని భావించారు. బిగ్ టెంపుల్ స్టిచ్, బార్డర్ విత్ టెంపుల్ స్టిచ్, చెక్స్ బుటా విత్ బార్డర్, స్మాల్ టెంపుల్, గ్యాప్ బార్డర్ విత్ బుటా... ఇలా ట్రెండింగ్‌లో ఉన్న అనేక రకాల చీరలను తీయాలని ముందుకు వచ్చారు. అయితే ఇవి కాస్త ఖరీదైనవి, పైగా ఈ ప్రాంతంలో నేయనివి. అయినా వచ్చిన అవకాశంతో తమ సమర్థతను చాటి చెప్పాలనుకున్నారు. ఒక రకం 6 చీరలు చొప్పున మొత్తం 30 నేయడానికి కమిషనర్‌తో జిల్లాకు వారికి అవకాశం కల్పించారు. దానికి సంబంధించిన డిజైన్లను పంపారు. 30 చీరలకు ముడి సరకు, వేతనంతో కలిపి రూ.4.5లక్షల ఖర్చు అవుతుందని నిర్ధారించారు.

అలా తమ సొసైటీ ప్రతినిధులు రమేశ్. హరి సహకారంతో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ డిజైన్లను రూపొందించుకున్నారు. ఒక్కొక్కరూ నెలకు 3 చీరలు చొప్పున రెండు నెలల్లో వాటిని చేనేత మగ్గాలపై తయారు చేశారు. వాటనినన్నంటిని చేపేత, జౌళిశాఖ రాష్ట్ర కారాలయానికి పంపించారు. ఆ తరవాత వాటిని వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రదర్శనల్లో ఉంచితే మంచి డిమాండ్ వచ్చింది. మంత్రులు, ప్రజా ప్రతినిధులనుంచి అభినందనలు అందుకున్నారు.

**రాష్ట్రపతి ధరించారు....** ఈ కార్మిక బృందం గత డిసెంబరులో నేసిన చీరలను హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు కమిషనర్ రేఖారాణి చూపించారు. అందులో బార్డర్ విత్ టెంపుల్ స్టిచ్... రకం చీరను ఆమె రాష్ట్రపతికి అందించారు. 19న అయోధ్యలో శ్రీరామ యంత్రం బంగారు ఫలకాన్ని ఆవిష్కరించే కార్యక్రమంలో రాష్ట్రపతి ఆ చీరను ప్రదర్శించారు. భారత దేశంలోనే ఎంతో ప్రాముఖ్యం కలిగిన ఆధ్యాత్మిక క్షేత్ర పర్యటనలో ఉరవకొండ చేనేత చీర తళుక్కుమంది. ఈ విజయం ఐదుగురు మహిళలది మాత్రమే కాదు; ప్రోత్సాహం అందితే సామాన్య స్త్రీలు కూడా అసాధారణ ఫలితాలు సాధించగలరని నిరూపించిన సందర్భం ఇది. ◻

# ఇంట్లోనే అల్లం !



ఆహార పదార్థాలకు, చిరుతిళ్లకు చక్కని రుచిని తీసుకొస్తుంది. అంతేనా మన పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మరి అలాంటి తాజా అల్లాన్ని ఇంట్లోనే బాల్కనీలో టెర్రస్ గార్డెన్ కుండీల్లో సులభంగా పెంచుకోవచ్చు అది ఎలాగంటే... తాజాగా కాస్త లావుగా, మొగ్గలు వచ్చిన అల్లాన్ని తీసుకోవాలి. నాటడానికి ఒకరోజు ముందు దీన్ని నీటిలో నానబెట్టాలి. తరవాత రెండుమూడు అంతటా ముక్కలుగా కోయాలి. ప్రతి ముక్కలోనూ మొగ్గ ఉండేలా చూసుకోవాలి. అల్లం భూమిలో వెడల్పుగా పెరుగుతుంది కాబట్టి, లోతు తక్కువగా, వెడల్పు ఎక్కువగా ఉంటే కుండీని ఎంచుకోవాలి. మట్టి, వర్మీ కంపోస్ట్, కోకోపీట్, కొంచెం ఇసుక కలపాలి. ఇది అల్లం పెరగడానికి బాగా ఉపయోగపడుతుంది. అంతేకాదు, కుండీలో నీరు నిలవకుండా కింది భాగంలో రంధ్రాలుండేలా చూసుకోవాలి. అల్లం ముక్కల్ని మట్టిలో ఉంచి మొలకలు పైకి కనిపించేలా నాటాలి. ఎండ తక్కువ తగిలేలా మట్టి ఎప్పుడూ తేమగా ఉండేలా చూసుకోవాలి. సుమారు 810 నెలల్లో అల్లం కోతకు వస్తుంది. ◻



# వృద్ధాప్య ఛాయలు కనిపించకుండా !

కాస్త ఓపికగా ఉంటే, ఇంట్లో సహజంగా లభించే పదార్థాలతోనే చర్మాన్ని మెరిసేలా చేయడంతో పాటు చర్మ పోషణకు అవసరమైన పోషకాలను కూడా అందించవచ్చంటున్నారు నిపుణులు. ఈ సహజసిద్ధంగా లభించే అరటిపండు మనకు ఏవిధంగా ఉపయోగపడుతుందో చూద్దాం..

✦ బాగా మగ్గిన అరటిపండు ✦. తేనె- చెంచా, . బార్లీ పౌడర్ చెంచా ఈ ప్యాక్ కోసం తీసుకునే అరటిపండు బాగా మగ్గినదై ఉండాలి. అలాంటి అరటిపండు, తేనె, బార్లీపౌడర్ ఒక గిన్నెలో తీసుకుని బాగా కలపాలి. అరటిపండు చర్మాన్ని పట్టి ఉండదు.. వెంటవెంటనే జారిపోతూ ఉంటుంది. అందుకే ఇది చర్మానికి పట్టి ఉండేలా చేయడానికే ఇందులో బార్లీ పౌడర్ కలిపాలి. ఒకవేళ అరటిపండు మరీ బాగా మగ్గకపోయిన, బార్లీ పౌడర్‌కు బదులు వరిపిండి చెంచా వేసి కలుపుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని ముఖం కింద నుంచి పైకి పూతలా వేసుకోవాలి. 10 నుంచి 20 నిమిషాల పాటు ఆరనిచ్చి చల్లని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. అయితే అరనివ్వమన్నాం కదా అని ఫ్యాన్ కింద ఉంటే పొరపాటే ఈ ప్యాక్ ఎంత సహజంగా ఆరితే అంత ప్రయోజనం ఉంటుంది. ఇలా వారానికోసారి ఈ ఫేసప్యాక్ను అప్లై చేయడం వల్ల చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. అయితే, ఈ చిట్కాను పాటించేముందు ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మర్చిపోవద్దంటున్నారు. ◻

# సంకల్ప బలం



ఒక ఊరిలో ఓ జ్యోతిష్కుడు ఉండేవాడు. ఆయన జాతకం చెప్తే కచ్చితంగా జరుగుతుందని ప్రజల నమ్మకం. ఓరోజు చీకటి పడ్డాక ఒక రైతు ఆయన దగ్గరికి వెళ్లాడు. తన జాతకం చూపించి భవిష్యత్తు ఎలా ఉందో చెప్పమన్నాడు. దాన్ని చూసిన జ్యోతిష్కుడు నిర్ఘాంతపోయాడు. రైతు జీవితం కొన్ని గంటల్లో ముగియనున్నది. అతనికి రెండు గండాలు చూపించిన ఆ జాతకం ద్వారా సంకేతాలు ఆ విషయం అతనికి చెప్పలేక మరుసటిరోజు రమ్మని చెప్పాడు జ్యోతిష్కుడు. దాంతో రైతు తిరిగి వెనక్కి వెళ్తుండగా వర్షం మొదలైంది. తడిచిపోకుండా ఓ పాడుపడిన ఆలయంలోకి వెళ్లాడు. అక్కడ ఓ పెద్ద శివలింగం ఉంది. అయ్యో! ఇక్కడ దీపమైనా లేకుండా ఉందే అని విచారించాడు. తాను ఎలాగైనా ఆ గుడిని బాగు చేయాలని నిర్ణయించుకున్నాడు. గుడి నిర్మించాక మహా కుంభాభిషేకం చేయిస్తే ఇంకా బాగుంటుందని మనసులోనే అనుకున్నాడు. అదే సమయంలో ఏదో అలికిడి వినబడి వెనక్కి తిరిగి చూసేసరికి ఓ పాము పడగవిప్పి కాటు వేయడానికి సిద్ధంగా ఉండటం కనిపించింది. భయంతో ఒక్క ఉదుటున పరుగెత్తి గుడి బయటికి వెళ్లాడు. అప్పుడే ఓ పెద్ద మెరుపుతో పిడుగుపడి గుడి మొత్తం నేలమట్టమైంది. రైతు చాలా భయపడి.. పాము కనిపించడం మంచిదైంది. లేదంటే గుడి గోపురం నా మీద పడేది అనుకొని ఇంటికి చేరుకున్నాడు. మర్నాడు జ్యోతిష్కుని దగ్గరికి వెళ్లాడా రైతు, అతణ్ణి చూసి ఆశ్చర్యపోయిన జ్యోతిష్కుడు.. ఇదెలా సాధ్యం? అనుకుని, ఏం జరిగిందో చెప్పమని రైతుని ప్రశ్నించాడు. రైతు చెప్పినదంతా విని... ఓహో! నువ్వు గుడిని బాగు చేయాలి అని తీసుకున్న నిర్ణయమే నిన్ను కాపాడుతుంది. మంచి పని చేయాలనే సంకల్పం ఉంటే ప్రకృతి కూడా మనకు సహకరిస్తుంది అని అన్నాడు. ◻

# దోసకాయ మటన్

కావలసిన పదార్థాలు: దోసకాయ : ఒకటి, మటన్: అర కిలో, పచ్చికొబ్బరి తురుము: అరకప్పు, ఉల్లిగడ్డ: ఒకటి, పచ్చిమిర్చి: నాలుగు, నూనె: అరకప్పు, కరివేపాకు: రెండు రెబ్బలు, గసగసాలు: ఒక టేబుల్ స్పూన్, జీడిపప్పు: పది, గరం మసాలా: ఒక టీస్పూన్, కారం: రెండు టీస్పూన్లు, అల్లం వెల్లుల్లి పేస్ట్: ఒక టేబుల్ స్పూన్, పసుపు: ఒక టీస్పూన్, ఉప్పు: తగినంత, కొత్తిమీర తురుము: కొద్దిగా



**తయారీ విధానం:** ముందుగా మటన్‌ను బాగా కడిగి అరగంట పాటు ఉప్పు నీళ్లలో నానబెట్టాలి. స్టవ్‌మీద కుక్కర్ పెట్టి మటన్‌తోపాటు లీటరు నీళ్లు పోసి మూత బిగించి ఎక్కువ మంటమీద పెట్టాలి. ఏడు విజిల్స్ వచ్చాక దించేయాలి. మిక్సీగిన్నెలో పచ్చికొబ్బరి తురుము, జీడిపప్పు, గసగసాలు వేసి కొద్దిగా నీళ్లు పోసి మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. ఉల్లిపాయ, పచ్చి మిర్చిని కూడా మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. దోసకాయను తొక్కతీసి ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి నూనె వేడయ్యాక కరివేపాకు, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి పేస్ట్ వేయాలి. అన్నీ వేగాక దోసకాయ ముక్కలు, కారం, అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, గరం మసాలా, పచ్చికొబ్బరి మిశ్రమం కూడా జోడించి వేయించాలి. అన్నీ బాగా వేగాక మటన్ ఉడికించిన నీళ్లు పోసి, మూతపెట్టి సన్నటి మంటపై పది నిమిషాలు ఉడకనివ్వాలి. మిశ్రమం మరుగుతుండగా మటన్ ముక్కలు, తగినంత ఉప్పు, కొత్తిమీర తురుము వేసి మరో రెండు నిమిషాలు ఉడికించి దించుకుంటే నోరూరించే దోసకాయ మటన్ సిద్ధం ◻

# వేసవిలో చల్లగా ..



వేసవిలో పెరిగే ఉష్ణోగ్రతల వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురై వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంటుంది. మరి, అలా జరగకుండా ఉండాలంటే ఈ కాలంలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలి. అందుకు కొన్ని ఆహార పదార్థాలు ఉపయోగ పడతాయని పోషకాహార నిపుణులు. ఈ రకమైన శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి పదార్థాలు తీసుకోవాలో తెలుసుకుందాన..

**ఈ పండ్లతో...** వేసవి వేడి నుంచి తట్టుకోవడానికి ఈ కాలంలో వచ్చే కొన్ని పండ్లు ఎంతగానో ఉపయోగపడతాయి. ముఖ్యంగా తాటి ముంజలు, పుచ్చకాయ, తర్బూజా.. వంటి పండ్లు అటు రుచికి రుచితో పాటు ఇటు శరీరానికి చలువను అందిస్తాయట.

**డీహైడ్రేషన్ బారిన పడకుండా..** వేసవిలో అధికల వల్ల శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుకోవడం చాలా ముఖ్యం. అందుకోసం ఎక్కువ మొత్తంలో నీళ్ళు తాగడం తప్పనిసరి. అయితే నీళ్లతో పాటు నిమ్మరసం, లెమన్గ్రాస్ టీ, మిల్క్ షేక్, కోకమ్ పండుతో చేసిన షర్బత్, గుల్కంద్, ఆమ్ పన్నా, సత్తు డ్రింక్ (శెనగలుబెల్లం కలిపి సత్తుపిండితో చేసే పానీయం), అంబలి, కొబ్బరి నీళ్లు.. వంటివి తీసుకోవాలి. ఇవి రుచికరంగా ఉండడమే కాదు.. వీటితో శరీరానికి ఎక్కువ మొత్తంలో నీరు కూడా అందుతుంది.

**భోజనానికి ఇవి..** డ్రింక్స్, పండ్లే కాదు.. మనం రోజూ రెండు పూటలా తీసుకునే భోజనం విషయంలోనూ పలు మార్పులు చేర్పులు చేసుకోవాలి. పెరుగన్నం అప్పడాలు కలిపి తీసుకోవడం, జొన్నల్ని బాగా ఉడికించి సజ్జీ (అన్ని కూరగాయలను కలిపి చేసే కర్రీ)తో కలిపి తినడం, గంజి, పోహా, పెరుగు, అన్నం మామిడికాయ పచ్చిపులుసు.. ఇలాంటి ఫుడ్ కాంబినేషన్‌లో భాగంగా తీసుకోవాలి. ఫలితంగా ఇవి అధిక వేడి నుంచి శరీరాన్ని కాపాడి శరీరానికి చల్లదనాన్ని అందిస్తాయి.

**చెలి చిట్కా:** ✦ చక్కని ఆకృతికితోడు చేతులుకూడా మృదువుగా ఉంటే మరింత అందం చేకూరుతుంది. ✦ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం బంగాళాదుంప ఉడికించిన నీటిలో (చల్లారినతర్వాత) ఒక గంటసేపు చేతులను ఉచండి. ✦ మీ చేతులను రాత్రి పడుకొనే ముందు పెరుగు, గ్లిసరిన్ కలిపిన మిశ్రమాన్ని రాసుకొని పడుకోండి.

తెర

# 'డెకాయిట్'కు రెస్పాన్స్ ఆనందాన్ని ఇచ్చింది: సుప్రియ



**డెకాయిట్ కు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే ఎలా అనిపిస్తోంది ?**
చాలా హ్యాపీ. ఆడియన్స్ నుంచి వచ్చే రెస్పాన్స్ మనసుకు చాలా ఆనందాన్ని ఇచ్చింది.

**డెకాయిట్ ని రెండు భాషల్లో తీశారు కదా.. ఒక భాషలో తీసి డబ్ చేసి వుంటే బడ్జెట్ తగ్గేది కదా?**
అన్నీ బడ్జెట్ పరంగా అలోచేస్తే సినిమాకి, కథకి న్యాయం చేయలేం. సినిమా అంటే ఒక మ్యాజిక్ వుండాలి.

**పవన్ సింగ్ క్యామియో గురించి?**
పవన్ సింగ్, జోనితా లాంటి స్టార్స్ వుండటం వలన నార్త్ లో చాలా హెల్ప్ అయ్యింది. భోజ్ పురి వారికి తెలుగు సినిమాలు అంటే చాలా ఇష్టం. మాస్ సినిమా అక్కడ చాలా పాపులర్.

**డెకాయిట్ లో మీరు ఎదురుకున్న ఛాలెంజ్?**
దాదాపు అందరూ కొత్తవాళ్ళతో చేశాం. అందరూ యంగ్ టీం. అన్నపూర్ణ స్టూడియోస్, నాగార్జున గారు చాలా మంది కొత్తవాళ్ళని పరిచయం చేశారు.

**డెకాయిట్ క్లైమాక్స్ రిస్క్ అనిపించలేదా?**
మంచి సినిమాకి ఎప్పుడూ రిస్క్ వుంటుంది. ఈ సినిమాలో క్లైమాక్స్ నే అందం. నాకు డ్రామా, ప్రేమకథలు ఇష్టం, కాకపోతే ఇప్పుడు తెలుగు అవి మిస్ అవుతున్నాయి. హరి క్యారెక్టర్ లో శేష్ గారు అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. శేష్, మృణాల్ క్యారెక్టర్ ఆడియన్స్ ఎమోషనల్ గా కనెక్ట్ అయ్యాయి.

**యూఎస్ రెస్పాన్స్ ఎలా వుంది?**
అద్భుతంగా వుంది. వీకెండ్ కి వన్ మిలియన్ దాటేస్తుంది. మహిళలకు, యువతకు సినిమా చాలా కనెక్ట్ అవుతుంది.

**యస్ యస్ క్రియేషన్స్ లో సినిమాలు కొనసాగిస్తారా?**

**మీకు ఇష్టమైన ప్రేమకథలు?**
నేను తీసిన మన్మధుడు నా ఫేవరేట్. అలాగే జానకి రాముడు నాకు చాలా ఇష్టం. మజ్ను కూడా నా ఫేవరట్.అలాగే సత్యం సినిమా ఇష్టం. గీతాంజలి అయితే మా ఫ్రెండ్స్ అందరి ఫేవరేట్.

**ఇప్పుడు వస్తున్న హీరోయిన్స్ గురించి?**
ఇప్పటి హీరోయిన్స్ కి కాన్ఫిడెన్స్ చాలా ఎక్కువ. అలాగే మల్టీ ప్రాజెక్ట్స్ లో వారి ఫోకస్ వుంటుంది. ఇలాంటి పరిస్థితులులో కూడా మృణాల్ ఈ సినిమా కోసం తన ప్రాణం పెట్టి పని చేశారు.

**నాగార్జున గారి సినిమా అప్డేట్ గురించి?**
నాగార్జున గారు చెబినేతే బావుంటుంది. నేను చెప్పకూడదు(నవ్వుతూ)

# 'ఎం4ఎం' మే 8న విడుదల



'ఎం4ఎం'లోని బాలయ్యకు బాగా నచ్చిన 'హూ ఈజ్ ద కిల్లర్..' పాట ప్రపంచవ్యాప్తంగా 5 భాషల్లో రిలీజ్ పాన్ ఇండియా థ్రిల్లర్‌గా 'ఎం4ఎం' దర్శకుడు మోహన్ వడ్లపట్ల స్వీయ నిర్మాణం హైదరాబాద్ జో శర్మ ప్రధాన పాత్రలో, ప్రముఖ దర్శకుడు మోహన్ వడ్లపట్ల తెరకెక్కించిన సస్పెన్స్ థ్రిల్లర్ ఎం4ఎం (Motive for Murder)e ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నWho is the Killer పాటను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాటకు భాను మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు ఈ చిత్రంలో జో శర్మ సమ్బీత్ ఆచార్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని మోహన్ వడ్లపట్ల దర్శకత్వం వహించి, నిర్మించారు. ఆకట్టుకునే టైటిల్, ఆసక్తికరమైన ప్రమోషనల్ కంటెంట్‌తో, M4M ఆసక్తిని పెంచుతోంది. ఈ మూవీ హీరోయిన్, అమెరికన్ నటి జో శర్మ, ప్రముఖ నటుడు బాలకృష్ణని కలిసి, M4M చిత్రంలోని పాటను ఆయనకు చూపించారు. విజువల్స్, ప్రెజెంటేషన్‌ను చూసి బాలకృష్ణ చిత్రయూనిట్‌ని అభినందించారు. ఈ సందర్భంగా జో శర్మ.. బాలకృష్ణ ఆశీస్సులు తీసుకున్నారు. బాలకృష్ణ లాంటి ప్రముఖ నటుడిని కలిసి ఆశీర్వాదాలు పొందడం సంతోషంగా ఉందని జో శర్మ తెలిపారు.

# 'బ్యాడ్ బాయ్ కార్తీక్' ప్రీ రిలీజ్ ఈవెంట్



హీరో నాగ శౌర్య, రామ్ దేశినా (రమేష్) దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఇంటెన్స్ యాక్షన్ డ్రామా బ్యాడ్ బాయ్ కార్తీక్ చిత్రంతో మాస్ అవతార్‌లో రాబోతున్నారు. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మించిన ఈ చిత్రం, సూపర్ హిట్ పాటలు, శౌర్యను మునుపెన్నడూ లేని విధంగా ఇంటెన్స్‌గా చూపించిన పవర్‌ప్యాక్డ్ టీజర్, ట్రైలర్‌తో స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ నెల 17వ తేదీన విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా మేకర్స్ గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో నాగశౌర్య మాట్లాడుతూ.. ఈ వేడుకకు విచ్చేసిన అందరికీ థాంక్యూ. రసూల్ ఈ సినిమాలో నన్ను చాలా బాగా చూపించారు, శ్రీదేవి విజయ్ కుమార్ మాట్లాడుతూ.. . మా సినిమా ' బ్యాడ్ బాయ్ కార్తీక్ 'ఈ నెల 17న థియేటర్లలో రిలీజ్ అవుతుంది. నిర్మాత శ్రీనివాస్ చింతలపూడి మాట్లాడుతూ. ఇది మా ఫస్ట్ సినిమా. మా ఫస్ట్ హీరో నాగశౌర్యకి థాంక్యూ వెరీ మచ్. ఎంతో కష్టపడి, ఇష్టంతో చేసిన సినిమా ఇది. నిర్మాత అశోక్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో పనిచేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. జీ స్టూడియోస్ గిరీష్ మాట్లాడుతూ.. జీ స్టూడియోస్ తరఫున టీమ్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్.

# 'మారెమ్మ' నుంచి 'బావ బావ' సాంగ్ రిలీజ్



మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘుకుమారుడు మాధవ్ విలేజ్ యాక్షన్‌డ్రామా మారెమ్మతో హీరోగా బిగ్ స్క్రీన్ పై అడుగుపెడుతున్నారు. ఈ చిత్రంతో మంచాల నాగరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మయూర్‌రెడ్డి బండారు మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిన తర్వాత మేకర్స్ ఈ రోజు మారెమ్మ ఫస్ట్ సింగిల్ 'బావ బావ' సాంగ్‌ని రిలీజ్ చేశారు. ప్రశాంత్ ఆర్ విహారి స్వరపరిచిన ఈ పాటలో పల్లెటూరి మట్టి వాసనతో పాటు మోడరన్ మ్యూజిక్ లేయర్స్ మిళితమై ఎంతో మధురమైన అనుభూతిని కలిగిస్తోంది ప్లజెంట్ ఫీల్‌ను అందించేలా ఈ పాట సాగే తీరు ఆకట్టుకుంటుంది. కమల్ ఎస్లవత్ లిరిక్స్ బావపై ఉన్న ఆప్యాయతను ఎంతో సింపుల్‌గా, హృదయానికి దగ్గరగా వ్యక్తపరుస్తాయి. శృతి రంజని తన స్వరంలో ఉన్న నేచురల్, రస్టిక్ టచ్‌తో పాటకు మరింత ప్రాణం పోసింది. మాధవ్, దీపా బాలు మధ్య కనిపించే సహజమైన కెమిస్ట్రీ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. వారి యాక్టింగ్‌లో ఉన్న సహజత్వం, పల్లెటూరి అందమైన లోకేషన్స్ కలిసి విజువల్స్ ట్రీట గా మార్చాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ ప్రశాంత్ అంకిరెడ్డి అందించగా, సంగీతాన్ని ప్రశాంత్ ఆర్ విహారి సమకూర్చారు. ఎడిటర్‌గా దేవ్ రాథోడ్, ఆర్ట్ డైరెక్టర్‌గా రాజ్‌కుమార్ మురుగేసన్ పని చేస్తున్నారు. ఈ సినిమా విడుదల తేదీ త్వరలో అనౌన్స్ చేయనున్నారు.

# మే 1న 'పిఠాపురంలో' రిలీజ్

సీనియర్ దర్శకులు మహేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన ✓పిఠాపురంలో .. అలా మొదలైంద్ధి చిత్రం మే 1 న విడుదల కానుంది. డాక్టర్ రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ఇందులో ప్రధాన తారాగణం. మహేష్ చంద్ర సినిమా టీం బ్యానర్ పై దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్. ఎం. మురళి (గోదావరి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మించారు. దర్శకుడు మహేష్‌చంద్ర మాట్లాడుతూ "ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కి , 2 పాటలకు సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో ప్రేమ ఉంది. సునిశిత హాస్యం ఉంది. సెంటిమెంట్ ఉంది. తండ్రీకూతుళ్ల అనుబంధం ఉంది. తప్పటడుగులు వేస్తే యువతరం ఏం కోల్పోతుందో అనే హెచ్చరిక ఉంది. మొత్తంగా అటు పెద్దలకు ఇటు యువతకు మంచి సందేశం ఉంది. మన పక్కింట్లోనో, మన చుట్టూరా కనిపించే సహజమైన పాత్రలే ఈ సినిమాలో కనిపిస్తాయి. నిజంగా కెమెరా పెట్టి లైవ్ చేసినట్టుగా ఉంటుంది ఈ సినిమా. ఇలాంటి కాన్సెప్టులు ఎప్పుడూ ఎవర్ గ్రీన్. నాకు అప్పట్లో 'ప్రేయసి రావే ' ఎలా కెరీర్ టర్నింగ్ పాయింట్‌గా నిలిచిందో, ఇప్పుడు ఈ✓పిఠాపురంలో .. అలా మొదలైంద్ధి సినిమా నా కెరీర్‌ని టర్న్ చేస్తుందని బలంగా నమ్ముతున్నాను. ప్రముఖ శిల్పి రాజ్ కుమార్ వడయార్ ఇందులో ప్రముఖ పాత్ర లో నటించారు. హాస్య బ్రహ్మ డా. బ్రహ్మానందం గారి వాయిస్ ఓవర్ ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ " అని తెలిపారు.



# నాగబంధం సెకండ్ సింగిల్ 'సుర సుర' 19న విడుదల

దర్శకుడు అభిషేక్ నామా అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్', విరాట్ కర్ణా హీరోగా నటిస్తున్న చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇందులో పౌరాణిక కథ, చరిత్ర, యాక్షన్‌తో పాటు బలమైన ఎమోషన్స్, సాంస్కృతిక అంశాలు వున్నాయి. చిత్ర బృందం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సెకండ్ సింగిల్, ✓సుర సుర" (తెలుగు)ను ఏప్రిల్ 19న విడుదల 'సుర సుర' పాటను సంప్రదాయ పెళ్లి సంబరాల ఆనందం, ఉత్సాహాన్ని ప్రతిబింబించేలా రూపొందించారు. ఈ పాటకు సంగీతాన్ని జునైద్ కుమార్, అభే అందించగా, ఫోక్ ఎలిమెంట్స్‌ను సినిమాటిక్ ఆర్కెస్ట్రేషన్‌తో కలిపి ఫెస్టివ్ సాంగ్‌గా తీర్చిదిద్దారు. అనురాగ్ కులకర్ణి, కాల భైరవ, మంగ్లీ, సహితి చాగంటి, కనకవ్వ, నల్గొండ గద్దర్ వంటి గాయకులు ఈ పాటకు వోకల్స్ అందించారు. కాసర్ల శ్యామ్ రాసిన సాహిత్యం వేడుకలు, సంప్రదాయం, కలిసికట్టుగా ఉండే ఆనందాన్ని అద్భుతంగా ప్రతిబింబిస్తుంది. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగి రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్‌తో కలిసి రూపొంది స్తున్నారు. ఈ సినిమాలో నభా నటేష్, ఐశ్వర్యా మీనన్, రిషబ్ సాహ్నీ, జగపతిబాబు, గరుడ రామ్, మహేష్ మాంజ్రేకర్, జయప్రకాశ్, మురళీ శర్మ, అనసూయ భరద్వాజ్, బి.ఎస్. అవినాష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# గోపాల్‌గంజ్ పేస్ గన్

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కనుగొన్న అద్భుత ఆణిముత్యం సాకిబ్ హుస్సేన్. ఈ 21 ఏళ్ల యువ పేసర్ అరంగేట్రం మ్యాచ్‌లోనే రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్ల వెన్నులో వణుకు పుట్టించాడు. తొలి మ్యాచ్‌లోనే 4 వికెట్లు తీసి అదరహో అనిపించాడు. తన 4 ఓవర్ల కోటాలో 24 రన్స్ మాత్రమే ఇచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టాడు. తద్వారా ఐపీఎల్ అరంగేట్రంలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన భారత ఆటగాడిగా ముంబై ఇండియన్స్ బౌలర్ అశ్విని కుమార్ పేరిట ఉన్న రికార్డును సాకిబ్ సమం చేశాడు.

బీహార్‌లోని గోపాల్‌గంజ్ నుంచి వచ్చిన సాకిబ్ సైనికుడు కావాలనుకున్నాడు. దుర్భర ఆర్థిక పరిస్థితులు అతన్ని క్రికెట్ వైపు మరల్చాయి. సాకిబ్ కేవలం వేగంతోనే కాకుండా తన స్లోయర్ బంతులతో బ్యాటర్లను బోల్తా కొట్టించడంలో దిట్ట. గంటకు 140కిలోమీటర్ల పైగా వేగంతో బంతులు వేస్తూనే, అకస్మాత్తుగా వేగాన్ని తగ్గించి బ్యాటర్ల టైమింగ్‌ను దెబ్బతీస్తాడు. రాజస్థాన్ మ్యాచ్‌లో ఫెరీరాను తన స్లోయర్ బంతితోనే అవుట్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు.

సాకిబ్‌కు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీతో తొలి బ్రేక్ లభించింది. అక్కడ మంచి ప్రదర్శన ఇవ్వడంతో తమ నెట్ బౌలర్‌గా సీఎస్‌కే తీసుకుంది. 2024 ఐపీఎల్ వేలంలో సాకిబ్ అన్‌సోల్డ్‌గా మిగిలాడు. నిలకబడగా 140 కి.మీ వేగంతో బంతులు విసిరే సాకిబ్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ అక్కున చేర్చుకుంది. ఆ సీజన్‌లో ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. 2025వేలానికి ముందు అతడిని కేకేఆర్ వదలిపెట్టింది. సన్‌రైజర్స్ బౌలింగ్ కోచ్ వరుణ్ ఆరోన్ దృష్టిలో సాకిబ్ పడడంతో... అతన్ని మినీ వేలంలో 30 లక్షల బేస్ ధరతో తీసుకుంది. ఇప్పుడు ఆ నమ్మకాన్ని సాకిబ్ వంద శాతం నిలబెట్టుకున్నాడు.




# కుర్రాళ్లు కేక

***ఐపీఎల్ అంటే బ్యాట్స్‌మెన్ గేమ్. ఇక మెరుపు వీరులు, ధనాధన్ వీరులు, డైనమైట్లు, మ్యాచ్ ఫినిషర్లు పదుల సంఖ్యలో దూసుకురావడంతో బ్యాట్స్‌మెన్ హవా మరింతగా పెరిగింది. బంతి పడింది తడువే స్టాండ్స్‌లోకి పంపించే వాళ్లు రావడంతో ఎంతటి బౌలర్‌కైనా చుక్కలు కనబడుతున్నాయి. బంతి వేయడం వరకే బౌలర్లు పరిమితమవుతున్నారు. వికెట్ తీయడం అటుంచి డాట్ బాల్ వేయడమే అదే మహా భాగ్యం అన్నట్లుగా బౌలర్ల పరిస్థితి మారింది. ఇలాంటి పరిస్థితుల్లోనూ అపుడపుడూ బౌలర్లు పైచేయి సాధిస్తున్నారు. పిచ్ నుంచి కాసింత సహకారం లభించినా బ్యాట్స్‌మెన్ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు. ఇదే కోవలోకి వస్తారు. ఐపీఎల్ అరంగేట్ర బౌలర్లు ప్రఫుల్ హింగే, సకిబ్ హుస్సేన్.***

**(వార్త క్రీడా విభాగం):** వేదిక ఉప్పల్ స్టేడియం... సన్ రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్. మ్యాచ్‌కు ముందు అందరి చూపు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీపైనే. ఎవరి డామినేట్ చేస్తారన్నదానిపైనే లెక్కలన్నీ. వీరిద్దరి తర్వాత అందరి చూపు ఇషాన్ కిషన్, యశస్వీ జైస్వాల్‌పై. ఈ నలుగురు తప్పిస్తే మరొకరి ఊసే లేదు. ఇక బౌలర్లయితే ఊసేలోనే లేకుండా పోయారు. మ్యాచ్ ముగిసిన తర్వాత సీన్ రివర్స్. డెబ్యూ బౌలర్లు ప్రఫుల్ హింగే, సకిబ్ హుస్సేన్ ఒక్కసారిగా హీరోలుగా మారాయి. తమ సూపర్ స్పెల్‌తో హాట్ టాఫిక్ అయ్యారు. వీరు ఎక్కడి నుంచి వచ్చారని సెర్చ్ ఇంజిన్‌లో ఒకటే వెతుకులాట. నిజానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటింగ్‌లో తక్కువేమీ కాదు. ఆడిన అయిదు మ్యాచ్‌ల్లో నాలుగింటిలో 200 ప్లస్ రన్స్ చేసింది. బౌలర్ల వైఫల్యంతోనే మ్యాచ్‌లుచేజార్చుకుంటూ వస్తోంది. ఉప్పల్‌లోనూ 200 ప్లస్ చేసినా ఆరేంజ్ ఆర్మీ సేనలో, అభిమానుల్లో ఓ దిగులు. దీన్ని కాపాడు కుంటారా అని? ఇండియన్ పేసర్ హర్షల్ పటేల్, సీనియర్ పేసర్ జయ్‌దేవవ్ ఉనద్కత్ స్థానంలో జట్టులోకి వచ్చిన ప్రఫుల్ ప్రకాష్ హింగే, సాకిబ్ హుస్సేన్ అద్భుతం చేశారు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఈ పేస్ ద్వయం గెలుపు ట్రాక్‌లో నిలిపారు.







# నాగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్

నాగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రఫుల్ ప్రకాష్ హింగే.. రికార్డుతో ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. తొలి ఓవర్లోనే అద్భుత స్పెల్‌తో మెస్మరైజ్ చేశాడు. మూడు వికెట్లు తీసి రాజస్థాన్ రాయల్స్ టాప్ ఆర్డర్ కుప్పకూల్చాడు. తద్వారా 19 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలోనే తొలి ఓవర్‌లోనే మూడు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా ఘనత సాధించాడు.

సూపర్ ఫామ్‌లో ఉన్న వైభవ్‌ని రెండో బంతికే బౌన్సర్‌తో చెక్కాయించి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ఆ తర్వాత నాలుగోబంతికి జురేల్‌ను, ఆరో బంతికి ప్రిటోరియస్‌ను పెవిలియన్‌కు పంపాడు. ముగ్గురూ కూడా గోల్డెన్ డక్ అయ్యారు. తరువాతి ఓవర్ చివరి బంతికి పరాగ్ పనిపట్టాడు. ప్రత్యర్థి జట్ల బౌలర్లను వణికించిన రాయల్స్ టాప్ ఆర్డర్... హింగే బౌలింగ్‌కు వణికిపోయింది.

నాగ్‌పూర్‌లో 2002లో జన్మించిన ప్రఫుల్ హింగే... 2024-25 రంజీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీలను విధర్భ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఎత్తుగా ఉండే ప్రఫుల్, బంతిని వేగంగా వేయడమే కాకుం డా మంచి బౌన్స్‌ను రాబట్టగలడు. ఎంఆర్‌ఎఫ్ పేస్ ఫౌండేషన్‌లో రాటుదేలిన హింగే... ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో కూడా ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. తన క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌తో ఐపీఎల్ స్కౌట్స్ దృష్టిని ఆకర్షించాడు.

ఐపీఎల్ మెగా వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్... ప్రఫుల్ హింగ్‌ను కేవలం 30 లక్షలకు కొనుగోలు చేసింది. గత మ్యాచ్‌లోనే తుది జట్టులోకి వచ్చినా ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ వల్ల చివరి నిమిషంలో బెంచ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. రాజస్థాన్‌పై వచ్చిన అవకాశాన్ని రెండు చేతులా ఒడిసిపట్టుకున్నాడు. సీనియర్ బౌలర్ జయదేవ్ ఉనద్కత్ స్థానంలో జట్టులోకి వచ్చి, తాను ఏంటో ప్రపంచానికి చాటి చెప్పాడు.

# భారత్‌లో ఫార్ములా వన్ రేసు?



**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది భారత్‌లో ఫార్ములా వన్ రేసు నిర్వహించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. గ్రేటర్ నోయిడాలో 2011, 2012, 2013లలో ఇండియన్ గ్రాండ్‌ప్రి పేరుతో ఎఫ్1 రేసులు జరిగాయి. అనంతరం ట్యాక్స్ చెల్లింపు రాయితీలు ఇవ్వకపోవడం, ఇతరత్రా కారణాలతో 2014 నుంచి ఎఫ్1 రేసులు భారత్‌లో కొనసాగించేందుకు ఫార్ములావన్ నిర్వాహకులు ఆసక్తి చూపలేదు. వచ్చే ఏడాది భారత్‌లో ఎఫ్1 రేసు నిర్వహించేందుకు మూడుసంస్థలు ఆసక్తిగా ఉన్నాయి. విధివిధానాలు ఖరారు చేయడానికి ఆరు నెలలు పడుతుంది. భారత్‌లో ఎఫ్1 పునరాగమనం చేసేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. పన్ను రాయితీలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని మాండవీయ తెలిపారు.

# జోరుమీదున్న ఆర్సీబీ-లక్నోకు సవాల్

**బెంగళూర్:** ముంబై ఇండియన్స్‌పై విజయంతో జోరు మీదికొచ్చిన రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూర్... సొంత వేదికగా మరో మ్యాచ్‌కు సిద్ధమైంది. నేడు లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. నాలుగు మ్యాచ్‌లాడిన ఆర్సీబీ మూడు విజయాలు, ఒక పరాజయంతో మొత్తం ఆరు పాయింట్లతో ఉంది. మొదటి రెండుమ్యాచ్‌ల్లో ఎస్ఆర్‌హెచ్, సీఎస్‌కేలపై గెలుపొందిన ఆర్సీబీ ...రాజస్థాన్ రాయల్స్ చేతిలో పరాజయం పొందింది. గత మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను ఓడించి మళ్లీ గెలుపు ట్రాక్‌లోపడింది. ఆర్సీబీ టాప్ ఆర్డర్ సూపర్ ఫామ్‌లో ఉంది. ఫిల్ సాల్ట్, విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్, టిమ్ డేవిడ్... చక్కగా రాణిస్తున్నారు. దీంతో వీరిని కట్టడి చేయడం లక్నో సూపర్ జెయింట్స్‌కు సవాల్‌గా మారింది. రిషబ్ పంత్ నేతృత్వంలోని లక్నో సూపర్ జెయింట్స్ ఈ సీజన్‌లో అనుకున్న స్థాయిలో ఆడలేక నిరాశపరుస్తోంది. నాలుగు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, రెండు పరాజయాలతో ఉంది. లక్నోకు బ్యాటింగ్ ఆందోళన పరుస్తోంది. అయిడెన్ మార్క్‌రమ్, మిచెల్ మార్ష్ శుభారంభం ఇవ్వడంలో విఫలమవుతున్నారు. రిషబ్ ఒక్క మ్యాచ్‌లో తప్పిస్తే ఆకట్టుకునే ప్రదర్శన లేదు. నికోలస్ పూరన్ గాడిన పడాల్సి ఉంది. మ్యాచ్ ఫినిషర్‌గా మారిన ముకుల్ చౌదరీపై మరోసారి లక్నో ఆశలు పెట్టుకుంది.

**ఐపీఎల్‌లో నేటి మ్యాచ్**

| | |
|---|---|
| ఆర్సీ బెంగళూర్ V/S లక్నో సూపర్ జెయింట్ | రాత్రి 7.30 గం.లకు |

# సంజూకు ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్

**ముంబై:** భారత్ అతిథ్యమిచ్చిన టీ20 ప్రపంచకప్ నాకౌట్ స్టేజ్‌లో విరుచుకుపడి టీమిండియాకు కప్ అందించిన సంజూ శాంసన్‌కు తగిన గుర్తింపు దక్కింది. సంచలన ఇన్నింగ్స్ ఆడిన సంజూకు ఐసీసీ అవార్డు లభించింది. హ్యాట్రిక్ అర్ధ శతకాలతో దుమ్మురేపిన సంజూ... ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు ఎంపికయ్యాడు. మార్చి నెలకు ఐసీసీ జరిపిన ఓటింగ్‌లో టీమిండియా పేసర్ జస్ప్రీత్ బుమ్రాను వెనక్కి నెట్టేసి శాంసన్ ఈ గౌరవాన్ని అందుకున్నాడు. మహిళల విభాగంలో అమేలియా కేర్ అవార్డుకు ఎంపికైంది. సూపర్8లో వెస్టిండీస్‌పై 97.. సెమీఫైనల్లో ఇంగ్లండ్ మీద 89, ఫైనల్లో న్యూజిలాండ్‌పై 89 పరుగులతో రాణించిన సంజూ ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు. తనకు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు రావడం పట్ల సంజూ సంతోషం వ్యక్తం చేశాడు. ఐసీసీ అవార్డుకు ఎంపికవ్వడం గొప్ప అనుభూతని, తన క్రికెట్ ప్రయాణంలో మర్చిపోలేని దశ సమయంలో ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని సంజూ చెప్పాడు.



# చెన్నైకి రెండో విజయం

**చెన్నై:** గెలుపు ట్రాక్‌లో పడ్డ చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. సొంతగడ్డపై జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై భారీ తేడాతో నెగ్గింది. సంజూ శాంసన్(48), ఆయుష్ మాత్రే(38), డెవాల్డ్ బ్రేవిస్(41), సర్ఫరాజ్ ఖాన్(23) రాణించడంతో మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగుల పటిష్టస్కోరు చేసింది. 32 బంతుల్లో నాలుగు ఫోర్లు, మూడు సిక్స్‌లతో సంజూ వేగంగా 48 రన్స్ చేశాడు. సీఎస్‌కే ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 193 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నైట్‌రైడర్స్ మరోసారి విఫలమైంది. ఫిన్ అలెన్(1)ను అవుట్ చేసి కంబోజ్... కేకేఆర్ వికెట్ల పతనానికి నాంది పలికాడు. నూర్ అహ్మద్ మూడు వికెట్లు తీసి కేకేఆర్‌ను స్వల్ప స్కోరుకు కట్టడిచేశాడు. కెప్టెన్ అజింక్యా రహానే (28), సునీల్ నరైన్(24), రఘువంశీ(27), రింకూ సింగ్(6), కామరూన్ గ్రీన్(0) నిరాశపరిచారు. స్లాగ్ ఓవర్లలో రోవ్‌మన్ పావెల్, రమణ్‌దీప్ సింగ్ పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. చెన్నై సూపర్ కింగ్స్‌కు ఇది వరుసగా రెండో విజయం కాగా.. కోల్‌కతా నైట్ రైడర్స్ ఇప్పటివరకు గెలుపు బోణీ చేయలేకపోయింది. ఆడిన 5 మ్యాచ్‌ల్లో నాలుగింట పరాజయాలు పొందగా, ఓ మ్యాచ్ వర్షార్పణం అయింది. పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది.




# కరెన్సీ విలువ పెంపు దిశగా సింగపూర్ బ్యాంక్

**సింగపూర్ సిటీ, ఏప్రిల్ 14:** పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు ప్రపంచదేశాల్ని అతలాకుతలం చేస్తున్నాయి. దేశాల ఆర్థిక వ్యవస్థల్నే ప్రభావితం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే సింగపూర్ కీలక నిర్ణయం తీసుకుంది. సింగపూర్ కేంద్రబ్యాంక్ అయిన మానిటరీ అథారిటీ ఆఫ్ సింగపూర్ తన మానిటరీ పాలసీ విధానాన్ని ప్రకటించింది. ఇక్కడ పాలసీని మరింత కఠినతరం చేస్తూ అదే సమయంలో వృద్ధిపై కాకుండా ద్రవ్యోల్బణం నియంత్రణపై దృష్టిసారించింది. ఇందుకోసం కరెన్సీ విలువను పెంచుకోవాలని చూస్తోంది. ఒకవైపు ఇంధన ధరలు పెరగడం.. మరోవైపు సప్లై చెయిన్‌లో అంతరాయాలు ఏర్పడటం కారణంగా ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. దేశ ఆర్థిక వృద్ధి2026లో మందగించే అవకాశం ఉంది. ఇదే సమయంలో ద్రవ్యోల్బణం పెరుగుతుందని అంచనా వేస్తోంది. ఇక 2026 ఏడాదికి ద్రవ్యోల్బణం అంచనాల్ని 12 శాతం నుంచి 1.52.5 శాతానికి పెంచింది. తమ కరెన్సీ విలువల్ని పెంచడం ద్వారా దిగుమతి చేసుకునే వస్తువుల భారాన్ని తగ్గించుకోవాలని చూస్తోంది. సింగపూర్ వృద్ధి రేటు కిందటి త్రైమాసికంతో పోలిస్తే 0.3 శాతం తగ్గింది. మార్కెట్ అంచనాల కంటే తక్కువగా నమోదైంది.

సాధారణంగా ఏ దేశమైనా ఆర్థిక వృద్ధి మందగిస్తున్నప్పుడు వడ్డీ రేట్లను తగ్గించి మార్కెట్లోకి డబ్బును విడుదల చేస్తుంది. కానీ సింగపూర్ అందుకు భిన్నంగా టైటనింగ్ పాలసీని ఎంచుకుంది. మన దేశంలో ఆర్‌బీఐ.. వడ్డీ రేట్లను మార్చడం (పెంచడం లేదా తగ్గించడం లేదా స్థిరంగా ఉంచడం) ద్వారా ఆర్థిక వ్యవస్థను నియంత్రిస్తుంటుంది. కానీ సింగపూర్ సెంట్రల్ బ్యాంక్ పద్ధతి వేరు. సింగప వడ్డీ రేట్ల కంటే కరెన్సీ విలువపై ఎక్కువగా ఆధారపడతారు. సింగపూర్ తన డాలర్ (ఎస్ఎంబి) విలువను ఇతర ప్రధాన దేశాల కరెన్సీలతో పోల్చినప్పుడు కొంత మేర పెంచుతుంది.

సింగపూర్ డాలర్ బలంగా ఉంటే ఇతర దేశాల నుంచి వస్తువుల్ని కొన్నప్పుడు తక్కువ ధరకే వస్తాయి. అంటే దిగుమతి చేసుకున్న ద్రవ్యోల్బణం తగ్గుతుంది. ప్రస్తుతం సింగపూర్ రెండు విభిన్న సవాళ్లను ఎదుర్కొంటోంది. ఒకటి ద్రవ్యోల్బణం. నిత్యావసర వస్తువులు, విద్యుత్, గ్యాస్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. సామాన్యుడి బడ్జెట్ తలకిందులవుతోంది. రెండోది వృద్ధి మందగమనం.. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి వల్ల సింగపూర్ ఎగుమతులు తగ్గిపోయాయి. దేశ ఆర్థిక వృద్ధి రేటు నెమ్మదించింది. ఆర్థిక వృద్ధి తక్కువగా ఉన్నప్పుడు కరెన్సీని బలోపేతం చేయడం ఒక రకమైన సాహసమే. ఎందుకంటే కరెన్సీ విలువ పెరిగితే సింగపూర్ చేసే ఎగుమతులు ఇతర దేశాలకు ఖరీదైనవిగా మారుతాయి. సింగపూర్ కేంద్ర బ్యాంక్ నిర్ణయంతో నిత్యావసరాల ధరలుతగ్గే అవకాశం ఉంటుంది. విదేశీ ప్రయాణాలు చేసే వారికి సింగపూర్ డాలర్ ఎక్కువ విలువను ఇస్తుంది. ఎగుమతులు చేసే కంపెనీలకు మాత్రం లాభాలు తగ్గొచ్చు. కానీ ముడి సరుకును దిగుమతి చేసుకునే పరిశ్రమలకు ఖర్చులు తగ్గుతాయి. ఆర్థిక పరిస్థితిని గతంలోనూ పలుమార్లు టైటనింగ్ నిర్ణయాలు తీసుకుంది. 2008 ఆర్థిక మాంద్యం సమయంలో వృద్ధి పడిపోవడంతో కరెన్సీ విలువను తగ్గించి ఆర్థిక వ్యవస్థను ఆదుకున్నారు.

# భారత్ ఆర్థిక వృద్ధి 6.5శాతం




## ఐఎంఎఫ్ తాజా అంచనా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:** అంతర్జాతీయ ద్రవ్య నిధి ఐఎంఎఫ్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి భారత ఆర్థిక వృద్ధి అంచనాను స్వల్పంగా పెంచి6.5గా నిర్ధారించింది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధం వల్ల గ్లోబల్ సవాళ్లున్నప్పటికీ ఈ పెంపు చేసింది. తాజా వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్ / గ్లోబల్ ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్"లో విడుదలైన ఈ వృద్ధి అంచనాలు గత జనవరిలో ప్రకటించిన గత అంచనాతో పోలిస్తే 0.1 శాతం పాయింట్ పెంచింది. ఈ పెంపు భారతదేశం బాహ్య ఆర్థిక సవాళ్ల మధ్య కూడా బలమైన పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా కొనసాగుతోందని సూచిస్తోంది. మధ్యప్రాచ్య యుద్ధం కారణంగా చమురు ధరలు, రవాణా ఖర్చులు మరియు ద్రవ్యోల్బణ అంచనాలు ప్రభావితమయ్యాయి. ఈ పరిస్థితులు సమీప కాలంలో ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెంచి, గ్లోబల్ ఆర్థిక వృద్ధిని మందగింపజేయవచ్చని ఐఎంఎఫ్ పేర్కొంది. గ్లోబల్ స్థాయిలో ఐఎంఎఫ్ అంచనాలు అంత ఆశాజనకంగా లేవు.

2026 సంవత్సరానికి ప్రపంచ ఆర్థిక వృద్ధి అంచనాను 3.3 నుండి 3.1 కి తగ్గించింది. ఈ ఘర్షణ వల్ల ఇంధన మార్కెట్లు మరియు వాణిజ్య మార్గాల్లో అనిశ్చితి పెరిగిందని పేర్కొంది. యుద్ధం ఎక్కువ కాలం కొనసాగితే వృద్ధి మరింత తగ్గి, ద్రవ్యోల్బణం పెరగవచ్చని హెచ్చరించింది. భారత్ వృద్ధి సవరణ దేశం ఆర్థిక స్థిరత్వాన్ని సూచించినప్పటికీ, దిగుమతి చమురుపై అధిక ఆధారపడటం వల్ల పెరుగుతున్న ముడి చమురు ధరల ప్రభావానికి గురయ్యే అవకాశముందని వెల్లడించింది.

# టాప్‌గేర్‌లో ఆటోమొబైల్ సేల్స్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:** భారత ఆటోమొబైల్ రంగం మార్చి నెలలో బలమైన వృద్ధిని నమోదు చేసింది. ప్యాసింజర్ వాహనాల (కార్లు) విక్రయాలు గతేడాదితో పోలిస్తే 16 శాతం పెరిగాయి. ఈ మేరకు సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్) మంగళవారం గణాంకాలను విడుదల చేసింది. గత ఏడాది మార్చిలో 3,81,358 యూనిట్లుగా ఉన్న ప్యాసింజర్ వాహనాల విక్రయాలు, ఈ ఏడాది మార్చిలో 4,42,460 యూనిట్లకు చేరాయి. మార్కెట్లో పెరిగిన డిమాండ్, డీలర్‌షిప్‌ల వద్ద ఇన్వెంటరీ పెరగడం ఇందుకు ప్రధాన కారణమని సియామ్ పేర్కొంది. ఇదే సమయంలో ద్విచక్ర వాహనాల విక్రయాలు కూడా 19.3 శాతం పెరిగి 19,76,128యూనిట్లకు, త్రీవీలర్ల విక్రయాలు 21.4 శాతం పెరిగి 76,273 యూనిట్లకు చేరాయి. ఫిబ్రవరిలో కూడా వాహన విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 10.6 శాతం పెరిగాయి. పండుగల సీజన్, జీఎస్టీ రేట్ల తగ్గింపు, కొత్త మోడళ్ల రాక వంటి కారణాలతో 2026ఆర్థిక సంవత్సరంలో అమ్మకాల వృద్ధి 7 నుంచి 9 శాతం మధ్య ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.




## దిగ్గజ కంపెనీల షేర్లు పతనం అయినా తాత్కాలికమే!

# ఈక్విటీల్లో ఐటి సూచీలకు వార్ ఎఫెక్ట్

**ముంబయి, ఏప్రిల్ 14:** ఈక్విటీసూచీల్లో ఈవారం ప్రారంభంలోనే ఐటి రంగాలకు భారీ నష్టం వాటిల్లింది. దిగ్గజ కంపెనీల షేర్లు తిరోగమించాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ డిసిఎస్, పర్సిస్టెంట్ సిస్టమ్స్, ఇన్ఫోసిస్ , విప్రో షేర్లు 1 శాతం కంటే ఎక్కువ పతనమయ్యాయి.

**లాభాల్లో ఉన్నవి:** మార్కెట్ అంతా నష్టాల్లో ఉన్నప్పటికీ, కోఫోర్జ్ ఎంఫసిస్ లు మాత్రమే స్వల్ప లాభాలతో గ్రీన్ జోన్‌లో ట్రేడ్ అయ్యాయి. బెంచ్ మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ 50 కూడా 1.5 శాతానికి పైగా పడిపోవడంతో ఇన్వెస్టర్లలో ఆందోళన మొదలైంది. మార్కెట్ పతనానికి ప్రధాన కారణాలు ప్రస్తుత స్టాక్ మార్కెట్ క్రాష్ వెనుక కొన్ని కీలక అంతర్జాతీయ పరిణామాలు ఉన్నాయి. భౌగోమిడిల్ ఈస్ట్‌లో కాల్పుల విరమణ జరుగుతుందన్న ఆశలు అడియాశలయ్యాయి. గత వారాంతంలో జరిగిన అమెరికాఇరాన్ చర్చలు విఫలం కావడంతో యుద్ధ మేఘాలు మళ్ళీ కమ్ముకున్నాయి. ఇది మార్కెట్లలో అనిశ్చితిని పెంచింది. గ్లోబల్ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు ఒక్కసారిగా బారెల్‌కు 104 డాలర్ల మార్కును దాటాయి. చమురు ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయంతో ఇన్వెస్టర్లు రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడటం లేదు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్తతల వల్ల ఇన్వెస్టర్లు తమ షేర్లను విక్రయించి నగదును సురక్షితమైన పెట్టుబడుల వైపు మళ్ళిస్తున్నారు.

ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, ముడి చమురు ధరల పెరుగుదల భారతీయ స్టాక్ మార్కెట్‌పై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతున్నాయి. ముఖ్యంగా అమెరికా, యూరోపియన్ మార్కెట్లపై ఎక్కువగా ఆధారపడే ఐటీ రంగం, గ్లోబల్ సెంటిమెంట్ దెబ్బతినడంతో భారీ నష్టాలను చవిచూస్తోంది. టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ కంపెనీల షేర్లు పతనం కావడం అనేది ఇన్వెస్టర్లలో ఆందోళన కలిగించే అంశమే అయితే ఇది కేవలం తాత్కాలిక భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల జరుగుతున్న మార్పుగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. క్రూడ్ ఆయిల్ ధరలు బారెల్‌కు 104 దాటడం అనేది ద్రవ్యోల్బణ భయాలను పెంచుతోంది, దీనివల్ల మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి కొనసాగవచ్చు. బలమైన ఫండమెంటల్స్ ఉన్న ఐటీ షేర్లు ఇలాంటి పతనం సమయంలో ఆకర్షణీయమైన ధరలకు లభించే అవకాశం ఉంది. సాధారణ ఇన్వెస్టర్లు భయాందోళనలతో షేర్లను విక్రయించకుండా, మార్కెట్ స్థిరపడే వరకు వేచి చూడటం లేదా నాణ్యమైన స్టాక్స్‌లో సిప్ పద్ధతిలో పెట్టుబడులు కొనసాగించుకోవచ్చునినిపుణులు సూచిస్తున్నారు.

# మళ్లీ పెరిగిన వెండి, బంగారం ధరలు



**ముంబయి, ఏప్రిల్ 14:** పశ్చిమాసియా ఉద్రిక్తతలు మళ్లీ పెరిగిన వేళ బంగారం, వెండి ధరలు దాదాపు 0.60 శాతం వరకుపెరిగాయి. అంతర్జాతీయంగా కామెక్స్‌లో స్పాట్ పసిడి ధర 0.6 శాతం తగ్గి ఔన్స్‌కు 4,718.98 డాలర్ల వద్ద వద్ద స్థిరపడింది. అస్థిరత నేపథ్యంలో కొనుగోలుదారులు బంగారంలో పెట్టుబడి పెట్టడానికి ఎగబడుతున్నారు. ఇబ్బడి ముబ్బడిగా ఇన్వెస్ట్ చేస్తోన్నారు. దీని ప్రభావం కూడా రేట్ల పెరుగుదలకు కారణమైంది. బంగారం ధరల్లో లాభాల మోత ఎక్స్ఛేంజ్ ఎంసిఎక్స్‌లో బంగారం 0.5 శాతం తగ్గి, 10 గ్రాములకు రూ. 1,51,900 వద్ద ట్రేడ్ అయింది. వెండి ధర 1.97 శాతం పడిపోయి కిలోకు రూ. 2,38,486కి చేరింది. ముంబైలో వెండి స్పాట్ ధర కిలోకు రూ. 2.60 లక్షలుగా నమోదైంది. ముంబైలో 10గ్రాముల 24క్యారెట్ల బంగారం రూ.1,52,830, 22 క్యారెట్లు రూ. 1,40,090 పలుకుతోంది. పుణె, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కోల్‌కతాలోనూ ఇదే ధరలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌లో 24క్యారెట్లు రూ.15,393, 22 క్యారెట్లు రూ.14,110 చొప్పున ధరలు కొనసాగాయి.

# ఆ మూడు కంపెనీలపై ఇన్వెస్టర్ల నిరాశ



**ముంబయి, ఏప్రిల్ 14:** భారతీయ స్టాక్ మార్కెట్‌లో అగ్రగామిగా వెలుగొందుతున్న ఐటీసీ, టీసీఎస్, ట్రెంట్ షేర్లు గత ఏడాది కాలంలో ఇన్వెస్టర్లకు నిరాశనే మిగిల్చాయి. సెన్సెక్స్‌లో టాప్ లూజర్స్‌గా నిలిచిన ఈ షేర్లు స్వల్ప కాలికంగా తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ పరిణామాలు, యుద్ధ మేఘాలు , ఏఐ ముప్పు వంటి కారణాలతో ఈ దిగ్గజ కంపెనీల మార్కెట్ విలువ గణనీయంగా పడిపోయింది.

సిగరెట్లు , ఎఫ్ఎంసీజీ రంగంలో రారాజుగా వెలుగొందే ఐటిసి షేర్ ఏడాదికాలంలో 29పతనమైంది. ఇది సెన్సెక్స్‌లో అత్యధిక నష్టాన్ని నమోదు చేసిన షేర్‌గా నిలిచింది. మూడేళ్ల కాలపరిమితిలో చూసినా ఈ స్టాక్ 20 నష్టపోయింది. ఐటీసీ వాల్యుయేషన్లు ప్రస్తుతం ఆకర్షణీయంగా ఉన్నాయని షేర్‌ఖాన్ వంటి బ్రోకరేజ్ సంస్థలు భావిస్తున్నాయి. సిగరెట్ వాల్యూమ్స్ 6.5 పెరగడం, ఎఫ్ఎంసీజీ విభాగం 11 వృద్ధి సాధించడం సానుకూల అంశాలు. అందుకే దీనికి రూ. 400 వరకు టార్గెట్ ధరను నిర్ణయించారు. భారత ఐటీ దిగ్గజం టిసిఎస్ షేరు ఏడాదిలో 23.50 మేర క్షీణించింది. ఎఐ ఎఫెక్ట్ ఎక్కువగాఉంది. దీని వల్ల ఐటీ ఉద్యోగాలకు , ప్రాజెక్టులకు ముప్పు వాటిల్లుతుందనే ఆందోళన, ట్రంప్ టారిఫ్ వార్‌లు కూడా తోడయ్యాయి. అమెరికా వాణిజ్య విధానాల్లో మార్పులు వచ్చే అవకాశం ఉండటం. అమెరికా ఇరాన్ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీస్తున్న ప్రభావంతో టీసీఎస్ షేర్ ఐదేళ్ల కనిష్ట స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం ఈ స్టాక్ ధర రూ. 2,700 నుంచి రూ. 3,150 మధ్య ఉండొచ్చని వివిధ బ్రోకరేజ్ సంస్థలు అంచనా వేస్తున్నాయి. టాటా గ్రూప్‌కు చెందిన రిటైల్ విభాగం ట్రెంట్ షేర్ ఏడాదిలో 19 పడిపోయింది. ఆరు నెలల్లోనే 17శాతంనష్టాన్ని చవిచూసింది. లాంగ్ టర్మ్ ఇన్వెస్టర్లకు ఇది కాసుల వర్షం కురిపించింది. గత ఐదేళ్లలో ఈ షేర్ ఏకంగా 431 పెరగడం విశేషం. యాంటిక్ బ్రోకింగ్ సంస్థ రూ. 4,856 టార్గెట్ ధరను ఇస్తూ కొనవచ్చని రేటింగ్ ఇచ్చింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.